RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

01 జూన్ 2025 ఆదివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:1



## గిరిజనుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

### మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి



ఆదివాసీ, గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నూతన విధానాలతో అనేక పథకాలును ప్రవేశ పెట్టి పెద్దపీట వేసిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అంటేనే ఆదివాసీలు, ఆదివాసీల అంటేనే స్వర్గీయ ఇందిరాగాంధీ ని మంత్రి అన్నారు. అదే బాటలో రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నారని తెలిపారు. కిన్నెరసానిలోని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన తెలంగాణ ఆదివాసి కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనం శిక్షణ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ , ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ , ఎంపీలు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పాల్గొన్నారు.

ఈ



సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో ఆదివాసులకు హక్కులను కల్పించి చైతన్యాన్ని అందించారన్నారు. రాష్ట్రంలో ఏ మారుమూల గ్రామం వెళ్ళినా ఇందిరమ్మ పేరు తెలియని వాళ్ళు ఉండరని తెలిపారు. ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను గిరిజన, ఆదివాసీలకు పంపిణీ చేశారని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను కాపాడుకునేందుకు ప్రజాప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి ఎప్పుడు కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

కిన్నెరసానిలోని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన తెలంగాణ ఆదివాసీ శిక్షణా తరగతుల కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ , ఎంపీలు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల పాల్గొన్నాలు.

## అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలను ఏర్పాటు చేయాలి

### ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:** రాష్ట్రంలో అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలను ఏర్పాటు చేయడానికి సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోశాలల ఏర్పాటుకు సంబంధించి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయడమే కాకుండా, నిర్ణీత గడువులోగా నివేదిక రూపొందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

రాష్ట్రంలో గోశాలల ఏర్పాటు, నిర్వహణ, సంరక్షణ, అభివృద్ధి వంటి అంశాలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు. గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణ కోసం పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలు రూపొందించాలని చెప్పారు.

గోసంరక్షణ, వాటి నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు జరగాలని, మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

గోశాలల ఏర్పాటు కోసం అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని, కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బంధించినట్టుగా ఇరుకు స్థలాల్లో కాకుండా మేతకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండాలన్నారు. గోశాలల నిర్వహణ, సంరక్షణ విషయంలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించి పలు మార్పులను సూచించారు. మరో నాలుగైదు రోజుల్లోగా తుది మోడల్‌ను ఖరారు చేయాలని చెప్పారు.

**విశ్వసుందరి 2025 పోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

వార్తా 3 లో

## 72వ మిస్ వరల్డ్‌గా థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత చువాంగ్








హైదరాబాద్,మే31హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 72వ మిస్‌వరల్డ్ తుది పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 108 దేశాలకు చెందిన అందగత్తెలు పోటీపడగా...ఆఖరి అంచె పోటీలకు పలు పోటీల్లో సత్తా చాటి 40 మంది ఎంపికయ్యారు. ఫినాలేలో బాలీవుడ్ స్టార్లు జాక్వలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ కట్టర్ సందడి చేయనున్నారు. 2017 మిస్ వరల్డ్ మానుషీ చిల్లర్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఫైనల్ క్వశ్చన్ అండ్ ఆన్సర్ విభాగానికి ఒక్కో ఖండం నుంచి ఒక్కొక్కరు ఎంపిక కానున్నారు. ఫైనల్ పోటీలకు జడ్జిలుగా సోనూ సూద్, సుధారెడ్డి, 2014 మిస్ ఇంగ్లండ్ కెరీనా వ్యవహరించనున్నారు. మిస్ వరల్డ్ జడ్జిల ప్యానెల్ హెడ్‌గా మిస్ వరల్డ్ సంస్థ ఛైర్మన్ జూలియా మోర్లీ పర్యవేక్షించనున్నారు. మిస్‌వరల్డ్ జడ్జిల ప్యానెల్‌లో రానా దగ్గుబాటి, జయేశ్ రంజన్ సైతం ఉన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు సినీ ప్రముఖులు రానా, నమ్రతా తదితరులు హాజరయ్యారు. ప్రపంచ ముద్దుగుమ్మలు ర్యాంప్‌వాక్ చేసి అదరగొట్టారు. మిస్ వరల్డ్ ఫినాలే ప్రత్యక్షంగా చూసేందుకు ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబసమేతంగా హాజరయ్యారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు

మిస్ వరల్డ్-2025 విజేతగా థాయ్‌లాండ్ సుందరి

మిస్ వరల్డ్ -2025 విజేతగా నిలిచిన థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత చువాంగ్శ్రీ

3వ రన్నర్ అప్ మిస్ మార్టినిక్

2వ రన్నర్ అప్ మిస్ పోలాండ్

1వ రన్నర్ అప్ మిస్ పోలెండ్

అద్భుతమైన డ్రెస్ తో హర్షధ్వానాల మధ్య స్టేజ్ పైన ప్రత్యక్షమైన 71 మిస్ వరల్డ్ చెక్ రిపబ్లిక్ కు చెందిన క్రిస్టినా పిజ్కోవా

డాన్స్ పెర్ఫార్మెన్స్ తో ఉర్రూతలూగించిన బాలీవుడ్ స్టార్ ఇషాన్ కట్టర్నాటు నాటు పాటకు స్టెప్పులుఖండాల వారీగా ఎంపికైన టాప్ 4 కంటిస్టెంట్లకు ప్రశ్నలు అడుగుతున్న న్యాయ నిర్ణేతలు

వారి సమాధానాల ఆధారంగా మార్కుల కేటాయింపు

తద్వారా విజేత ప్రకటన

మిస్ వరల్డ్ ఫైనల్: ఖండాల వారీగా టాప్ వీళ్లేఅమెరికా అండ్ కరీబియన్: మార్టినిక్

ఆఫ్రికా: ఇథియోపియా

యూరప్: పోలెండ్

ఆసియా: థాయ్‌లాండ్

హీరో రానా చేతుల మీదుగా నటుడు సోనూసూద్ కి మిస్ వరల్డ్ హ్యూమానిటేరియన్ అవార్డ్



**జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ని జూబ్లీహిల్స్ నివాసంలో సినీ నటుడు అక్కినేని నాగార్జున కలిశారు. కుటుంబ సమేతంగా కలిసిన నాగార్జున తన కుమారుడు అఖిల్ వివాహ వేడుక ఆహ్వానాన్ని ముఖ్యమంత్రి కి అందించారు.

## కృష్ణ గోదావరి ద్వారా 15 టిఎంసిల నీరు హైదరాబాద్ కు

వార్తా 7 లో



ప్రజాబలం

01 జూన్ 2025 ఆదివారం

# అందరికీ అమృతాహారం పాలు

నేడు పాలు లేదా పాల ఉత్పత్తులు వినియోగించని కుటుంబాలు లేవు. భారత్‌లో పాల వాడకం ఓ వారసత్వ సంపదగా, ఆరోగ్య ప్రదాయినిగా, కుటుంబ సభ్యుల అమృతాహారంగా నేటికీ ప్రముఖ స్థానాన్ని పొందింది. పాలను నేరుగా తాగడం, టీ రూపంలో వాడడం, పెరుగు/మజ్జిగ అన్నంలో భాగం కావడం, పాల నుంచి తయారు చేసిన తీపి పదార్థాలను తినడం, పాలతో తయారైన శీతల పానీయాలు వాడడం, నెయ్యి లేదా వెన్న వినియోగించడం సర్వసాధారణంగా కనిపిస్తుంది. వైజ్ఞానిక శాస్త్రం, సుస్థిరాభివృద్ధి, సామాజిక ప్రభావం, డిజిటల్ విప్లవం, ఇన్నొవేషన్, ప్రజారోగ్య విభాగాల ప్రత్యక్ష ప్రభావం పాల ఉత్పత్తుల రంగాలపై పడుతున్నాయి. పాల ఉత్పత్తులు పెరగడంతో భారత్‌లో శ్వేత విప్లవం ఊపందుకుంది. నేడు శ్వేత విప్లవంతో పాటు హరిత, పరిశుభ్రత, భవిష్యత్తుకు అనుకూల అందుగులు పడుతున్నాయి. 1992లో ప్రపంచ పాల ఉత్పత్తి 524 మిలియన్ టన్నులు ఉండగా, 2024లో 979 మిలియన్ టన్నుల వరకు పెరిగింది. కేవలం భారత్‌లోనే 2023 – 24లో పాల ఉత్పత్తి 239.3 మిలియన్ టన్నులుగా నమోదు అవుతూ ప్రపంచంలోనే అత్యధిక పాల ఉత్పత్తి చేసే దేశంగా నిలుస్తున్నది. గత దశాబ్ద కాలంలో భారత్‌లో పాల తలసరి ఉత్పత్తి 48 శాతం పెరగడం గమనించారు. పాలను ఉత్పత్తి చేయడం, డైరీ ఉత్పత్తులను అందుబాటులోకి తేవడం, అన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా పేద పిల్లలకు పాలను అందుబాటులోకి తీసుకురావడం నిరంతరం జరగాలి. భారతీయుల భోజనంలో పాల పదార్థాలు ప్రధాన స్థానాన్ని ఆక్రమించాయి. 2024-25 వివరాల ప్రకారం భారత్‌లో 239.30 మిలియన్ టన్నులు, యూరోపియన్ యూనియన్‌లో 149.63 మిలియన్ టన్నులు, యూఎస్‌లో 102.66 మిలియన్ టన్నులు, చైనాలో 43.95 మిలియన్ టన్నులు, రష్యాలో 32.50 మిలియన్ టన్నులు, బ్రెజిల్‌లో 27.99 మిలియన్ టన్నులు, న్యూజిలాండ్‌లో 61. 32 మిలియన్ టన్నుల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. క్షీర గ్రంధులు కలిగిన క్షీరదాలు లేదా మమ్మేల్స్ నుంచి పాలు విడుదల అవుతాయి. అత్యధిక పోషకాలు కలిగిన గాఢ తెల్లని ద్రావణాన్ని పాలు అని పిలుస్తాం. నేడు క్షీర ఉత్పత్తుల ఉద్యమం కొనసాగుతున్న భారత్ సగర్వంగా 01 జూన్ రోజున "ప్రపంచ పాల లేదా క్షీర దినోత్సవం (వరల్డ్ మిల్క్ డే)" పాటిస్తున్నది. పాల ఉత్పత్తి పెరగడంతో పోషకాహార అవగాహన కలిగిన వినియోగదారులు, ఆవిష్కరణలతో కూడిన కంపెనీలు, అమిత అంకితభావం కలిగిన సుస్థిరాభివృద్ధి సుసాధ్యం అవుతున్నది. పాలలో కాల్షియం (29%), విటమిన్ డి(25%), పొటాషియం, ప్రోటీన్లు(17%), మెగ్నీషియం, సెలీనియం, ఫాస్ఫరస్(23%), విటమిన్ బి-12(15%), రైబోఫ్లావిన్(23%) లాంటి పలు ప్రధాన పోషకాలు ఉంటాయి. పాల ఉత్పత్తులతో గ్రామీణ రైతు కుటుంబాలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆదాయం పెంచుకోవడానికి అధిక కృషి జరుగుతోంది. పాల ఉత్పత్తులను తయారు చేసే డైరీ పరిశ్రమలు భారత్‌లో అధికంగా ఉన్నాయి. ఐరాసలోని "ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్" చొరవతో "ప్రపంచ పాల దినోత్సవం" కొనసాగుతున్నది. 2025 ప్రపంచ పాల దినం ఇతివృత్తంగా "డైరీ ఉత్పత్తుల శక్తిని తెలుసుకుందాం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. పాల చేసే మేలును తలుచుకుందాం, పాలను మన భోజనంలో భాగం చేసుకుందాం. ప్రపంచ పాల దినోత్సవం వేదికగా పాల ప్రాధాన్యాన్ని వివరించడం, పాల వినియోగాన్ని పెంచడం, సంపూర్ణ ఆరోగ్య సిద్ధికి పాలను అమృతాహారంగా ప్రతి రోజు అన్ని వయస్సుల ప్రజలు, ముఖ్యంగా పిల్లలు విధిగా వాడడం లాంటి లక్ష్యాలను అధిగమించడానికి కృషి జరుగుతుంది. నేడు మన సమాజంలో పేద వర్గాలను పాల వినియోగం వైపు మరల్చగలిగితే రేపటి ప్రజారోగ్యం పక్కా అవుతుంది, నేటి పిల్లలు రేపటి ఆరోగ్య పౌరులు అవుతారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హత గల ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు

## మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)















**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 31:** ప్రజాసంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఫలాలు అర్హత గల ప్రతి ఒక్కరికి అందేలా అధికార యంత్రాంగం సమిష్టిగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణ అభివృద్ధి,మహిళా–శిశు సంక్షేమ శాఖ మంత్రి,జిల్లా ఇన్చార్జ్ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)అన్నారు.శనివారం మంచిర్యాల జిల్లా నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్,ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్,వెంకటేష్ దోత్రే,రాజర్షి షా,అభిలాష అభినవ్,సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా,శాసన మండలి సభ్యులు మల్క కొమురయ్య,దండే విఠల్, మంచిర్యాల,బెల్లంపల్లి,ముథోల్ నియోజకవర్గాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,గడ్డం వినోద్,రామారావు పటేల్, జి.సి.సి.చైర్మన్ కొట్నాక తిరుపతి లతో కలిసి ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు,రెవెన్యూ, వ్యవసాయ,గృహ నిర్మాణ శాఖల అధికారులతో భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు,యాసంగి వరి ధాన్యం సేకరణ,ఖరీఫ్ సాగు సన్నద్ధం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి,జిల్లా ఇన్చార్జ్ మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. యాసంగి వరి ధాన్యం సేకరణ కొరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం సేకరించడం జరుగుతుందని,ధాన్యం సేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుతుందని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూభారతి నూతన ఆర్. ఓ. ఆర్. చట్టం–2025లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4 జిల్లాలో 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేసి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత సమస్యలను జూన్ 2వ తేదీలోగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. 2వ విడతలో జిల్లాకు ఒక మండలం చొప్పున ఎంపిక చేసి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. జూన్ 3వ తేదీ నుండి 20వ తేదీ వరకు అన్ని మండలాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూ భారతి చట్టం. రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు.రైతులు తమ భూములను స్వేచ్ఛగా సాగు చేసుకునేలా ఎలాంటి వివాదాలు లేకుండా భూభారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గానికి3వేల 500 చొప్పున రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు4 లక్షల50వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. అత్యంత పేదవారికి జాబితాలో చోటు కల్పించడం జరుగుతుందని, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వి. వి. టి. జి. లు, ఇతర ఆదివాసీలకు5వేల ఇందిరమ్మ ఇండ్లు ప్రత్యేకంగా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఖరీఫ్–2025 సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధం కావాలని,నైరుతి రుతుపవనాలు వస్తున్నందున విత్తనాలు,ఎరువులు అవసరమైన మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని,అధిక ధరలకు విక్రయిస్తూ,కృత్రిమ కొరత సృష్టించే వారిపై,నకిలీ/నిషేధిత విత్తనాలు,ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రకృతి వైపరీత్య నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని,నీటిపారుదల, వైద్య-ఆరోగ్య,వ్యవసాయ శాఖలు, సంబంధిత శాఖలతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని చేపట్టిన కార్యక్రమాలపై కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు.జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న దృష్ట్యా పాఠశాలలు, వసతిగృహాలు సిద్ధం చేయాలని తెలిపారు.అంగన్వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి కౌమార దశ పిల్లల కొరకు పౌష్టికాహారం కొరకు చిక్కీలను ఇవ్వడం జరుగుతుందని,అంగన్వాడీ టీచర్లకు 2 లక్షల రూపాయల రిటైర్మెంట్ బెన్ఫిట్స్,వేసవి సెలవులు ఇవ్వడం జరుగుతుందని,జీతాల పెంపుదల అంశంపై ప్రభుత్వం ఆలోచిస్తుందని,35 వేల 700 అంగన్వాడీ కేంద్రాలను ప్రి-ప్రైమరీ పాఠశాలలుగా మార్చడం జరిగిందని,50 రకాల ఆట వస్తువులు అందించడం జరిగిందని,టీచర్లు సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించి దేశంలోనే రాష్ట్రం ముందంజలో ఉండేలా కృషి చేయాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...ఏప్రిల్ 14వ తేదీన ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం-2025లో భాగంగా పైలెట్ మండలంగా జిల్లాలోని భీమారం మండలం ఎంపిక చేయడం జరిగిందని,ఈ క్రమంలో భీమారం మండలంలోని12 గ్రామపంచాయతీలలో 28 మంది సిబ్బందితో 4 బృందాలను నియమించి భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు.ఒక ప్రత్యేక సర్వే బృందంతో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 2 వేల148 దరఖాస్తులు రాగా1వేయి10 సాదాబైనామాపై అందాయని, న్యాయస్థానంలో కేసులు కొనసాగుతున్నందున తీర్పు అనంతరం పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. మిగిలిన1వేయి138 దరఖాస్తులలో 741 ఇప్పటి వరకు పరిష్కరించడం జరిగిందని,మిగిలిన వాటిని జూన్ 5వ తేదీ లోగా పరిష్కరిస్తామని తెలిపారు.మిగిలిన మండలాలలో జూన్ 3వ తేదీ నుండి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు మండలానికి 2 బృందాల చొప్పున ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో 2 వేల ఇండ్లు మంజూరు కాగా 991 ఇండ్లు గ్రౌండ్ ప్రక్రియ పూర్తయ్యాయని, నిర్మాణ దశను బట్టి బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.గత సంవత్సరం ఈ సమయానికి 1 లక్షా 35 వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేయగా ఈసారి 1 లక్షా 77 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని. తెలిపారు.గతంలో పోల్చితే ఈసారి 1.5/2 రెట్లు అధికంగా కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు.ఫిబ్రవరిలో ప్రత్యేక సమావేశం నిర్వహించి జిల్లాలో నకిలీ/నిషేధిత విత్తనాలు, ఎరువుల రవాణా,విక్రయంపై చర్యలు చేపట్టామని,ఇప్పటి వరకు 34 మందిని అరెస్టు కాగా 871 కిలోల నకిలీ/నిషేధిత విత్తనాలను స్వాధీనపర్చుకోవడం జరిగిందని తెలిపారు.జిల్లా సరిహద్దులో అంతర్గత చెకోపోస్టులను ఏర్పాటు చేసి విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు,అనంతరం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కిశోర బాలికల కొరకు ఇందిరమ్మ అమృతం పథకం క్రింద పల్లీలు, చిరుధాన్యాలతో తయారుచేసిన చిక్కీల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్,జిల్లా అటవీ అధికారి శివ్ అశిష్ సింగ్,పంచాయతీ రాజ్,గృహనిర్మాణ,పౌరసరఫరాలు,వ్యవసాయ శాఖల అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





**ఖమ్మం ప్రజాబలం ప్రతినిధి:** శనివారం నిర్వహించిన ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిధులుగా వచ్చిన తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ , పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కూమార్‌గౌడ్ ని పార్టీ కార్యక్రమాలు ముగిసిన అనంతరం వారి హైదరాబాద్ తిరుగు ప్రయాణంలో పొంగులేటీ శ్రీనివాస్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఖమ్మంలోని క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా వారిద్దరికి ఘనస్వాగతం పలికి, శాలువాతో సత్కరించినారు. అనంతరం కాసేపు పార్టీ ముఖ్యులతో కలిసి పలు అంశాలపై చర్చించినారు.

# విశ్వసుందరి 2025 పోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

"ఓపల్ సుచాట చుంగ్‌సీ" 72 వ ప్రపంచ సుందరి (Miss World 2025) గా నిలిచారు.









**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్ నగరంలో అంగరంగ వైభవంగా సాగిన విశ్వసుందరి 2025 పోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఉత్కంఠభరితంగా సాగిన గ్రాండ్ ఫినాలెలో థాయ్‌లాండ్‌కు దేశానికి చెందిన "ఓపల్ సుచాట చుంగ్‌సీ" 72 వ ప్రపంచ సుందరి (Miss World% 2025) గా నిలిచారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి హాజరైన ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య Miss World విజేతగా నిలిచిన ఓపల్ సుచాటకు 71వ విశ్వసుందరి క్రిస్టినా పిస్కోవా కిరీట ధారణ చేశారు. ముఖ్యమంత్రి సమక్షంలో మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ ప్రపంచ సుందరి విజేతను ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విశ్వసుందరి ఓపల్ సుచాటకు అభినందనలు తెలియజేశారు. మిగతా కేటగిరీల విజేతలకు కూడా అభినందనలు తెలిపారు. "తెలంగాణ సంస్కృతి, వారసత్వం, చరిత్ర, విలువలు, ప్రపంచానికి చాటాం. ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన సందర్శకులకు తెలంగాణ రైజింగ్ దార్శనికతను చూపించాం" అని ముఖ్యమంత్రి అన్నారు. చివరి దశలో ఖండాల వారిగా టాప్‌లో నలుగురు విజేతలుగా నిలవగా చివరి పోటీలో విశ్వసుందరి కిరీటం ఓపల్ సుచాటను వరించింది. ఈ 72 వ మిస్ వరల్డ్ పోటీల్లో 108 దేశాల నుంచి కంటెస్టెంట్లు పాల్గొన్నారు. ఈ నెల 7 వ తేదీన ప్రారంభమైన మిస్ వరల్డ్ పోటీల్లో వివిధ కేటగిరీల్లో అనేక దశల్లో విజేతలుగా నిలిచారు. ప్రపంచ సుందరి ఎంపిక అనంతరం హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి గారు మిస్ వరల్డ్ 2025 పోటీలు ముగిసినట్టుగా ప్రకటించారు.

పోటీకి హాజరైన కంటెస్టెంట్లు తెలంగాణలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించగా, హైదరాబాద్ ఆతిథ్యం అత్యద్భుతమని కంటెస్టెంట్లు ఆనందం వ్యక్తం చేశారు. "తెలంగాణ జరూర్ ఆనా" నినాదం ప్రస్తుతం విశ్వవ్యాప్తమైంది.

# వీరనారి అహల్యాదేవి హెూల్కర్

ప్రస్తుతం మహారాష్ట్రాలో ఉన్న అహల్యానగర్ జిల్లాకు చెందిన చోండీ గ్రామంలో పాటిల్ లేదా చీఫ్ అయిన సుశీల - మంకోజి షిండే దంపతులకు 31 మే 1725న జన్మించింది అహల్యాబాయి. నాటి కాలంలో బాలికలు పాఠశాలకు వెళ్లే వారు కానప్పటికీ తల్లితండ్రుల చొరవతో చదవడం, రాయడం నేర్చుకుంది. నిరాడంబరమైన కుటుంబంలోంచి ఎదిగిన 8 ఏండ్ల అహల్యాబాయి ఆలయ సేవలను, భక్తిని, ప్రవర్తనను గమనించిన మాల్వా ప్రాంత సైనిక కమాండర్ మల్హార్ రావు వెంటనే తన 10 ఏండ్ల కుమారుడు ఖండేరావుకు తగిన వధువుగా ఎంపిక చేసుకొని వివాహం జరిపించారు. 1745లో ఆ యువ జంటకు మలే రావు అనే కుమారుడు, 1748లో ముక్తాబాయి అనే కూతురు జన్మించారు. 1754లో కుంబేర్ ముట్టడి సమయంలో జరిగిన ఫిరంగుల కాల్పుల్లో ఖండేరావు మరణించగా నాటి ఆచారం ప్రకారం సతీ సజీవ దమనం చేసుకోవడానికి సిద్ధపడిన అహల్యాబాయిని మామ గారైన మల్హార్‌రావు ఒప్పించి తన కోడలును కాపాడారు. విధవరాలైన అహల్యాబాయికి రాజ నీతి, రాజ్య పాలన, యుద్ధ నైపుణ్యాలు, ప్రజా సంక్షేమాల్లో శిక్షణ ఇవ్వడంతో ఆమె రాజ్య వ్యవహారాలను చక్కగా చూసుకోవడం జరిగింది. 1766లో మామ గారైన మల్హార్ రావు మరణించడంతో తన కుమారుడు మలేరావు రాజ్య బాధ్యతలను తీసుకోవడం, మానసిక అనారోగ్యంతో తన కుమారుడు మరణించడంతో దెబ్బ మీద దెబ్బ పడినట్లు అహల్యాబాయిని సమస్యలు వెంటాడాయి. నాడు స్త్రీల రాజ్య పాలనకు అనర్హులుగా పరిగణించాడే వారు. కాని అహల్యాబాయి శక్తి, యుక్తి, పాలనా పటిమ, ప్రవృత్తి లాంటి పలు సామర్థ్యాన్ని గుర్తించిన నాటి మరాఠా ముఖ్యులు ఆమె సింహాసనం స్వీకరించడానికి అంగీకారం తెలిపారు.

అహల్యాబాయి మహారాణిగా పదవి చేపట్టిన తర్వాత తన సైన్యాన్ని ఆధునీకరిస్తూ బలోపేతం చేయడం, దౌత్య సంబంధాలను పటిష్ట పరచడం, పరిపాలనలో తనదైన ముద్రను చూపడంతో పాటు నిర్మాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చేది. ఆమె సమర్థవంతమైన పాలనలో ప్రజలు శాంతి, స్థిరత్వం, పురోగతి, ఆధ్యాత్మిక వికాసం లాంటి అంశాలను రుచి చూడగలిగారు. ప్రజలతో మమేకం అవుతూ వారి యోగక్షేమాలు చూసుకుంటూ రామరాజ్యా స్థాపన చేసిన అహల్యాబాయి మహారాణి నాటి ప్రజల ఆరాధ్య దైవంగా మారిపోయారు. నాడు మహిళలు పాటించే పర్దా లేదా స్త్రీల ఏకాంతవాసం ఆచారాన్ని పాటించకుండా ప్రజలతో నేరుగా ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉండేది. వివాదాల పరిష్కారం కోసం కోర్టులను కూడా స్థాపించడా అహల్యాబాయి రాణికి మాత్రమే ప్రత్యేకం. యుద్ధ భూమిలో తన సామర్థ్యాన్ని ప్రదర్శించిన ఒక సామాన్య వ్యక్తికి తన కూతురును ఇచ్చి వివాహం జరిపించడం అహల్యాబాయి దార్శనికతకే నిదర్శనం.

మహారాణిగా అహల్యాబాయి అనేక కోటలు, రోడ్లు, బావులు,వధర్మశాలలు, హిందూ దేవాలయాలు విశ్రాంతి గృహాలను నిర్మించడంతో పాటు నర్మదలా నది ఒడ్డున తన రాజధానిగా మహేశ్వర్(శివుని నివాసం)ను (నేటి మధ్యప్రదేశ్) నిర్ణయించింది. అనేక మంది కళాకారులు, శిల్పులకు ఉపాధి కల్పించడమా కాకుండా వారణాసి, ఘృష్ణేశ్వర్, త్రంబక్, గయా, పుష్కర్, ద్వారక, ఉజ్జయిని, రామేశ్వరం, అయోధ్య, హరిద్వార్, మథుర, శ్రీశైలం, బృందావన్, నాథద్వారా, బద్రీనాథ్, కేగార్నాథ్ లాంటి పలు ఆలయాలను పునర్నిర్మించడం జరిగింది. శివుడికి నివాళిగా దేశవ్యాప్తంగా జ్యోతిర్లింగాలను పునరుత్థానం చేసింది. మొగుల్ చక్రవర్తి ఔరంగాజేబు కాశీ ఆలయాన్ని నాశనం చేసిన శతాబ్దం తర్వాత, ఆమె 1780లో కాశీ ఆలయాన్ని పునర్నిర్మించింది. మహేశ్వర్‌లో వస్త్ర పరిశ్రమను సహితం స్థాపించడం జరిగింది. 13 ఆగష్టు 1795న అహల్యాబాయి హెూల్కర్ మహారాణి మరణించడంతో మల్హార్ రావు దత్తపుత్రుడు తుకోజీ రావు సింహాసనం అధిష్టించిన రెండు ఏండ్ల తర్వాత తన కుమారుడు జస్వంత్ రావుకు సింహాసనం వదులుకున్నారు. 1804లో బ్రిటీష్ వారితో యుద్ధంలో ఓడిపోయినా చివరి హెూల్కర్ పాలకుడిగా మిగిలి పోయారు. మహారాణి అహల్యాబాయి హెూల్కర్ బహుముఖ ప్రజ్ఞకు గుర్తుగా ఇండోర్ విమానాశ్రయానికి అహల్యాబాయినహెూల్కర్ విమానాశ్రయంగా, ఇండోర్‌లోని విశ్వవిద్యాలయానికి దేవి అహల్యాబాయి యూనివర్సిటీగా, సోలాపూర్‌లోని విశ్వవిద్యాలయానికి పుణ్యశ్లోక్ అహల్యాదేవి హెూల్కర్ యూనివర్సిటీగా పేరు పెట్టడం జరిగింది. పాలనలో దాతృత్వం, సామాజిక సంస్కరణలు, కళలు, సంస్కృతికి మద్దతుగా నిలిచిన అహల్యాబాయి నేటి ఇండోర్ నగర అభివృద్ధికి నాడే పటిష్ట బీజాలు నాటారు. వితంతువులకు ఆస్తి హక్కు, మహిళాసాధికారతలకు పెద్ద పీట వేశారు. రాజమాతో అహల్యాదేవి హేల్కర్‌గా ప్రసిద్ధి గాంచి భారత స్వాతంత్ర్యానికి ముందు అత్యంత శక్తివంతమైన మహిళగా రుజువు చేసుకున్నారు. తత్వవేత్త రాణిగా, సమర్థురాలైన పాలకురాలిగా కీర్తించాడిన అహల్యాబాయి భక్తురాలిగా, ధైర్యం కలిగిన నాయకురాలిగా కీర్తించబడ్డారు. ఆమె విలక్షణ సుపరిపాలన, సామాజిక సంస్కరణలు, సైనిక విజయాలను విస్మరించిన నాటి పాలకులు చరిత్ర పుస్తకాల్లో అహల్యాబాయి హెూల్కర్ ప్రస్తావనలు చాలా తక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అహల్యాబాయి 300న జన్మదినోత్సవాల

# రాజకీయాల్లో ఏక్ నిరంజన్...

విజయవాడ, మే 31,బీఆర్ఎస్ లో కల్వకుంట్ల కవిత కాక మామూలుగా లేదు. నిజమే రక్త సంబంధం.. ఆప్యాయతలు.. రాఖీ పండగలు.. ఇవన్నీ ట్రాష్. రాజకీయాలలో పదవులు, అధికారం, ఆధిపత్యమే ముఖ్యం. తెలుగు రాష్ట్రాల్లో ఇది మరోసారి రుజువయింది. అధికారంలో ఉన్ననాళ్లు కలసి మెలిసి ఉన్నట్లు లేనిపోని ప్రేమలు పంచుకున్న వారే అధికారం కోల్పోయిన తర్వాత పగ పెంచుకుంటున్నారు. మరి తేడా ఆస్తుల వల్ల వచ్చిందా? లేదా పార్టీలో తమకు కూడా పార్ట్ నర్ షిప్ ఇవ్వాలని కోరుకోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందన్నది తెలియదు కానీ రెండు తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇది సర్వసాధారణమయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లు విడిపోయిన తర్వాత జరుగుతున్న ఈ పరిణామాలు రెండు పెద్ద కుటుంబాలను నడిరోడ్డు మీదకు నెట్టేశాయి. అక్కడా .. ఇక్కాడా సేమ్ పాలిటిక్స్.. కాకుంటే క్యారెక్టర్ యాక్టర్లు వేరు. పొలిటికల్ సీన్ మాత్రం సేమ్ టు సేమ్. ఒకరు కొన్ని దశాబ్దాల పాటు పోరాడి.. చివరకు పార్టీని అధికారంలోకి తెచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం. అదే సమయంలో తెలంగాణ కోసం దశాబ్దాల పాటు పోరాటం చేసి సాధించి తెచ్చిన కేసీఆర్ కుటుంబం. ఇద్దరు నేతలకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. వారి పోరాటం అందరికీ స్ఫూర్తి. ఎందుకంటే అసమాన్యమైన ఘనతను సాధించి చరిత్ర సృష్టించారు. అయితే కాంగ్రెస్ పార్టీ పూర్తిగా రాజకీయంగా ఇబ్బందుల పడుతున్న వేళ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పార్టీని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పదేళ్ల పాటు కాంగ్రెస్ ను అధికారంలోకి తేగలిగారు. ఇక రాదు రాదు అనుకుంటున్న తెలంగాణ ను తెచ్చిన కేసీఆర్ కూడా బీఆర్ఎస్ ను దాదాపు పదేళ్ల పాటు అధికారంలో ఉంచారు. 2014లో వైసీపీ అధికారంలోకి రాకపోయినా అన్నా చెల్లెళ్లయిన జగన్, షర్మిల మధ్య విభేదాలు తలెత్తలేదు. జగన్ జైలుకు వెళ్లినప్పుడు షర్మిల పార్టీ వ్యవహారాలను చూసుకోవడమే కాకుండా పాదయాత్ర కూడా చేశారు. 2019 ఎన్నికలలో అధికారం వచ్చిన తర్వాత మొదలయిన అన్నా చెల్లెళ్ల మధ్య విభేదాలు2024 లో ఓటమి తర్వాత విడిపోయే పరిస్థితికి తలెత్తాయి. జగన్, వైఎస్ షర్మిల మధ్య రాజకీయ వైరుధ్యమే కాదు. ఆస్తి తగాదాలు కూడా తోడవ్వడంతో ఇద్దరూ ఉప్పు నిప్పులా తయారయ్యారు. ఇద్దరి దారులు వేరు అయ్యాయి. తండ్రి వైఎస్ మరణం తర్వాత తల్లి విజయమ్మ ఎటూ తేల్చుకోలేని స్థితిలో చివరకు కూతురు పంచన చేరిపోయారు. ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో అన్నాచెల్లెళ్లయిన వైఎస్ జగన్, వైఎస్ షర్మిల ఇద్దరు వేర్వేరు పార్టీల్లో ఉంటూ అధికారం కోస ప్రయత్నిస్తున్నారు. జగన్ ను ఓడించడమే లక్ష్యంగా గత ఎన్నికల్లో షర్మిల పనిచేశారంటే ఇక వారు కలవడం అనేది కుదరదన్నది స్పష్టమయింది. ఇక తాజాగా తెలంగాణలోనూ 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండటంతో పెద్దగా ఇబ్బందులు ఎదురు కాలేదు. కేటీఆర్ రాష్ట్ర మంత్రిగా, కవిత నాడు ఎంపీగా ఢిల్లీ రాజకీయాలకు పరిమితమయ్యారు. అయితే 2019 ఎన్నికల్లో కవిత ఎంపీగా ఓడిపోవడంతో పాటు 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలు కావడంతో అన్నా చెల్లెళ్ల మధ్య గొడవలు తారా స్థాయికి చేరుకున్నాయి. కవిత నేరుగా కేటీఆర్ ను విమర్శిస్తూ మాట్లాడుతున్నారంటే ఆమె టార్గెట్ అన్న అని అర్థమవుతుంది. అన్న తనను తండ్రికి దూరం చేస్తున్నారని, పార్టీలో తనకు, తన వారికి ప్రాధాన్యత ఇవ్వకపోవడానికి సోదరుడు కేటీఆర్ కారణమని నమ్ముతున్నారు. అందుకే ఆమె బరస్ట్ అవుతున్నారు. ఇక వీరిద్దరూ కలసి నడిచేది కాదన్నది నేడు కవిత చేసిన వ్యాఖ్యలతో అర్థమయింది. కేసీఆర్ కళ్ల ముందే కూతురు, కొడుకు కొట్లాట ఆయనకు మాత్రం తలనొప్పిగా తయారయిందనే చెప్పాలి. మొత్తం మీద అన్నా చెల్లెళ్ల ఆధిపత్య పోరు రెండు తెలుగు రాష్ట్రాల్లో మాత్రం హాట్ టాపిక్ గా మారింది.

# ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్...

కడప, మే 31, కడపలో నిర్వహించిన మహానాడు చివరి రోజు టీడీపీ జాతీయ అధ్యక్షుడి హోదాలో చంద్రబాబు సుదీర్ఘ ప్రసంగం చేశారు. సాధారణంగా చంద్రబాబు మైకు పట్టుకుంటే వదిలే రకం కాదన్న భావన ఉంది. ఈ దఫా కూడా అదే జరిగింది. అయితే.. ఈ సారి మైకు పట్టుకుని గంటల తరబడి ఆయన ప్రసంగించినా.. మెరుపులు కురిపించారు. ప్రజల్లో అభివృద్ధి బీజాలు వేశారు. దీంతో కృతకంగా సాగుతుందని ముందు అనుకున్నా.. చంద్రబాబు ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది.మరీ ముఖ్యంగ ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్ అనే నినాదాన్న అందుకుని చంద్రబాబు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. తద్వారా ఆయన ఎవరిని హెచ్చరించారో.. ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులకు మోడీ చెక్ పెట్టారని.. ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్ ద్వారా ఆర్థిక నేరస్తులను ఏరేస్తామని ఆయన శపథం చేశారు. ఇది మంచి పరిణామమే. అయితే.. ప్రస్తుతం ఉన్న రాజకీయాల్లో ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న.పైకి ఎన్నయినా చెప్పుకోవచ్చు. కానీ, ఎన్నికల విషయానికి వస్తే.. ప్రతి ఐదేళ్లకు ఎన్నికల ఖర్చు పెరుగు తూనే ఉంది. ఎక్కడా ఎవరూ తక్కువగా ఖర్చు చేస్తున్న దాఖలు కనిపించడం లేదు. అసెంబ్లీ నియోజక వర్గంలో 30 కోట్లు ఖర్చు పెట్టడం మంచి నీళ్ల ప్రాయంగా మారిన నేటి ఎన్నికల రాజకీయాల్లో క్లీన్ పాలిటిక్స్ అనే మాట.. వినేందుకు బాగానే ఉన్నా.. చేసేందుకు మాత్రం అడ్డంకులు సొంత పార్టీలోనే వినిపిస్తున్నాయి. తమకు డబ్బులు ముట్టలేదని.. తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల వేళ.. దాడులు చేసిన ఓటర్లు దీనికి ఉదాహరణ.ఒకవేళ.. తాను చెబుతున్న ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్‌ను ప్రత్యర్థుల వరకే పరిమితం చేయాలని అనుకుంటే.. అది సాధ్యం కావొచ్చు. కానీ.. సొంతపార్టీ పరిస్థితిని అంచనా వేసుకుంటే.. మాత్రం ఇది చేయలేక పోవచ్చు. అప్పుడు మళ్లీ చంద్రబాబుకు ఎదురు ప్రశ్నలు.. సవాళ్లు కూడా ఎదురవుతాయి. కాబట్టి.. ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్ అనేది పైకి చెబుతున్నంత ఈజీ కాదు.రాజకీయాల్లో నాయకులు ఉంటారు. వారికి ప్రత్యర్థులు కూడా ఉంటారు. అయితే.. ఎవరు ఎలాంటి వారు? అనేది తెలుసుకోవడం నాయకులకు.. పార్టీలకు కూడా తెలియాల్సి ఉంది. ఈ విషయంలో చాలా మంది నాయకులు తప్పులు చేస్తుంటారు. అందుకే.. వెనుకబడి పోతుంటారు. కానీ.. ఈ వ్యవహారంలో రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకోవడంలో చంద్రబాబు స్టయిల్ వేరు. ఆయన దూకుడు వేరు. ఒకరకంగా చెప్పాలంటే.. చంద్రబాబు విశ్వరూపమే వేరు.ఈ విషయాన్ని జగన్ అంచనా వేయలేకపోతే.. పార్టీ పరిస్థితి మరింత దిగజారిపోతుందని పరిశీలకులు చెబుతున్నారు. చంద్రబాబు అంటే.. కేవలం నాయకుడు.. ఒక పార్టీ అధినేతగానే కాదు.. ఆయన ప్రజలను తనవైపు తిప్పుకోవడంలో దిట్ట. ప్రచారం చేయడంలో స్కాలర్. ప్రజలను మలుపుతిప్పుకొనే వ్యూహాలు వేయడంలోనూ.. ఆయన నెంబర్ 1. ఇది 2014, 2024 ఎన్నికల్లోనూ.. చంద్రబాబుకు కలిసి వచ్చింది. ఆయన దూకుడు, ప్రచారం వంటివి కలిసివచ్చాయి.అంతేకాదు.. రాజకీయాల్లో కావాల్సిన మరో కీలక అంశం ? పదిమందిని పోగు చేయడం. ఈ విషయంలోనూ చంద్రబాబు సక్సెస్ అయ్యారు. గత తన పాలనలో మేలు జరిగిన వారిని ముందుండి నడిపించారు. వారందరిని ఏకమయ్యేలా చేశారు. సొంత ఖర్చులు పెట్టుకుని ముందుకు ఉరికేలా చేశారు. నాయకులకు నిర్ణీత లక్ష్యాలు విధించారు. ఫలితంగా భారీ ప్రచారం.. భారీ యూటర్న్‌లు 2024లో స్పష్టంగా కనిపించాయి. మరీ ముఖ్యంగా ప్రత్యర్థి లోపాలను తెలుసుకోవడంలోనూ చంద్రబాబు సక్సెస్ అయ్యారు.ఇప్పుడు ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే.. వైసీపీ అధినేత జగన్‌కు పార్టీ వర్గాల నుంచి అందిన నివేదికల్లో ఓ కీలక నాయకుడు.. ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ప్రచార వ్యూహంలోనూ.. పార్టీని ప్రజలకు చేరువ చేయడంలోనూ.. జీరో నుంచి ప్రారంభించాలని 2024కు ముందు చంద్రబాబు ఇదేపని చేశారని ఆయన వెల్లడించారు. ఈ విషయంలోనే గత ప్రభుత్వంలో మేలు జరిగిన వారిని ఏకం చేసేలా చర్యలు ఉండాలని సూచించారు. చంద్రబాబు విశ్వరూపాన్ని తక్కువగా అంచనా వేయొద్దని.. కేవలం సింపతీని మాత్రమే నమ్ముకుంటే ఫలితం ఉండబోదని అంటున్నారు. మరి జగన్ ఏం చేస్తారో చూడాలి.చేస్తే.. మంచిదే. దీనికి చాలా సాహసం, ధైర్యం కావాలి. కానీ.. నిరంతర ప్రభుత్వం కోరుకుంటున్న దరిమిలా.. దీనిని ఏమేరకు సక్సెస్ చేస్తారన్నది చూడాలి.

# సర్వే బాట పట్టిన పవన్

విజయవాడ, మే 31,ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు ఏం చేసినా కొన్ని గణాంకాలు, పద్ధతులు పాటిస్తారు. ప్రతి విషయంలో ప్రజల నుంచి సంతృప్తిని కోరుకుంటారు. చివరికి మద్యంపైనా ఆయన సంతృప్తి పాళ్లను లెక్కించుకున్నారు. అంటే ఇది తప్పుకాదు, ప్రజల అభిప్రాయాలను అన్ని విషయాల్లోనూ తెలుసుకునే ప్రక్రియ. తద్వారా ప్రభుత్వ విధానాలను సమీక్షించి, అవసరమైతే మార్చుకునే ప్రయత్నం చేస్తారు. ఇదే విధంగా ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరును కూడా చంద్రబాబు అంచనా వేస్తూనే ఉన్నారు.ప్రజల అభిప్రాయాల మేరకు మార్పులు చేసుకుంటూ పాలనపై సంతృప్తిని సాధిస్తున్నారు. ఈ పరంపరలోనే కూటమి పార్టనర్ అయిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా సర్వేలు చేపడుతున్నారు. తన పార్టీ తరఫున ఆయనతో పాటు ముగ్గురు మంత్రులు ఉన్నారు. వారికి అప్పగించిన శాఖలు సహా తానే చూస్తున్న మూడు నాలుగు శాఖలలో అధికారుల పనితీరును తెలుసుకుంటున్నారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారు? తాము ఏమి చేస్తున్నారు? అన్న విషయాలను సర్వే రూపంలో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.తద్వారా ప్రజలకు?పాలనకు మధ్య తేడాలు ఉంటే వాటిని అరికట్టేందుకు, మరింత మంచి పాలనను అందించేందుకు అవకాశం ఉందని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. ఈ క్రమంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలపై కూడా పవన్ కళ్యాణ్ దృష్టి పెట్టారు. మంత్రులుగా ఉన్న ముగ్గురిని తీసేస్తే, జనసేనకు 18 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో నలుగురు నుంచి ఐదుగురి వ్యవహారం వివాదంగా మారిందని జనసేన కార్యాలయానికి ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. వ్యక్తిగతంగానే కాకుండా కూటమి పరంగా కూడా ఈ అంశాలు సమస్యలుగా ఉన్నాయి.కూటమి పార్టీలతో కలిసిపనిచేయకపోవడం, స్థానిక నాయకులతో సంబంధాలు లేకపోవడం, నియోజకవర్గంలో ఆధిపత్య రాజకీయాలు వంటి అంశాలు జనసేన నేతల దృష్టికి వెళ్లాయి. వచ్చే ఎన్నికల్లోనూ కూటమితోనే కలసి పోటీ చేస్తున్నామన్న క్లారిటీ రావడంతో పవన్ కళ్యాణ్ నియోజకవర్గాల ఇన్ ఛార్జిల విషయంలోనూ ఆచి తూచి వ్యవహరిస్తున్నారట. అనవసరంగా ఎక్కువ మందిని నియమించుకుని, వారు ఏదో వివాదంలో చిక్కుకుని పార్టీకి, తనకు చెడ్డపేరు తెస్తారన్న భయం మాత్రం పవన్ కళ్యాణ్ లో కనిపిస్తుంది.అందుకే ముందుగా ఎంపిక చేసుకున్న నియోజకవర్గాల్లో నమ్మకమైన నేతలను, సుదీర్ఘకాలం నుంచి పార్టీతో నడుస్తున్న వారికి మాత్రమే ఇన్ ఛార్జి పదవులును కట్టబెడుతున్నారు. అంతే తప్ప 175 నియోజకవర్గాల్లో ఇన్ ఛార్జుల నియమించి, అక్కడ టీడీపీ, జనసేన లేదా బీజేపీ, జనసేనలకు మధ్య అనవసర వివాదాలు తలెత్తుతాయని భావిస్తున్నారు. అందుకే ఇప్పటి వరకూ చాలా నియోజకవర్గాల్లోనూ ఇన్ ఛార్జులు లేరు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ స్థానాలు పెరిగితే తాను తీసుకోవాల్సిన స్థానాలపై కూడా అంచనా రావడానికి ఒక సర్వే చేయించాలని కూడా పవన్ కల్యాణ్ సిద్ధమవుతున్నారని తెలిసింది. పేరున్న సంస్థ చేత సర్వేచేయించి జనసేనకు బలం ఉన్న యాభై నియోజకవర్గాల పేర్లను ఆయన తెప్పించుకోవాలని భావిస్తున్నారు.ఢిల్లీకి చెందిన సంస్థకు ఈ బాధ్యతలను అప్పగించాలని పవన్ కళ్యాణ్ నిర్ణయించినట్లు సమాచారం. సర్వేలో వచ్చిన స్థానాలను అడిగి తీసుకునేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఆ సర్వే వచ్చిన తర్వాత ఆ స్థానాల్లో ఇన్ ఛార్జులు లేకపోతే అప్పుడు అక్కడ నమ్మకమైన వారిని నియమించడమా? లేదా తనకు దగ్గరగా ఉన్న నేతలను అక్కడ ఇన్ ఛార్జులుగా పెట్టడమా? అన్నది చేస్తారని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. యాభై నుంచి అరవై బలమైన అసెంబ్లీ స్థానాలతో పాటు ఐదు పార్లమెంటు స్థానాల పేర్లను కూడా తనకు సర్వే చేసి ఇవ్వాలని సదరు సంస్థకు పవన్ కళ్యాణ్ బాధ్యత అప్పగించినట్లు తెలిసింది. అదే నిజమైతే వచ్చే ఎన్నికల్లో జనసేన ఐదు పార్లమెంటు, యాభై శాసనసభ నియోజకవర్గాల్లో పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఆ 18 మంది ఎమ్మెల్యేల పనితీరుపై జనసేన సర్వే చేపట్టాలని నిర్ణయించినట్టు సమాచారం. తద్వారా విమర్శలు వస్తున్న ఎమ్మెల్యేలు, కలిసిపనిచేయని ఎమ్మెల్యేలు కూడా మార్పు దిశగా తమను తాము మార్చుకుంటారని అంచనా వేస్తున్నారు. మరి ఈ సర్వేలో ఏం జరుగుతుందో చూడాలి.

# వంశీ స్థానంలో పంకజశ్రీ

విజయవాడ, మే 31, టీడీపీ టికెట్ పై ఎమ్మెల్యేగా గెలిచి.. ఆ తర్వాత అధికార వైసీపీ పంచన చేరి లెక్కలేనన్ని అక్రమాలకు పాల్పడ్డ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ రాజకీయ ప్రస్థానం ముగిసిందన్న వాదనలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. నిన్నటి దాకా అసలు రాజకీయం అంటేనే ఏమిటో తెలియకుండా? బయటి ప్రపంచానికే కనంపించకుండా ఉండిపోయిన ఆయన సతీమణి పంకజశ్రీ ఇప్పుడు ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకు సిద్ధమైపోయారన్న వార్త మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ మేరకు శనివారం జరగనున్న గన్నవరం వైసీపీ నియోజకవర్గస్థాయి సమావేశానికి మాజీ మంత్రి పేర్ని నానితో పాటు పంకజశ్రీ కూడా హాజరు కానున్నారని, ఇందులోనే పంకజశ్రీ తన రాజకీయ రంగప్రవేశాన్ని ప్రకటిస్తారని సమాచారం.గన్నవరం నియోజకవర్గంలో ఏడాదిగా అసలు వైసీపీ కార్యక్రమాలే జరిగిన దాఖలా లేదు. 2024 ఎన్నికల్లో తనతో పాటు వైసీపీ కూడా చిత్తుగా ఓడటంతో గన్నవరం వదిలిన వంశీ నియోజకవర్గం వైపే చూడలేదు. తాజాగా పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఆయనను పోలీసులు హైదరాబాద్ వెళ్లి మరీ అరెస్టు చేసి విజయవాడ తరలించారు. కోర్టు ఆదేశాల మేరకు ఆయనను బెజవాడ జిల్లా జైలుకు తరలించారు. వంద రోజులకు పైగా వంశీ ఈ జైల్లోనే ఉంటున్నారు. అయితే అప్పటికే పలు అనారోగ్య సమస్యలు ఉన్న వంశీ? జైలు జీవితం కారణంగా మరింత అనారోగ్యానికి గురయ్యారు. గుర్తు పట్టలేనంతగా ఆయన మారిపోయారు. జైలు నుంచి బయటకు వచ్చినా వంశీ రాజకీయాల్లో యాక్టివ్ గా పాలుపంచుకుంటారా? అన్న దానిపై అందరిలోనూ అనుమానాలు ఉన్నాయి.వంశీ ఆరోగ్య పరిస్థితి, ఆయనపై నమోదై ఉన్న కేసులు, వాటి తీవ్రత తదితర అంశాలన్నింటినీ పరిశీలించిన వైసీపీ అధిష్ఠానం వంశీ స్థానంలో పంకజశ్రీని రంగంలోకి దించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇదే విషయాన్ని వంశీతో పాటు పంకజశ్రీకి చెప్పిన పార్టీ పెద్దలు? వారిని అందుకు ఒప్పించినట్లు సమాచారం. అయితే ఈ ప్రతిపాదనకు వంశీ తొలుత ఒప్పుకోకున్నా? ప్రస్తుత పరిస్థితులను ఆయన ముందు పెట్టగా అయిష్టంగానే ఒప్పుకున్నట్లు తెలుస్తోంది.

ఇక పంకజశ్రీ తన భర్తను కేసుల నుంచి కాపాడుకునేందుకు తాను రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వడం ఒక్కటే మార్గమన్న వైసీపీ నేతల వాదనలతో ఏమాత్రం ఆలోచించకుండానే ఒప్పేసుకున్నట్లు తెలుస్తోంది. విద్యావంతురాలైన పంకజశ్రీకి రాజకీయాలు కొత్తే అయినా.. పార్టీ మద్దతు ఉంటే రాణించే అవకాశాలున్నట్లు విశ్లేషణలు సాగుతున్నాయి.వంశీని రిటైర్డ్ హర్ట్ చేసి? పంకజశ్రీని రంగంలోకి దింపే దిశగా వైసీపీ కూడా భారీ వ్యూహాన్నే రచించినట్టు సమాచారం. 2024 ఎన్నికలు ముగిసిన నాటి నుంచి గన్నవరంలో వైసీపీ పేరే వినిపించడం లేదు. అసలు పార్టీ కార్యాలయం తలుపులు తీస్తున్నారో, లేదో కూడా తెలియదు. వంశీతో పాటు ఆయన ముఖ్య అనుచరులంతా కేసుల్లో ఇరుక్కుని అరెస్టు కావడమో..లేదంటే పరారీలో ఉండటమో చేస్తున్నారు. ఈ కారణంగా అసలు వైసీపీ మాటే గన్నవరంలో వినిపించడం లేదు. ఇలాంటి క్రమంలో వంశీ అనుచర గణమంతా ఇప్పటికే టీడీపీ బాట పడుతున్నారు. ఈ వలసలను ఆపాలంటే? నియోజకవర్గంలో ఎవరినో ఒకరిని రంగంలోకి దించాలి. అది వంశీ కుటుంబం నుంచి? ఆయన సతీమణి పంకజశ్రీ అయితే మరీ మంచిదన్న వాదనతోనే ఈ వ్యూహం రచించినట్లుగా తెలుస్తోంది.

# పిఠాపురంపై పక్కా ప్లాన్

కాకినాడ, మే 31, పిఠాపురం నియోజకవర్గం.. 2024 ఎన్నికల తర్వాత నిత్యం హాట్ టాపిక్ గానే ఉంటుంది. దానికి కారణం అక్కడ పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహించడమే. 2024 ఎన్నికలకు ముందు అనూహ్యంగా పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. పొత్తులో భాగంగా ఆ సీటు నుంచి పోటీ చేస్తానని చెప్పారు. దీంతో అప్పటివరకు టిడిపి అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధపడిన వర్మ డిఫెన్స్ లో పడ్డారు. అధినేత చంద్రబాబు సముదాయించడంతో సమ్మతించారు. పవన్ కళ్యాణ్ గెలుపు కోసం కృషి చేశారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత నిత్యం వివాదాస్పదం అవుతోంది పిఠాపురం నియోజకవర్గం. పిఠాపురంలో గెలుపులో కీలక భాగస్వామ్యం టిడిపిదేనని ఆ పార్టీ వారు చెబుతుండగా.. కాదు కాదు జనసేన దేనిని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో అయిష్టంగానే ఆ రెండు పార్టీలు కలిసి ఉంటున్నాయి. రాష్ట్రమంతటా ఒక లెక్క.. పిఠాపురంలో మరో లెక్క అన్నట్టు పరిస్థితి ఉంది. పైకి బాగానే కనిపిస్తున్న అక్కడ స్థానికంగా రెండు పార్టీల శ్రేణుల మనసులు మాత్రం కలవడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కడపలో జరిగిన మహానాడులో పిఠాపురం టిడిపి నేతలు సంచలన వ్యాఖ్యలు చేశారు. అక్కడి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో టిడిపి గురించి గట్టిగానే తమ అభిప్రాయాలను వెల్లడించారు.వాస్తవానికి ఎన్నికల ప్రచారంలోఇక్కడి టిడిపి నేతలకు ప్రాధాన్యత దక్కింది. నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న వర్మకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు పవన్ కళ్యాణ్. వర్మ సైతం పవన్ విషయంలో ప్రత్యేక గౌరవం ఇస్తూ ముందుకు సాగారు. అయితే ఎన్నికల ఫలితాల తరువాత, పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయిన తర్వాత.. పూర్తిగా సీన్ మారింది. టిడిపి వర్మకు ప్రాధాన్యత తగ్గుతూ వస్తోంది. పైగా అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్సీ పదవి ఇస్తామని వర్మకు హామీ ఇచ్చారు. అయితే ఆయన కంటే ముందే మెగా బ్రదర్ నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. దీంతో వర్మ అభిమానులతో పాటు టిడిపి శ్రేణుల్లో ఒక రకమైన ఆవేదన వ్యక్తం అవుతోంది. వర్మకి పదవి ఇవ్వలేదన్న అసంతృప్తి ఒకవైపు.. ఇక్కడ జనసేన నేతలు లెక్క చేయడం లేదని మరోవైపు.. టిడిపి శ్రేణులకు బాధ వెంటాడుతోంది.సరిగ్గా ఇటువంటి సమయంలోనే మెగా బ్రదర్ నాగబాబు చేసిన హాట్ కామెంట్స్ రెండు పార్టీల మధ్య దూరం పెంచింది. జనసేన ప్లీనరీని పిఠాపురంలో నిర్వహించారు. ఈ సభలో నాగబాబు మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. పిఠాపురంలో గెలుపు పవన్ కళ్యాణ్ దేనని.. అందుకు కారణం కామేనని ఎవరైనా అనుకుంటే అంతకంటే కర్మ ఉండదని తేల్చి చెప్పడంతో ఒక రకమైన భిన్న వాతావరణం కనిపించింది. ఇది వర్మ కు కౌంటర్ ఇచ్చినట్లు అయింది. అప్పటినుంచి రెండు పార్టీల మధ్య గ్యాప్ ప్రారంభం అయింది. అలాగని రెండు పార్టీల హై కమాండ్లు స్పందించే అవకాశం లేదు. అప్పటినుంచి ఆ గ్యాప్ కొనసాగుతూనే ఉంది. రెండు పార్టీల శ్రేణులు కలిసి పనిచేస్తున్న.. మనసులు మాత్రం కలవలేదు. నాగబాబు ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసి నేరుగా పిఠాపురం వచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో సైతం టిడిపి కార్యకర్తలు వర్మ పేరుతో నినాదాలు చేసి నాగబాబు కు షాక్ ఇచ్చారు.కడపలో జరిగిన మహానాడుకు పిఠాపురం నియోజకవర్గం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలి వచ్చాయి. ఈ సందర్భంగా పిఠాపురంలో పరిస్థితిపై మీడియా ప్రతినిధులు ప్రశ్నిస్తే టిడిపి నేతలు ఆసక్తికరంగా సమాధానాలు చెప్పారు. పిఠాపురం టిడిపి అడ్డా అని తేల్చేశారు. టిడిపికి అక్కడ ఆదరణ తగ్గలేదని.. వర్మ నాయకత్వంలో తామంతా పని చేస్తామని తేల్చి చెప్పారు. ఎక్కడ జనసేన పేరు ఎత్తకుండా.. తాము తెలుగుదేశం పార్టీ పరంగానే కొనసాగుతామని.. వర్మ నాయకత్వంలో పనిచేస్తామని చెప్పడం విశేషం.

# కొడాలి, పిన్నెల్లి బ్రదర్స్ అరెస్టేనా...

గుంటూరు, మే 31, ఏపీ పాలిటిక్స్ సమ్‌థింగ్ డిఫరెంట్. ఎప్పుడు ఎవరిపై కేసులు నమోదవుతాయో..ఎప్పుడు ఎవరిని అరెస్ట్ చేస్తారో కూడా ఊహకందని పరిస్థితి. అందుకు తగ్గట్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫ్యాన్ పార్టీ లీడర్లను ఒకదాని తర్వాత మరో కేసు వెంటాడుతోంది. కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్‌తో మరోసారి వైసీపీ నేతల్లో టెన్షన్ మొదలైందట. ఇదే సమయంలో పిన్నెల్లి సోదరులపై మరో హత్యాయత్నం కేసు నమోదైంది.ఇప్పటికే చాలామంది వైసీపీ నేతలపై కేసులు ఫైల్ అయ్యాయి. వల్లభనేని వంశీ పలు కేసుల్లో జైలులోనే ఉంటూ..బెయిల్ కోసం లీగల్ ఫైట్ చేస్తున్నారు. మరోవైపు అనేక మంది వైసీపీ నేతలు ముందస్తు బెయిల్ కోసం కోర్టులను ఆశ్రయించారు. బెయిల్ దొరకని వారు పరారీలో ఉన్నారు. ఇలా పరారీలో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని లేటెస్ట్‌గా పోలీసులు అరెస్ట్ చేశారు.ఇక పిన్నెల్లి సోదరులది మరో కథ. ఓ డబుల్ మర్డర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి. పల్నాడు జిల్లా బొదిలవీడులో ఇద్దరిని కారుతో ఢీకొట్టి హత్య చేసిన కేసులో సోదురులపై కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఇద్దరూ పరారీలో ఉన్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక వీరు మాత్రమే కాదు..ఇప్పటికే పేర్నినాని, సజ్జల భార్గవ్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కొడాలినాని..ఇలా ఎంతో మంది వైసీపీ నేతలపై కేసులు నమోదయ్యాయి. ఇప్పుడీ నేతలంతా లీగల్ టీమ్‌ను పెట్టుకుని కోర్టులకు తిరుగుతున్నారు.అయితే ఇక్కడ అధికార పార్టీ ఆవేశంగా కాకుండా ఆలోచనతో ముందుకు వెళు_న్నట్టు కనిపిస్తోంది. రాత్రికి రాత్రి అరెస్టులు చేయడం కాకుండా..న్యాయపరంగా అన్ని అవకాశాలు ఇస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్లే అవకాశాలు ఇస్తున్నారు. అంతేకాదు గతంలో వారు చేసిన అక్రమాలు, దాడులు ఏవైనా ఉంటే అందుకు సంబంధించిన వీడియోలు, ఆధారాలతో ప్రూఫ్స్ బయటికి తీస్తున్నారు. ఇలా పక్కగా నేతలను లాక్ చేస్తున్నారు. ఇప్పటికే కాకాణి, పిన్నెల్లి సోదరులకు ఉచ్చు బిగిసినట్లే అంటున్నారు. రెడ్‌బుక్ మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందని జగన్ అంటుంటే..ఎర్ర రంగును చూస్తే భయపడిపోతున్నారని లోకేశ్ రివర్స్ అటాక్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీకి జూన్ నెల టెన్షన్ పట్టుకుందట. అసలే ఇప్పుడు లిక్కర్ స్కామ్ కేసు ఇన్వెస్టిగేషన్ నడుస్తోంది. ఓవైపు సిట్..ఇంకోవైపు ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి. కీలక నిందితులను విచారించి..అసలు సూత్రధారి ఎవరో తేల్చే పనిలో పడ్డాయి దర్యాప్తు సంస్థలు. ఇలాంటి సిచ్యువేషన్‌లో మరో నాలుగైదు రోజుల్లోనే ఇద్దరు కీలక నేతల అరెస్టులు ఉంటాయన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అది కూడా లిక్కర్ స్కామ్‌లోనని అంటున్నారు.అయితే ఇప్పటివరకు ఏపీలో అందరూ అనుకున్నట్లు, ఊహించినట్లు అరెస్టులు జరగడం లేదు. కొడాలి నాని అరెస్టుపై చాలా రోజులుగా లీక్స్ వస్తున్నాయ్.

కానీ ఆయన అరెస్ట్ ఆలస్యం అవుతూ వస్తోంది. దాంతో ఇప్పటికే ప్రచారంలో ఉన్న నేతలను అరెస్ట్ చేస్తారా లేక ఏదైనా కొత్త కేసు తెరమీదకు వచ్చే అవకాశం ఉందా అన్న డౌట్స్ వ్యక్తం అవుతున్నాయి.నెక్ట్స్ అరెస్టులు లిక్కర్ స్కామ్ కేసులోనే ఉంటే అది ఏపీ పాలిటిక్స్‌లో మరో సెన్సేషనల్ కేసు కానుంది. ఎందుకంటే వైసీపీ అధినేత టార్గెట్‌గానే లిక్కర్ ఫైల్స్ కథేంటో తేల్చే పనిలో ఉన్నాయట దర్యాప్తు సంస్థలు. అదే జరిగితే వైసీపీ అధినేతకు సన్నిహితంగా ఉన్న ఓ మాజీ మంత్రితో పాటు, ప్రస్తుత వైసీపీ సిట్టింగ్ ఎంపీ అరెస్ట్ కావొచ్చన్న టాక్ వినిపిస్తోంది. అదీ కాకపోతే కొడాలినాని, పిన్నెల్లి బ్రదర్స్‌ను అదుపులోకి తీసుకునే అవకాశం లేకపోలేదంటున్నారు. ఇకపై కేసుల ఉచ్చులో చిక్కుకోబోయేది ఎవరన్నది చూడాలి మరి.

# చంద్రబాబు మార్క్ వ్యూహం.

కడప, మే 31, చంద్రబాబు. ఆయన మార్క్ అభివృద్ధే వేరు. పొలిటికల్ వ్యూహాలే సెపరేటు. 35 ఏళ్ల రాజకీయ అనుభవం, అంతకు మించి అడ్మినిస్ట్రేషన్ స్కిల్స్‌తో ఎప్పుడేం చేయాలి..ఎప్పుడు ఏ డెసిషన్ తీసుకుంటే బాగుంటుందో ఆయనకు తెలిసినంతగా ఎవరికీ తెలియదేమో. అంతలా స్ట్రాటజీ ప్లే చేసి వర్కౌట్ చేస్తూ వస్తుండటం బాబు స్పెషాలిటీ. అడ్మినిస్ట్రేషన్, కమ్యూనికేషన్స్ విషయంలో చంద్రబాబుకు తిరుగులేని బ్రాండ్ ఇమేజ్ ఉంది. ఇప్పుడు మరోసారి ఆల్ ఇండియా లెవెల్‌లో ఆయన చక్రం తిప్పుతున్నారు.కేంద్రంలో బీజేపీకి 240 సీట్లే రావడంతో..మిత్రపక్షాలపై ఆధారపడి సంకీర్ణ ప్రభుత్వం నడుస్తోంది. దాంతో టీడీపీకి ప్రాధాన్యం పెరిగింది. చంద్రబాబు చెప్పిందే వేదం అనే పరిస్థితి. ఆయనే కింగ్ మేకర్ అయినట్లు మారింది రాజకీయం. అయినా ఆయన ఏ మాత్రం లైన్ దాటడం లేదు. తన అవసరం ఉందన్న స్థాయి డిమాండ్లు కూడా చేయట్లేదు. బీజేపీతో, మోదీతో సఖ్యతతో ఉంటూ..ఏపీ అభివృద్ధికి స్ట్రాంగ్ పునాదులు వేస్తున్నారు.తన పార్టీకి పదవులు, తన రాజకీయ అవసరాల కంటే..నమ్మి అధికార మిచ్చిన ప్రజల ఆశలు నెరవేరాలంటే..కేంద్రం నుంచి నిధులు రావాల్సిందేనన్న పట్టుదలతో ఉన్నారు చంద్రబాబు. అందుకే నో ఇగోస్..ఓన్లీ డెవలప్‌మెంట్ పాలసీ అంటూ ముందుకెళ్తున్నారు. మహానాడు వేదికపై మోదీపై చంద్రబాబు ప్రశంసలు కురిపించడం కూడా ఆయన మార్క్ స్ట్రాటజీ అంటున్నారు. నిజానికి మహానాడు అనేది టీడీపీ పార్టీ పండుగ. అయినా ఆ వేదిక కూటమి ప్రస్తావన తెస్తూ..మోదీ పాలనను పొగిడి..కూటమి అవసరాన్ని..ఏపీ అభివృద్ధి కోసం మోదీతో కలిసి పనిచేస్తున్న తీరును చెప్పకనే చెప్పారు చంద్రబాబు.రాష్ట్రానికి వీలైనన్ని ఎక్కువ ఆర్థిక ప్రయోజనాలు సాధించడమే లక్ష్యంగా..చంద్రబాబు కేంద్రంతో లావాదేవీల తరహా సంబంధాన్ని నడుపుతున్నారనేది ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయం. గతంలో యునైటెడ్ ఫ్రంట్, వాజ్‌పేయి ఎన్డీఏ ప్రభుత్వాలకు మద్దతిచ్చిన అనుభవం, తనకున్న పరిపాలనా దక్షతతో..ఏపీకి నిధులు తెస్తున్నారు. బీజేపీ మద్దతు లేకున్నా ఏపీలో నెగ్గుకురాగల సామర్థ్యం చంద్రబాబుకు ఉన్నప్పటికీ, కేంద్రంతో సయోధ్యకే ఆయన ప్రాధాన్యమిస్తుండడానికి కారణం రాష్ట్ర అభివృద్ధి ఎజెండానే అంటున్నారు.అదే ఎన్డీయే కూటమిలో ఉన్న నితీశ్ కుమార్ వ్యక్తిగత రాజకీయ అవసరాల కోసమే కేంద్రాన్ని, బీజేపీని వాడుకుంటున్నారన్న చర్చ ఉంది. బాబు మాత్రం అందుకు భిన్నంగా..బీజేపీకి దగ్గరగా..ఏపీ ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా వ్యవహరిస్తున్నారన్న ఒపీనియన్స్ ఉన్నాయ్. 2024 జూన్‌లో ఎన్నికల ఫలితాలు వచ్చాక చంద్రబాబు ఢిల్లీ వెళ్లే వరకు ఆయన స్టాండ్ ఏంటో క్లారిటీ లేక పొలిటికల్ సస్పెన్స్ కంటిన్యూ అయింది. మోదీనే తమ నాయకుడని చెప్పి..అన్ని ఊహాగానాలకు తెరదించి ఇప్పటికీ అదే స్టాండ్ మీద ఉన్నారు చంద్రబాబు. మహానాడులో కేంద్రమంత్రి పెమ్మసాని చెప్పినట్లు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు రాబట్టడంలో కూడా తన మార్క్ చూపిస్తున్నారు టీడీపీ అధినేత.అడ్మినిస్ట్రేషన్ బాగా తెలిసిన బాబుకు..ఢిల్లీ స్థాయిలో ఏపీకి సంబంధించిన ప్రయోజనాలను ఎలా పొందాలో వ్యూహాత్మక ప్లాన్స్ అమలు చేస్తారనడంలో డౌటే లేదు. ఏపీ అభివృద్ధి కోసం బాబు ఏదైనా అడిగితే కేంద్ర మంత్రులు కాదనలేని పరిస్థితి. అది అమరావతి రింగ్‌రోడ్ అయినా..రాజధాని అభివృద్ధి కోసం నిధులైనా..కేంద్రాన్ని ఒప్పించి, మెప్పించి నిధులు తెస్తున్నారు. అలా తన అనుభవం, అడ్మినిస్ట్రేషన్ స్కిల్స్, ఫ్యూచర్ బేస్డ్ డెవలప్‌మెంట్ ప్లాన్స్‌తో నవ్యాంధ్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారు చంద్రబాబు. అందుకే బాబు రూటే సెపరేటు అంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు.

# లిక్కర్ కేసు విచారణ

## అసలు టార్గెట్ ఎవరు..

విజయవాడ, మే 31, మద్యం కుంభకోణంలో అంతిమ ఘట్టం ప్రారంభమైందా? 'అంతిమ లబ్ధిదారుడు' ఎవరన్నది తేలిపోనుందా? అసలు సిసలైన అంకం మొదలైందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఏపీలో లిక్కర్ స్కాం సంచలనం రేపుతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత దీనిపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. సీఐడీతో పాటు పోలీసులు రంగంలోకి కీలక ఆధారాలు సేకరించారు. దీంతో భారీగా అవినీతి జరిగిందని.. అవినీతి సొమ్మును హవాలా రూపంలో విదేశాలకు తరలించేశారని విచారణలో తేలింది. మరోవైపు ఇదే కేసులో ఏ5 నిందితుడుగా ఉన్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సైతం సూత్రధారి రాజ్ కసిరెడ్డి అని తేల్చేశారు. అవసరమైతే విచారణకు పిలిస్తే మరిన్ని ఆధారాలు ఇస్తానని చెప్పుకొచ్చారు. దీంతో ప్రత్యేక నోటీసు ఇచ్చిన సిట్ విజయసాయిరెడ్డిని సుదీర్ఘంగా విచారించింది. ఆయన వాంగ్మూలాన్ని సేకరించింది. అటు తరువాతే వరుసగా అరెస్టులు ప్రారంభమయ్యాయి. అప్పటి సీఎంవో అధికారి, ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ క్రిష్ణమోహన్ రెడ్డి, గోవిందప్పబాలాజీలను అరెస్టు చేశారు. ఇప్పుడు ఆ నలుగుర్ని కోర్టు అనుమతి మేరకు కస్టడీలోకి తీసుకుంది సిట్. దీంతో అంతిమ లబ్దిదారుడు ఎవరన్నది తేలిపోనుంది.వైఎస్సార్ కాంగ్రెస్ హయాంలో పేరుకే కేబినెట్, పేరుకే ప్రజాప్రతినిధులు అన్నట్టు పరిస్థితి ఉండేది. మొత్తం వ్యవహారాలన్ని ముఖ్యమంత్రి కార్యాలయ అధికారిగా ఉన్న ధనుంజయరెడ్డి చూసేవారు. ఆయన కనుసన్నల్లోనే ప్రభుత్వ పాలన, వైసీపీ వ్యవహారాలన్నీ జరిగేవన్న విమర్శలున్నాయి. ఎన్నికల ఫలితాలు అనంతరం ఎక్కువ మంది వైసీపీ నేతలు నిందించింది ధనుంజయరెడ్డినే. మరోవైపు జగన్ ఓఎస్డీగా పని చేసి క్రిష్ణమోహన్ రెడ్డికి సైతం ఇందులో పాత్ర ఉందని తేలింది. మరోవైపు భారతీ సిమెంట్స్ డైరెక్టర్ గా ఉన్నారు గోవిందప్ప బాలాజీ. ఈయన జగన్మోహన్ రెడ్డికి అత్యంత విధేయుడు. రాజ్ కసిరెడ్డి గురించి చెప్పనవసరం లేదు. 2019 ఎన్నికల్లో జనసేన తరుపున పోటీచేసి ఓడిపోయారు. ఫలితాలు వచ్చిన తరువాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అటు తరువాత ఐటీ సలహాదారుడుగా పదవి పొందారు. అప్పుడే లిక్కర్ స్కాంను రూపొందించడంలో ఈయనదే కీలక పాత్ర అని తేలిది. ఇప్పుడు ఈ నలుగురు సిట్ కస్టడీలోకి రావడంతో కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. అంతిమ లబ్దిదారుడు ఎవరనేది తేలనుంది.వీరంతా మద్యం పాలసీలో భాగంగా ప్రభుత్వ మద్యం దుకణాలకు మద్యం సరఫరా చేసే సంస్థల నుంచి భారీగా ముడుపులు వసూలు చేశారన్నది ప్రధాన ఆరోపణ. ఇందులో రాజ్ కసిరెడ్డి అసలు సూత్రధారిగా విచారణలో తేలినట్టు సమాచారం. మద్యం సరఫరా చేసే కంపెనీల నుంచి ..ప్రతి సీసాకు రూ.50 వరకూ కమిషన్ ఇవ్వాలని ప్రతిపాదన చేసి అమలుచేసింది ఈయనేనన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ప్రతిపాదన రావడంతో ప్రీమియం మద్యం బ్రాండ్ల కంపెనీలన్నీ పక్కకు తప్పుకున్నట్టు తెలుస్తోంది. అటు డిస్టలరీను బెదిరించి బలవంతంగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి స్వాధీనం చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. తరచూ వీరంతా మద్యం సరఫరాదారులతో సమావేశమయ్యేవారని సిట్ గుర్తించినట్టు తెలుస్తోంది. అయితే అంతిమ లబ్దిదారుడు, బిగ్ బాస్ ఎవరనేది లక్ష్యంగా సిట్ విచారణ జరపనున్నట్టు సమాచారం.

# ప్రైవేటు బస్సు బోల్తా ప్రయాణాకుకు గాయాలు

ఏలూరు జిల్లా భీమడోలు/ దెందులూరు జాతీయ రహదారిలో రాజమండ్రి నుండి హైదరాబాద్ వెళుతున్న ఇంటర్ సిటీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు సరిగ్గా నాగ హనుమాన్ ఆయిల్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పింది. విజయవాడ రోడ్డు నుండి దాటుకొని రాజమండ్రి రోడ్డులోకి వచ్చి వంతెనపై ఉన్న పూల కుండీలను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో 16 మందికి గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది. 108 సిబ్బంది క్షతగాత్రులను బస్సు నుండి బయటకు తీశారు. వారిని మూడు అంబులెన్సులలో ఏలూరు సర్వేజనాస్పత్రికి తరలించారు. బస్సు బోల్తా పడిన సమయంలో బస్సు కింద ఒక ప్రయాణికుడు చిక్కుకున్నట్లు తెలుస్తుంది. క్రేన్ సహాయంతో బస్సును తిరిగి పైకి లేపి, ట్రాఫిక్ ని క్లియర్ చేసారు. ఆసుపత్రికి చేరుకున్న క్షతగాత్రులలో 19 ఏళ్ల యువతి పరిస్థితి విషమంగా వుందని సమాచారం.

# ట్రంప్ అక్కసు ఎందుకో...

2025 జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత, అక్రమ వలసల నియంత్రణపై కఠిన విధానాలు అమలు చేయడం గమనార్హం. ఈ విధానాల ఫలితంగా, దాదాపు 1,100 మంది భారతీయ పౌరులు బహిష్కరణకు గురయ్యారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ సంఖ్యలో 62% మంది వాణిజ్య విమానాల ద్వారా స్వదేశానికి తిరిగి వచ్చారు. ఈ బహిష్కరణలు అమెరికా?భారత్ మధ్య సన్నిహిత సహకారం ఫలితంగా జరిగాయని, అక్రమ మార్గాల ద్వారా అమెరికాలో ప్రవేశించిన వారి జాతీయతను ధ్రువీకరించిన తర్వాతే తిరిగి రప్పించడం జరుగుతుందని ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు.అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయుల బహిష్కరణ ప్రక్రియ క్రమబద్ధంగా, చట్టపరిధిలో జరుగుతోంది. జైశ్వాల్ వివరించిన విధంగా, బహిష్కరణకు గురైన వ్యక్తుల గుర్తింపు, జాతీయత ధ్రువీకరణ, స్వదేశానికి తిరిగి రావడానికి అవసరమైన ఏర్పాట్లు భారత ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఈ ప్రక్రియలో అమెరికా అధికారులతో భారత రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లు నిరంతర సంప్రదింపులు జరుపుతున్నాయి. ఈ సహకారం ద్వైపాక్షిక సంబంధాలలో ఒక ముఖ్యమైన అంశంగా ఉంది, ఇది అక్రమ వలసలను నిరోధించడంలో రెండు దేశాల ఉమ్మడి నిబద్ధతను సూచిస్తుంది.అమెరికాలో భారతీయ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్ వీసా దరఖాస్తుదారులపై ఇటీవల వచ్చిన మార్గదర్శకాలను కూడా భారత ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. ట్రంప్ పరిపాలనలో వీసా నిబంధనలు కఠినతరం కావడంతో, విద్యార్థులు, ఇతర చట్టబద్ధ వీసా హోల్డర్లు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, విదేశాలలో ఉన్న భారతీయ విద్యార్థుల సంక్షేమం కోసం భారత ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. రాయబార కార్యాలయాల ద్వారా విద్యార్థులకు సలహాలు, సమాచారం, మరియు అవసరమైన సహాయం అందించబడుతోంది. ఈ చర్యలు విద్యార్థుల హక్కులను కాపాడడంతో పాటు, వారు చట్టపరమైన విధానాలను అనుసరించేలా ప్రోత్సహిస్తున్నాయి.అమెరికాతోపాటు, ఇరాన్‌లో తప్పిపోయిన ముగ్గురు భారతీయుల కోసం భారత ప్రభుత్వం ఆ దేశ అధికారులతో సంప్రదింపులు జరుపుతోంది. ఈ వ్యక్తుల కుటుంబ సభ్యులకు అన్ని రకాల సహాయం అందించడం ద్వారా మంత్రిత్వ శాఖ వారి పట్ల సానుభూతి, బాధ్యతాయుతమైన వైఖరిని ప్రదర్శిస్తోంది. ఈ సంఘటన విదేశాలలో భారతీయ పౌరుల భద్రత మరియు సంక్షేమంపై భారత ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో సూచిస్తుంది.ట్రంప్ పరిపాలనలో అమెరికా కఠిన వలస విధానాలు భారతీయ పౌరులపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి. అక్రమ వలసల నియంత్రణ అనివార్యమైనప్పటికీ, ఈ ప్రక్రియలో మానవీయ దృక్పథం కూడా కీలకం. భారత ప్రభుత్వం ఈ సమస్యను సమతుల్యంగా నిర్వహిస్తూ, అమెరికాతో సహకారం కొనసాగిస్తూ, తిరిగి వచ్చిన పౌరుల పునరావాసం కోసం కూడా చర్యలు తీసుకోవాలి. అలాగే, విదేశాలలో ఉన్న భారతీయ విద్యార్థులు, ఉద్యోగుల సంక్షేమం కోసం మరింత సమర్థవంతమైన వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా వారి భద్రతను మెరుగుపరచవచ్చు.అమెరికా నుంచి భారతీయుల బహిష్కరణ, ఇరాన్‌లో తప్పిపోయిన పౌరుల గురించి భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ చేపడుతున్న చర్యలు దేశం యొక్క బాధ్యతాయుతమైన విధానాన్ని ప్రతిబింబిస్తాయి. అక్రమ వలసల నియంత్రణ, విద్యార్థుల సంక్షేమం, విదేశాలలో భారతీయుల భద్రత కోసం భారత్?అమెరికా మధ్య సహకారం కొనసాగుతుండటం ఒక సానుకూల అడుగు. అయితే, ఈ సవాళ్లను ఎదుర్కోవడంలో మరింత సమగ్రమైన విధానాలు, మానవీయ దృక్పథం అవసరం.మెరికాలో డొనాల్డ్ ట్రంప్ 2.0 పాలనలో దూకుడు, స్పీడ్‌తో ప్రపంచ దేశాలతోపాటు అమెరికన్లు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఖర్చు తగ్గింపు పేరుతో అమెరికన్లను, మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ పేరుతో విదేశీయులను ఇబ్బంది పెడుతున్నాడు. అక్రమ వలసదారులను దేశం దాటిస్తున్నారు. ఇమ్మిగ్రేషన్ నిబంధనలు కఠినతరం చేశారు. ఇక ఇప్పుడు వీసాల్లో కోత పెడుతున్నారు. తాజాగా విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనే కల చాలామంది విద్యార్థుల సొంతం. అందులోనూ అమెరికా వంటి అగ్రరాజ్యంలో చదువుకోవాలని ఆశపడేవారు ఎక్కువ. ఏటా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఈ లక్ష్యంతో అమెరికా బాట పడుతుంటారు. అయితే, గత కొంతకాలంగా అమెరికా ప్రభుత్వం విద్యార్థి వీసాలు పై కఠిన వైఖరి అవలంబిస్తూ వీసా జారీల సంఖ్యను గణనీయంగా తగ్గిస్తోంది. 2023?24 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 41% వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి, ఇది గత దశాబ్దంతో పోలిస్తే దాదాపు రెట్టింపు.అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం, 2023?24లో 6.79 లక్షల ఈ?1 వీసా దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 2.79 లక్షలు (41%) తిరస్కరించబడ్డాయి. 2022?23లో 6.99 లక్షల దరఖాస్తుల్లో 2.53 లక్షలు (36%) ఆమోదం పొందలేదు. దీనికి భిన్నంగా, 2013?14లో 7.69 లక్షల దరఖాస్తుల్లో 1.73 లక్షలు (23%) మాత్రమే తిరస్కరణకు గురయ్యాయి. ఈ గణాంకాలు వీసా తిరస్కరణ రేటు గత పదేళ్లలో రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగిందని స్పష్టం చేస్తున్నాయి.భారతీయ విద్యార్థుల విషయంలోనూ పరిస్థితి ఆందోళనకరంగా మారింది. 2024 తొలి 9 నెలల్లో ఈ?1 వీసాల జారీ 38% తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జనవరి నుంచి సెప్టెంబరు వరకు కేవలం 64 వేల మందికి వీసాలు మంజూరయ్యాయి, అంతకుముందు ఏడాది ఇదే కాలంలో ఈ సంఖ్య 1.03 లక్షలుగా ఉంది. కొవిడ్ తర్వాత భారతీయ విద్యార్థులకు వీసాలు ఇంతగా తగ్గడం ఇదే మొదటిసారి.ఇది నాన్?ఇమిగ్రెంట్ వీసా, అమెరికాలో ఫుల్?టైమ్ విద్యకోసం విదేశీ విద్యార్థులకు అనుమతినిస్తుంది. అమెరికావిద్యాసంస్థలు ఏటా రెండు సెమిస్టర్లలో (ఆగస్టు?డిసెంబర్, జనవరి?మే) ప్రవేశాలు కల్పిస్తాయి. భారతీయ విద్యార్థులు ఎక్కువగా ఆగస్టు సెమిస్టర్‌లో వెళ్తారు. అయితే, కఠిన వీసా విధానాలతో ఈ కలలు కల్లలవుతున్నాయి. ఈ తిరస్కరణల వెనుక అక్రమ వలసలను అరికట్టడం, వీసా నిబంధనలను కఠినతరం చేయడం వంటి కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో, విద్యార్థులు ఆర్థిక స్థిరత్వం, సరైన డాక్యుమెంటేషన్, చదువు తర్వాత స్వదేశం తిరిగి వెళ్లే హామీని స్పష్టంగా చూపించాల్సి వస్తోంది.

# తలనొప్పిగా మారుతున్న సిస్టర్స్..

హైదరాబాద్, మే 31, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వింత పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పార్టీల్లో చెల్లెళ్ల పోరు నాయకులకు తలనొప్పి తెచ్చి పెడుతోంది. నిన్న మొన్నటి వరకూ వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఆయన సొంత చెల్లెలు వైఎస్ షర్మిల రెడ్డి నుంచి తిరుగుబాటు ఎదురైతే ఇప్పుడు తెలంగాణలో టిఆర్ఎస్ భవిష్యత్ నాయకుడు కేటీఆర్‌కు చెల్లెలు కవిత రూపంలో ఇంటిపోరు మొదలైంది. తెలంగాణ ఉద్యమం సమయం లో "జాగృతి " పేరుతో తెలంగాణలో సాంస్కృతిక పునరుజ్జీ వన కార్యక్రమాలతో తన వంతు కృషి చేసిన కవిత ప్రస్తుతం పార్టీలో తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. తన తండ్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ కు "డాడీ.. నీకో లేఖ " అంటూ పార్టీలో జరుగుతున్న కొన్ని తప్పులు అని తన భావించిన అంశాలపై లేఖ రాశారు. ముందు అది ఫేక్ అని అందరూ భావించినా ఆ లేఖను తానే రాసినట్టు తర్వాత ఆమె స్పష్టం చేశారు. ఇది పార్టీలో తీవ్ర సంచలనం సృష్టించింది.కవిత లెటర్ పై మొదట్లో సాఫ్ట్ గా స్పందించిన టిఆర్ఎస్ నేతలు తర్వాత స్వరం పెంచారు. కవిత కూడా తానేమి తగ్గనట్టు గా బీఆర్ఎస్ ను బిజెపిలో కలిపేసే కుట్ర జరుగుతుందంటూ మరో బాంబు పేల్చారు. అయితే ఇదంతా పార్టీ నాయకత్వంలో తనకు సరైన స్థానం లభించడం లేదంటూ ఆమె భావించడమే కారణం అని స్పష్టమవుతోంది. తనకు ప్రాధాన్యత తగ్గడంలో అన్న కేటీఆర్ కారణమని ఫీల్ అవడమే రీజన్ అని ఎనలిస్ట్ లు అంటున్నారు.తండ్రి చుట్టూ దెయ్యాలు ఉన్నాయన్న కవిత ఆరోపణలు ప్రధానంగా కేటీఆర్ ను ఉద్దేశించినే అనే ప్రచారం రాజకీయ వర్గాల్లో బలంగా కొనసాగుతోంది. ఆమె లిక్కర్ స్కామ్ లో జైలుకు వెళ్లినప్పుడు తనపై లేనిపోనివి చెప్పి తన తండ్రి మనసు విరిచేసారని ఆమె నమ్ముతున్నట్టు కొన్ని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. దానికి నిన్న మొన్నటి వరకు ఈ చర్చ బీఆర్ఎస్ లో భవిష్యత్ నాయకత్వ చర్చ కేటీఆర్ లఐ హరీష్ రావు అన్నట్టు సాగేది. కానీ ఇప్పుడు సడన్గా అది కేటీఆర్ వర్సెస్ కవితగా మారిపోయింది.ప్రస్తుతం కవిత వెనక్కి రాలేనంతగా పార్టీకి వ్యతిరేకంగా ముందుకు వెళ్లిపోయారు. దానితో త్వరలోనే ఆమె సొంత పార్టీపై ప్రకటన చేయబోతున్నట్టు తెలంగాణలో చాలా బలంగా ప్రచారం జరుగుతోంది. తండ్రి రాజకీయ వారసత్వం తనకే అంటూ బలంగా నమ్ముతున్న కేటీఆర్ కు ఒక విధంగా ఇది ఇబ్బంది తెచ్చిపెట్టి పరిణామమే.జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో జైలుకు వెళ్ళినప్పుడు " అన్న వదిలిన బాణం " అంటూ పాదయాత్ర చేసిన షర్మిల తర్వాత కాలంలో నిరాదరణకు గురైన అనే అభిప్రాయంలో ఉన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆమెకు ఎలాంటి పదవి, రాజకీయ ప్రాముఖ్యత లభించలేదు. పైపెచ్చు ఆస్తులు విషయంలోనూ అన్నతో గొడవలు ఉన్నాయి. దానితో వైసీపీతో విభేదించి బయటకు వచ్చి ముందు తెలంగాణలో పార్టీ పెట్టారు. అది పెద్దగా వర్కౌట్ కాకపోవడంతో కాంగ్రెస్ లో చేరి ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా తన అన్నను ఎన్నికల్లో ఢీ కొట్టారు.2024 ఎన్నికల్లో వైసీపీ ఓటమికి ఏదో ఒక స్థాయిలో షర్మిల కూడా కారణమని ఒక అభిప్రాయం ఉంది. ఇప్పటికీ ఆమె తన అన్నను క్షమించలేదు సరికదా తన ప్రతి ప్రెస్ మీట్ లోనూ ఏదో ఒక రకంగా తన అన్నపై సెటైర్లు వేస్తూనే ఉన్నారు. ఇంతవరకు ఆంధ్రప్రదేశ్ లోనే ఇలా అన్నాచెల్లెళ్ల పోరు ఉందనుకుంటే.. ఇప్పుడు కేటీఆర్ లఐ కవిత రూపంలో తెలంగాణలోనూ కొత్త ఇంటి పోరు మొదలైంది. మరి రానున్న రోజుల్లో ఇది మరెన్ని తిరుగుతుందో చూడాలి.

## సినీ పరిశ్రమ సమస్యల అధ్యాయానికి కమిటీ
## తెలుగు ఫిలిం ఛాం బర్ కీలకప్రకటన

విశాఖపట్నం తెలుగు సినీ పరిశ్రమలో గత కొన్నిరోజులుగా నడుస్తున్న థియేటర్ల బంద్ అంశంపై తెలుగు ఫిలిం ఛాం బర్ కీలకప్రకటన చేసింది.విశాఖ దొండపర్తిలోని తెలుగు ఫిలిం ఛాంబర్ కార్యాలయంలో అధ్యక్షుడు భరత్భూషణ్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో ప్రొద్యూసర్లు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతోపాటు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో సినీ పరిశ్రమ సంక్షోభానికి కీలకంగా భావిస్తున్న సినిమా టిక్కెట్ల రేట్లు, థియేటర్ల నిర్వహణ, పర్సంటేజీలు, పైరసీ, రెమ్యూనరేషన్లు, తిను బండారాల ధరలు వంటి అంశాలపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. మూడు విభాగాల నుంచి తొమ్మిదేసి మంది తో మొత్తంగా 27 మందితో సమస్యలపై అధ్యయనం చేసేందుకు ఓ కమిటీని నిర్ణయించాలని సమావేశం తీర్మానించింది. త్వరలోనే కమిటీ సభ్యులను వెల్లడి స్తామని ప్రకటించింది.రాష్ట్రప్రభుత్వం సినీ పరిశ్రమ మధ్య సానుకూల వాతావరణం నెలకొనేలా చూడాలనే అభిప్రా యం సమావేశంలో వ్యక్తమైంది. రాష్ట్రప్రభుత్వం చెబు తున్న సినీ పాలసీపై కూడా కసరత్తు చేయాలని నిర్ణయిం చింది. ఈ మేరకు కొత్త సినిమాల విడుదలకు ఆటంకాలు లేకుండా చూడాలనీ, పెద్ద సినిమాలకు ధరల పెంపునకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయత్నాలు చేయా లనీ, థియేటర్లు యథావిధిగా పనిచేసేలా ఛాంబర్ తరపున ప్రయత్నాలు కొనసాగిస్తామని అధ్యక్షులు భరత్భూషణ్, ప్రధాన కార్యదర్శి దామోదరప్రసాద్ వెల్లడించారు.

సినిమా టికెట్ల ధరలు, థియేటర్ల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, పర్సంటేజీల విధానం వంటి ప్రధాన అంశాలపై ఈ సమావేశంలో కూలంకషంగా చర్చిం చినట్లు సి.కల్యాణ్ తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయిం చినట్లు ఆయన వెల్లడించారు.డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, నిర్మాతల సంఘాలకు చెందిన సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని,ప్రతి సంఘం నుంచి తొమ్మిది మంది చొప్పున మొత్తం 27 మంది సభ్యులతో ఈ కమిటీ ఉంటుందని సి.కల్యాణ్ పేర్కొన్నారు. కమిటీలో పాలుపంచుకునే సభ్యుల పేర్లను తొలుత ప్రభుత్వానికి తెలియజేస్తామని, అనంతరం సోమవారం నాడు కమిటీకి సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు వెల్లడిస్తా మని ఆయన స్పష్టం చేశారు.

# రాహుల్ గాంధీ, ప్రియాంకలను చూస్తే...
# మనకు కనిపించని ఆదర్శ నీతి

న్యూఢిల్లీ, మే 31, రాహుల్ గాంధీ, ప్రియాంకా వాద్రా పరిచయం అక్కరలేని పేర్లు. రాహుల్‌గాంధీ ఎప్పటి నుంచో ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటున్నారు. ఇక మొన్నటి వరకు పరోక్ష రాజకీయాలో కీలక పాత్ర పోసించిన ప్రియాంక వాద్రా కూడా ఇప్పుడు ప్రత్యేక రాజకీయాలోఅడుగు పెట్టారు. లోక్‌సభ ఉప ఎన్నికల్లో పోటీచేసి గెలిచారు. భారత రాజకీయాల్లో అత్యంత ప్రముఖమైన నెహ్రూ–గాంధీ కుటుంబానికి చెందిన సోదరులు. వీరి తాత జవహర్‌లాల్ నెహ్రూ, అమ్మమ్మ ఇందిరా గాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ?భారత ప్రధానమంత్రులుగా పనిచేసిన వారసత్వంలో భాగంగా, రాహుల్ మరియు ప్రియాంకా రాజకీయ జీవనం కూడా సమాజ సేవ, నాయకత్వంతో నిండి ఉంది. వీరికి ప్రాంతీయ పార్టీల వారసుల తరహాల్లో అధికార ఆకాంక్ష లేదు. పదవుల కోసం పోటీ కన్నా, ఒకరికోసం ఒకరు నిలబడటం, త్యాగాలు చేయడం ద్వారా ఆదర్శంగా నిలుస్తారురాహుల్ గాంధీ 2004లో అమేథీ నుంచి లోక్‌సభ సభ్యుడిగా రాజకీయ జీవనం ప్రారంభించారు, అదే సమయంలో ప్రియాంకా తన తల్లి సోనియా గాంధీ, సోదరుడి తరఫున ఎన్నికల ప్రచారాల్లో కీలక పాత్ర పోషించారు. 2019లో ప్రియాంకా అధికారికంగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా నియమితులై, ఉత్తర ప్రదేశ్‌లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేశారు. 2024లో రాహుల్ వయనాడ్ స్థానాన్ని వదులుకోవడంతో, ప్రియాంకా ఆ స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికై, కాంగ్రెస్ పార్టీకి మరో బలమైన స్వరంగా మారారు. ఈ సందర్భంలో రాహుల్, ప్రియాంకా కోసం ప్రచారం చేస్తూ, వయనాడ్‌ను కేరళలో అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా మార్చాలని సవాల్ విసిరారు, ఇది వారి సోదర బంధాన్ని మరింత హైలైట్ చేసింది..ప్రాంతీయ పార్టీల్లో పదవులు కూడా వారసత్వంగానే వస్తుంటాయి. కొడుకు, కూతురునే అధినేతలు వారసులుగా ప్రకటించే సంప్రదాయం ఉంది. అలా ఇవ్వని పక్షంలో గొడవలు పార్టీని చీల్చినవారూ ఉన్నారు. కానీ, రాహుల్, ప్రియాంకా మధ్య అధికార ఆధిపత్యం కోసం ఎలాంటి పోటీ లేదు. రాహుల్ 2024 ఎన్నికల్లో రాయ్‌బరేలీ, వయనాడ్ రెండు స్థానాల్లో గెలిచినప్పుడు, వయనాడ్ స్థానాన్ని ప్రియాంకా కోసం వదిలిపెట్టారు, ఇది వారి నిస్వార్థ స్వభావాన్ని చాటుతుంది. ప్రియాంకా కూడా రాయ్‌బరేలీ, అమేథీలలో తన తల్లి, సోదరుడి కోసం నిరంతరం కృషి చేస్తూ, పార్టీ కార్యకర్తల మధ్య విభేదాలను సమన్వయం చేసేందుకు తన వంతు కృషి చేశారు. వీరి ఈ త్యాగ గుణం, ఒకరి విజయం కోసం మరొకరు వెనక్కి తగ్గడం ద్వారా, రాజకీయాల్లో అరుదైన సోదర బంధానికి ఉదాహరణగా నిలుస్తుంది.రాహుల్, ప్రియాంకా బంధం కేవలం రాజకీయ సహకారానికే పరిమితం కాదు, ఇది వ్యక్తిగత స్థాయిలో కూడా లోతైన ప్రేమను ప్రతిబింబిస్తుంది. రాహుల్ తన సోదరి కోసం వయనాడ్ స్థానాన్ని వదులుకోవడం, ప్రియాంకా తన సోదరుడి ఎన్నికల ప్రచారాల్లో అండగా నిలవడం, ఈ చర్యలు వారి పరస్పర గౌరవాన్ని, ప్రేమను చాటుతాయి. వారి త్యాగాలు, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం, సమాజ సేవ కోసం చేసిన కృషి, వారి బంధానికి గుర్తుగా నిలుస్తాయి.మొన్నటి వరకు షర్మిల, ప్రస్తుతం కల్వకుంట్ల కవిత రాజకీయ వారసత్వం కోసం అంతర్గత విషయాలను బయట పెడుతున్నారు.

పార్టీలో చిచ్చుర పడుతున్నారు. అయితే వారసత్వ రాజకీయాలపై తరచూ విమర్శలు వచ్చినప్పటికీ, రాహుల్, ప్రియాంకా తమ నాయకత్వంతో ఆ విమర్శలను తిప్పికొడుతున్నారు. అధికార దాహం కంటే, పార్టీ లక్ష్యాలను సమాజ సేవను ప్రాధాన్యతగా భావించే వీరి వైఖరి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తుంది. ప్రియాంకా ఉత్తర ప్రదేశ్‌లో మహిళా సాధికారత కోసం "లడ్కీ హూం, లడ్ సక్తీ హూం" ప్రచారం, రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా సామాజిక సామరస్యం కోసం చేసిన కృషి వీరి నీతి ఆధారిత రాజకీయాలకు నిదర్శనం.

# ట్రావెల్ జ్యో, బయ్యాకు సంబంధాలు..
# ఆరా తీస్తున్న అధికారులు

హైదరాబాద్, మే 31,ప్రముఖ తెలుగు వ్లాగర్, బైక్ రైడర్, యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు చెన్నైలో అరెస్టు చేశారు. సన్నీ యాదవ్ అరెస్టు.. ఒక్కసారిగా అతని స్వగ్రామం నూతనకల్‌లో కలకలం రేపింది. సన్నీ యాదవ్ అరెస్టుపై ఎన్ఐఏ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో బైక్ రైడర్ సన్నీ యాదవ్ ఆచూకీ పై తల్లిదండ్రుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రానికి చెందిన భయ్యా రవీందర్, అనూష దంపతుల కుమారుడు సన్నీ యాదవ్. చిన్నతనం నుంచే బైక్ లను నడపడం సరదా. ఈ సరదాతోనే వ్లాగింగ్ మీద ఆసక్తి పెంచుకున్నాడు. 2016 నుండి దేశంలోని వివిధ ప్రాంతాలకు బైక్ పై రైడింగ్ చేసి వీడియోలను పోస్ట్ చేసేవాడు. 2019లో 21 రోజుల్లోనే బైక్ పై లద్దాఖ్‌కు యాత్ర చేశాడు. ఆ యాత్రతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య ఒక్క సారిగా మూడు లక్షలకు చేరుకుంది. దాంతో.. పూర్తిస్థాయి వ్లాగర్‌గా మారిపోయి 2019లో నేపాల్‌కు వెళ్లి.. తొలి విదేశీ యాత్రను పూర్తి చేశారు. ఇలా అనతికాలంలోనే బాగా ఫేమస్ అయ్యాడు.. అయితే.. ఈ ఏడాది మార్చిలో రాష్ట్ర వ్యాప్తంగా యూట్యూబర్లు బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్నారని కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన కారణంగా బయ్యా సన్నీ యాదవ్‌పై మార్చి 5వ నూతనకల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. అదే సమయంలో కొందరు యూట్యూబర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అయితే సన్నీ యాదవ్ విదేశాల్లో ఉండడంతో పోలీసులు పోలీసులు లుకౌట్ సర్క్యులర్ కూడా జారీ చేశారు. దీంతో సన్నీ యాదవ్ దుబాయ్ నుంచి పాకిస్తాన్ కు వెళ్లాడు. ఆ తర్వాత బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో సన్నీ యాదవ్ తల్లిదండ్రులు హైకోర్టులో ముందస్తు బెయిల్ తీసుకున్నారు.పహల్గామ్ ఉగ్ర దాడి జరిగిన సమయంలో బైక్ రైడర్, యూట్యూబార్ సన్నీ యాదవ్ పాక్ లోనే ఉన్నాడు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టిన నేపథ్యంలో భారత్ పాక్ ల మధ్య ఉద్రిక్తతలు నెలకున్నాయి. దేశంలోని కొందరు యూట్యూబర్లు స్పై గా పనిచేస్తూ భారత రహస్యాలన్నింటినీ పాక్ కు చేరవేస్తున్నారని ఎన్ఐఏ అధికారులు అనుమానించారు. దీంతో దేశంలోని కొందరు యూట్యూబర్లపై ఫోకస్ పెట్టారు. యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా, మరో 11 మందినీ ఎన్ఐఏ అరెస్టు చేసింది. మరికొందరు యూట్యూబర్లపై నిఘా పెంచింది. పాకిస్తాన్ నుండి సన్నీ యాదవ్ రెండు వారాల క్రితం ఇండియా వచ్చాడు. పాక్ లో పర్యటించిన వీడియోలను తన యూట్యూబ్ ఖాతాలో పోస్టు చేశాడు. సన్నీ యాదవ్ తన పాకిస్థాన్ ట్రిప్‌పైనా పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నాడు..ఇదేంది భయ్యా ఇది. ఇదెక్కడ చూడలే. ఓవైపు మనదేశం పాకిస్తాన్.. దాని తీవ్రవాదంతో పోరాడుతుంటే.. నువ్వేమో బైక్ వేసుకుని పాక్‌కు వెళ్లి నీ జీవితాశయం నెవేరిందని తెగ హైప్ ఇస్తున్నావు! ఓవైపు భారత స్త్రీలు తమ సింధూరాలు కోల్పోయి.. క్షోభను అనుభవిస్తుంటే.. నువ్వు పనీర్ రోటీలు తింటూ ఎంజాయ్ చేస్తున్నావు. పాక్ ఉగ్రవాదంతో మనం పోరాడుతుంటే.. వారి దేశంలో సైట్ సీయింగ్ ముఖ్యమైపోయిందా సన్నీ. ఇది ఒకరి ఆవేదన కాదు.. యూట్యూబ్‌లో బయ్యా సన్నీ యాదవ్ పాకిస్తాన్ టూర్ వీడియోల కింద వస్తున్న వందలాది కామెంట్లు. ఇటీవల అతడు తన మోటార్‌బైక్ మీద పాకిస్తాన్ వెళ్లడం పెద్ద ఇష్యూ అయిందిపాక్ వెళ్లి వచ్చిన బైక్ రైడర్ సన్నీ యాదవ్ పై నిఘా ఉంచిన ఎన్ఐఏ అధికారులు ఈనెల 29వ తేదీన చెన్నైలో అరెస్టు చేశారు. పాక్ సందర్శనకు గల కారణాలపై విచారణ జరిపేందుకు ఎన్ఐఏ అధికారులు అతడిని చేసినట్లు తెలిసింది. సన్నీ యాదవ్ అసలు పాకిస్థాన్‌కు ఎందుకు వెళ్లాడు? ఉద్రిక్తతల తరుణంలో శత్రుదేశాన్ని సందర్శించడానికి కారణమేంటి? పాక్ లో ఏయే ప్రాంతాల్లో సన్నీ యాదవ్ సందర్శించాడు..? ఎవరిని కలిశాడు..? ఎందుకు కలిశాడు అనే కోణంలో అతడిని విచారిస్తున్నట్లు సమాచారం.. ఇప్పటికే అరెస్టైన పాక్ గూఢచారి జ్యోతి మల్హోత్రా కేసులో సన్నీ పేరును కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.. ఆమెతో సన్నీకి ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. భద్రతా సంస్థలు సన్నీ మొబైల్, కమ్యూనికేషన్ చరిత్రను విశ్లేషిస్తున్నట్లు తెలుస్తోంది..యూట్యూబ్, బైక్ రైడర్ సన్నీ యాదవ్ అరెస్టుపై అతడి తల్లిదండ్రులు, స్నేహితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 29వ తేదీన చెన్నైలోని తన ఇంటి నుండి ఐదుగురు వ్యక్తులు మఫ్టీలో సన్నీ యాదవ్ ను తీసుకెళ్లారని అతని స్నేహితుడు చెర్రీ చెబుతున్నాడు. సన్నీ యాదవ్ ను దేశద్రోహిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని చెర్రీ చెబుతున్నాడు. ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేస్తే.. తమకు సమాచారం ఇవ్వాలని అతని తల్లిదండ్రులు కోరుతున్నారు. తమ కొడుకు దేశభక్తి కలిగినవాడని, ఉగ్రవాదులతో ఎలాంటి సంబంధాలు లేవని తండ్రి రవీందర్ వాపోతున్నాడు. కేవలం బైక్ రైడర్ గా మాత్రమే పాక్ ను సందర్శించాడని చెబుతున్నాడు. తన కుమారుడిని ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారా..? లేక మరెవరైనా ఎత్తుకెళ్లారనే ఆందోళనను వ్యక్తం చేశారు. తన కొడుకు ఆచూకీ చెప్పకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని రవీందర్ చెబుతున్నాడు. హైకోర్టులో హెబియస్ కార్పస్ రిట్ వేస్తామని చెప్పారు.

### పాయకరావుపేట నియోజకవర్గంలో
### హోం మంత్రి అనిత పర్యటన

అనకాపల్లి హోం మంత్రి అనిత శనివారం నాడు పాయకరావుపేటలో పర్యటించారు. ముందుగా నక్కపల్లి మండలం ఉద్ధండపురం గ్రామంలో ఎన్టీర్ విగ్రహానికి పూలమాలలు వేసి,నివాళులు అర్పించారు. ఉద్ధండపురం గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ఫించన్ లు పంపిణీ చేసారు. గ్రామస్తుల యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. టిడిపి కార్యకర్త ఆవాల నాగేశ్వరరావును పరామర్శించారు. నాగేశ్వరరావు ఇటీవలే ఆపరేషన్ చేయించుకున్నారు. ఉద్ధండపురంలో ఆవాల గోవిందు ఇంటి వద్ద స్వయంగా టీ కాచారు. ఆవాల గోవిందు కుటుంబ సభ్యులకు టీ ఇచ్చారు. రెండో విడత గ్యాస్ సిలిండర్ల పంపిణీని మంత్రి ప్రారంభించారు.

## మురికి కాలువలో పసికందుల మృతదేహాలు

తిరుపతి గూడూరు పట్టణం అశోక్ నగర్ సమీపంలో దారుణం చోటుచేసుకుంది,మురికి కాలువలో గర్భస్త కవల పసికందుల మృతదేహాలు వుండడం స్థానికంగా కలకలం రేపింది... పసికందుల మృతదేహాలను కాలువలో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు... శిశువుల మృతదేహాలు కాలువలోకి కొట్టుకు వచ్చాయా ? లేక ఎవరైనా తెచ్చి పడేశారా అన్న కోణంలో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు...చెత్తను తొలగించే క్రమంలో శిశువుల మృతదేహాలు బయటపడినట్లు స్థానికులువెల్లడించారు...పసికందుల మృతదేహాలను చూసినందుకు స్థానికులు గమిగూడారు... మనవత్వంమరిచిఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు..

# కవిత వెనుక మాస్టర్ మైండ్ ఎవరు...

హైదరాబాద్, మే 31, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెనక ఎవరున్నారు? ఆమె సొంత నిర్ణయాలే వెనక ఉండి ఎవరైనా నడిపిస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కవిత సోదరుడిపైనే తిరుగుబాటు చేసేంత పరిస్థితి ఎందుకొచ్చిందన్న దానిపై బీఆర్ఎస్ నేతలు ఆరా తీస్తున్నారు. కవిత వెనక ఏ పార్టీ నేతలు అయినా ఉన్నారా? లేక తమ పార్టీలో ఉన్న నేతలే బ్యాక్ ఉండి ప్రోత్సహిస్తున్నారన్న సందేహం అందరిలోనూ కలుగుతుంది. బీఆర్ఎస్ లో కేసీఆర్ తర్వాత కేటీఆర్ లీడర్ అన్నది అందరికీ దాదాపు రెండేళ్ల క్రితమే క్లారిటీ వచ్చింది. అయితే ఇప్పుడు కవిత బరస్ట్ అవ్వడానికి కారణాలు ఏంటన్న దానిపైనే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేయడానికి వచ్చినప్పుడు కూడా కేటీఆర్ కవిత ఇంటికి వెళ్లారు. అక్కడే ఉండి ఈడీ అధికారులతో వాగ్వాదానికి కూడా దిగారు. ఇక కవిత తీహార్ జైలులో ఉన్న సమయంలో అనేక సార్లు ఢిల్లీ వెళ్లి కలసి వచ్చారు. న్యాయవాదులతోనూ బెయిల్ కోసం కేటీఆర్ హస్తినకు బయలుదేరి వెళ్లారు. జైలు నుంచి బయటకు వచ్చినప్పుడు కూడా కేటీఆర్ అక్కడే ఉండి ఇంటికి తీసుకు వచ్చారు. ఇంత బాగా ఉన్న అన్నా చెల్లెళ్ల అనుబంధానికి గండి ఎక్కడ పడిందన్న దానిపైనే అందరికీ సందేహాలు తలెత్తుతున్నాయి. తీహార్ జైలులో ఉన్నప్పుడే బీజేపీలో విలీనం చేయాలన్న ప్రతిపాదన వచ్చిందని, దానిని వ్యతిరేకించానని కవిత చెప్పే విషయం కూడా నమ్మశక్యంగా లేదంటున్నారు. కేసీఆర్ ఉద్యమ పార్టీగా పెట్టి తర్వాత దానిని జాతీయ పార్టీగా మార్చింది విలీనం చేయడానికి కాదు గదా? అన్న ప్రశ్న తలెత్తుతుంది. బీజేపీలో విలీనం చేస్తే కేసీఆర్ కు వచ్చే ప్రయోజనం ఏంటో అర్థం కూడా కావడం లేదు. బీజేపీలో ఒక నాయకుడిగానే మారతారు. మహా అయితే కేంద్రంలో మంత్రిపదవి దక్కుతుంది. రాష్ట్రం వారి చేతుల్లోకి పెట్టడానికి ఏ ప్రాంతీయ పార్టీ నేత అయినా ఎందుకు మొగ్గు చూపుతారన్న అనుమానం అందరిలోనూ కలుగుతుంది. అందులోనూ బీఆర్ఎస్ కు క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ ఉంది. ఓటు బ్యాంకు ఉంది. అంతకు మించి కేసీఆర్ అనే శక్తి ఉంది. వీటన్నింటినీ కాదని కమలం పార్టీలో కలిపేయడానికి కేసీఆర్ ఏం రాజకీయ అనుభవం లేని నేత కాదు గదా? అన్న ప్రశ్నకు మాత్రం సమాధానం దొరకడం లేదు. కవిత తాను బయటకు వెళ్లడానికి ఈ సాకు చెబుతున్నారన్న అభిప్రాయం కూడా కార్యకర్తల్లో ఏర్పడింది. గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఇది కేవలం రాజకీయ పదవుల కోసం కాదని, ఆస్తి విషయాలుకూడా అయి ఉండవచ్చన్న సందేహాలు అందరిలోనూ కలుగుతున్నాయి. అయితే ఆ విషయం బయటకు చెప్పకుండా ఇలా బీజేపీలో విలీనం చేస్తారని బురద జల్లి బయటకు వెళ్లిపోవడానికి కవిత ఏమైనా ప్లాన్ వేశారా? అన్న అనుమానం అయితే అందరిలోనూ కలుగుతుంది. కేసీఆర్ నేరుగా రంగంలోకి దిగి కవితతో మాట్లాడితే ఇవన్నీ సమసిపోతాయని అంటున్నప్పటికీ కవిత చేసిన వ్యాఖ్యలు మాత్రం అన్నా చెల్లెళ్ల మధ్య గ్యాప్ మాత్రం కంటిన్యూ అవుతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# గులాబీని దూరం పెట్టేసిన కవిత



అదిలాబాద్, మే 31,బీఆర్ఎస్ నాయకులు మీడియాతో మాట్లాడినా, ప్రజల్లోకి వెళ్లి ఏదైనా కార్యక్రమాలు చేసినా, లేక పార్టీ కార్యక్రమాలు చేపట్టినా తప్పనిసరిగా ధరించేది బీఆర్ఎస్ కండువానే! ఈ విషయంలో సందేహం లేదు. ఏదైనా మర్చిపోతే తప్ప, లేకపోతే నాయకులు ఎంతటి వారైనా, ఎంత ఉన్నత పదవిలో ఉన్నా ఖచ్చితంగా కండువా వేసుకోవాలనీ గతంలో కేసీఆర్ కూడా ఆదేశించారు. అలా చేయకపోతే వారిని పార్టీ నాయకులుగా ఎలా గుర్తించాలని ఆయన కఠినంగానే హెచ్చరించారుదీనికి కారణం ఉంది. తొలి విడత ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత కొందరు ధిక్కార స్వరం వినిపించారు. అయినా పార్టీలోనే ఉన్నారు. కానీ వారు కండువాను విస్మరించారు. తద్వారా తమ నిరసనను పార్టీ నాయకుడికి చెప్పాలన్నదే వారి వ్యూహం అయి ఉండొచ్చు. కానీ కేసీఆర్ ఈ విషయంలో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. “మీరు ఏం చేసినా కండువా వేసుకోండి. అదే మనకు గుర్తింపు. మీరు మర్చిపోయానని చెబితే కేసీఆర్ క్షమిస్తాడు, కానీ తెలంగాణ సమాజం క్షమించదు,” అని అన్నారు.కట్ చేస్తే? తాజాగా కేసీఆర్ కుమార్తె కవిత కండువాను పక్కన పెట్టారు. గురువారం ఆమె మీడియాతో చిట్‌చాట్ చేసినప్పుడు కానీ, అదే సమయంలో కొందరు యువకులు తెలంగాణ జాగృతిలో చేరినప్పుడు కానీ, ఆమె వారికి జాగృతి జెండాలనే కప్పారు తప్ప, బీఆర్ఎస్ జెండాలను మెడలో వేయలేదు. తాను కూడా వేసుకోలేదు. వాస్తవానికి గులాబీ వర్ణంలో మెరిసిపోయే బీఆర్ఎస్ కండువాపై కేసీఆర్, కారు గుర్తులు ముద్రించి ఉంటాయి. వీటిని ధరించడం నాయకులు గౌరవంగా కూడా భావిస్తారు.ఇక తాజాగా మంచిర్యాలలో పర్యటిస్తున్న సమయంలో కూడా కవిత బీఆర్ఎస్ కండువాను పక్కన పెట్టారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై తాను జైల్లో ఉన్నప్పుడు బిజెపి లో కలుపుతామనీ పార్టీ నేతలు కొందరు చెప్పారు. అయితే బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి నేను అప్పుడే ఒప్పుకోలేదు. ఇప్పుడు ఎందుకు ఆ నిర్ణయాన్ని సమర్థిస్తాను. పార్టీ అధినేత కేసీఆర్ కు తాను లెటర్ రాయడం లో నా తప్పేం లేదన్నారు. తన తండ్రి కేసీఆర్ ను కలిసే అవకాశం వచ్చింది , కానీ కలవలేకపోయాను. ఈ క్రమంలో ఆయనకు కొన్ని విషయాలు స్పష్టం చేసేందుకు లేఖ రాసినట్లు స్పష్టం చేశారు. కేసీఆర్ తనకు అధినేత, గురువు అని.. పార్టీ అధినేతకు తాను గతంలో పలు లేఖలు రాసినట్లు తెలిపారు. కానీ వాటిని వదిలిపెట్టి, కేవలం ఈ లెటర్ బయటికి తెచ్చిన వారు ఎవరు, ఈ కుట్ర వెనుక ఉన్న వారిని పట్టుకోండి అని ఛాలెంజ్ విసిరారు.మంచిర్యాలలో జరుగుతున్న వివాహానికి వెళ్తున్న సందర్భంగా కవిత పెద్దపల్లి పట్టణంలో అయ్యప్ప టెంపుల్ చౌరస్తా వద్ద ఆగారు. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేశారు. పెద్దపల్లిలో ఎమ్మెల్సీ కవితకు పెద్దపల్లి నియోజకవర్గం ఃఖీూ నాయకురాలు దాసరి ఉష ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్ లు, వార్డ్ మెంబర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.ఆమె తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించినప్పుడు కానీ, యువకులతో ముచ్చటించేప్పుడు కానీ ఎక్కడా బీఆర్ఎస్ కండువా ఆమె మెడలో కనిపించలేదు. మరి ఆమె ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారా? లేక మరిచిపోయారా? అనేది చర్చగా మారింది. మరిచిపోయినా, ఉద్దేశపూర్వకంగా చేసినా? కేసీఆర్ గతంలో చెప్పినట్లు అది సీరియస్ మ్యాటరే. సో? ఏం జరుగుతుందో చూడాలి.

# అన్నలపై గురిపెట్టిన చెల్లెళ్లు...

హైదరాబాద్, మే 31, అన్నలపై తిరుగుబాటు చేసిన చెల్లెళ్లు షర్మిల, కవిత ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారారు. ఆంధ్రాలో షర్మిల రెడ్డి, తెలంగాణలో కవిత తమకు ప్రాధాన్యం దక్కడం లేదంటూ తమ దారి తాము చూసుకుంటున్నారు. ఏపీలో షర్మిల ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా అప్పట్లో అన్నపై ప్రస్తుతం కూటమి పై తన పోరాటం చేస్తున్నారు. మెయిన్ ఫోకస్ అన్న జగన్ పైన అనేది బహిరంగ రహస్యం. ఇప్పుడు తెలంగాణలో కవిత కూడా అదే పనిలో ఉన్నారు. రేపో మాపో సొంత పార్టీ ప్రకటన రావచ్చనేది రాజకీయ వర్గాల్లో బలంగా సాగుతున్న చర్చ. కానీ తనకు అధినేత కేసీఆరేనని, కొత్త పార్టీ పెట్టే ఉద్దేశం లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య పోలికలు, వ్యత్యా సాల పై రకరకాల చర్చలు నడుస్తున్నాయి.షర్మిల కవిత ఇద్దరి పోరాటం ప్రధానంగా తమ తమ అన్నలపైనే. అధికారంలోకి వచ్చాక జగన్ మోహన్ రెడ్డి తనను పక్కన పెట్టారని షర్మిల పదేపదే ఆరోపిస్తారు. కవిత ఆరోపణ కూడా అదే కాకపోతే ఆమె డైరెక్ట్ గా పేరు ఎత్తలేదు ఇంకా. షర్మిల, కవిత ఇద్దరు ముఖ్యమంత్రుల కుమార్తెలు. తండ్రి చనిపోయాక షర్మిల, తెలంగాణ ఉద్యమ సమయంలో కవిత ప్రజాక్షేత్రంలో బాగా నలిగినవారే. ఎండలను లెక్కచేయకుండా అన్న కోసం పాదయాత్ర చేసిన గతం షర్మిలది అయితే తెలంగాణ కోసం సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుతూ ప్రజలను జాగృతం చేసేన చరిత్ర కవిత కు ఉంది. ఒకానొక దశలో అన్నమాటే తమ మాటగా ఇద్దరూ పేరు తెచ్చుకున్నారు. రాజకీయంగా ఇద్దరి భర్తలూ సైలెంట్ గా ఉండేవారే. ఢిల్లీ స్థాయిలో ఇద్దరికీ తమదైన ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. షర్మిల కవిత ఇద్దరి మధ్యా ఒక ముఖ్యమైన తేడా ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత షర్మిలకు ఎలాంటి ప్రాధాన్యత దక్కలేదు. కనీసం ఒక ఎమ్మెల్సీ లాంటి పదవి కూడా ఆమెకు ఇవ్వలేదు జగన్ మోహన్ రెడ్డి. కానీ కవిత కు అలాకాదు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఆమెకు రాజకీయంగా సముచిత స్థానాన్ని ఇచ్చారు. ఎంపీగా పనిచేశారు. ఆ తర్వాత ఎన్నికల్లో ఓడిపోతే ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా ఆయన లెక్క చేయలేదు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆమె పాత్ర చాలానే ఉన్నా 2018 ఎన్నికల గెలుపు లో ఆమె పాత్ర తక్కువే. కానీ షర్మిల అలా కాదు. తన అన్నయ్య జైల్లో ఉన్నప్పుడు ఏకంగా 16 నెలలపాటు పార్టీకి దిక్సూచిగా మారారు. పాదయాత్ర చేశారు.2019లో తన అన్న జగన్ మోహన్ రెడ్డి గెలుపులో ఆమె పాత్ర కూడా ఎంతో కొంత లేకపోలేదు. అయినప్పటికీ షర్మిలకు ఎలాంటి పదవి దక్కకపోవడంతో రాజకీయంగా ఆమెకు అన్యాయం జరిగిందన్న భావన సామాన్య ప్రజల్లో ఉంది. కవిత లిక్కర్ స్కామ్ ఆరోపణలతో జైలుకు వెళ్లి రావడం కెసిఆర్ కు చాలా తలనొప్పులు తెచ్చిపెట్టింది. షర్మిలపై ప్రస్తుతానికి వేరే రకమైన ఆరోపణ లు ఏవీ లేవు. శర్మలకు తన తల్లి విజయమ్మ పూర్తిస్థాయి మద్దతు ఉంది. కుమారుడితో విభేదించి మరీ ఆమె కుమార్తె షర్మిల వద్దనే ఉంటోంది. కవిత విషయంలో ప్రస్తుతానికి ఆమె మాతృమూర్తి స్టాండ్ ఏమిటన్నది తెలియదు. సీట్లు ఏవి రాకపోయినా ప్రస్తుతానికి షర్మిల రాజకీయంగా ఒక జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలుగా నెట్టుకొస్తున్నారు. కవిత రాజకీయ భవిష్యత్తు ఎలా ఉండబోతుందో తెలియాలంటే ఇంకొంచెం టైం పడుతుంది.

# ఏరియా ఆసుపత్రిలో కరెంట్ కష్టాలు

జహీరాబాద్ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కరెంట్ పోతే రోగులకు కష్టాలు తప్పడం లేదు. ఆస్పత్రిలో జనరేటర్లు సరిగా పనిచేయకపోవడంతో కరెంట్ లేని సమయంలో చిమ్మ చీకట్లు కమ్ముకుంటున్నాయి. దింతో చేసేదిమి లేక సెల్ఫోన్ టార్చ్ లైట్ వెలుతురులో రోగులకు చికిత్స అందించాల్సిన పరిస్థితి నెలకొంది.ఈ ఆస్పత్రి జాతీయ రహదారి 65 పక్కనే ఉంటుంది. ప్రతి రోజు పెద్ద సంఖ్యలో ఓపీ, ఇన్ పేషంట్ రోగులు వైద్య చికిత్సల కోసం ఇక్కడికి వస్తుంటారు. నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఉన్న ఈ ఆస్పత్రిలో ఆపరేషన్లు కూడా జరుగుతుంటాయి, దీంతో ప్రతి రోజు రద్దీగా ఉంటుంది. అనివార్య కారణాల వల్ల విద్యుత్ నిలిచిపోయినప్పుడు జనరేటర్లను ఆన్ చేయాలి. కానీ జరనేటర్లు పూర్తిస్థాయిలో పనిచే యడంలేదని తెలిసింది. దింతో తప్పనిసరి పరిస్థితిలో వైద్య సిబ్బంది సెల్ ఫోన్ టార్చ్ లైట్ లతో వైద్య సేవలందిస్తున్నారు. అధికారులు స్పందించి జనరేట్లరు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని రోగులు, బంధువులు కోరుతున్నారు.

# లక్షకు లక్ష అంటూ చీటింగ్

హైదరాబాద్, మే 31, స్టాక్ మార్కెట్లో డబ్బుల పంట పండుతోంది.. లక్ష పెడితే.. కొద్ది రోజుల్లోనే లక్ష వస్తాయి.. లక్షకు లక్ష అని ఓ కంపెనీ ఆశచూపడంతో అమాయకులు నిండా మునిగిపోయారు. నిజమేనని నమ్ముకుని ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకుని సంపాదించుకున్న సొమ్ము, మరికొస్త అప్పులు చేసి పెట్టుబడిగా పెట్టారు. ఇప్పుడు తమకు న్యాయం చేయాలని పోలీసుల వద్దకు పరుగులు పెడుతున్నారు. మేడ్చల్ జిల్లాజీడిమెట్ల పియస్ పరిదిలోని చింతల్ లో కొద్ది రోజుల కిందట ది పెంగ్విన్ పేరుతో ఓ కంపెనీ ఏర్పాటయింది. తాము స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ చేస్తామని .. ప్రచారం చేసుకుంది. తమ వద్ద పెట్టుబడి పెడితే లక్ష రూపాయలకు లక్ష లాభం ఇస్తామని చెప్పి 1500మంది కస్టమర్ల వద్ద 150 కోట్లు వసూలుచేశారు. ఇప్పుడు లక్షకు లక్షకాదు కదా..అసలు కూడా ఇవ్వకుండా పరారయ్యారు. మోసపోయామని గ్రహించి జీడిమెట్ల పియస్ కి భాదితులు క్యూ కట్టారు. చింతల్, గణేష్‌నగర్‌లో ‘ది పెంగ్విన్ సెక్యూరిటీస్’ అనే పేరుతో కొందరు ఒక సంస్థను ఏర్పాటు చేశారు. కాస్త హైఫైగా ఏర్పాటు చేసిన సంస్థ గురించి అక్కడి స్థానికుల్లో గొప్పగా ప్రచారం చేయించుకున్నారు. స్టాక్ మార్కెట్లలో కోట్లు సంపాదించారని ప్రచారం చేసుకున్నారు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే తక్కువ కాలంలోనే మంచి రాబడి వస్తుందని అందర్నీ నమ్మించారు. తాము పెట్టిన పెట్టుబడికి కోట్లు సంపాదించామని ఇంకా ఎక్కువ పెట్టుబడి పెడితే ఇంకా ఎక్కువ వస్తుందని..అందుకే జనాల సొమ్ముతో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నామని చెప్పారు. మొదట్లో పెట్టుబడులు పెట్టిన వారికి ఆకర్షణీయమైన పథకాలతో తిరిగి డబ్బులు ఇచ్చారు. అలా డబ్బులు పొందిన వారు ప్రచారం చేయడమే కాదు.. మరికొంత సొమ్ము వవేసి అక్కడే జమ చేయడం ప్రారంభించారు. కొద్దిరోజులు పోయాక తమ వద్ద వారి సొమ్ము పేరుకుపోయిందని.. అంతా స్టాక్స్ లో పెడుతున్నామని భారీగా పెరుగుతోందని నమ్మిస్తూ వచ్చారు. అయితే కొద్ది రోజులుగా ఎవరికీ డబ్బులు తిరిగి ఇవ్వడం లేదు. అప్పటికే వీరి మాయమాటలు నమ్మిన సుమారు 1,500 మంది అమాయకులు తమ కష్టార్జితాన్ని ఈ సంస్థలో పెట్టుబడులుగా పెట్టారు. హఠాత్తుగా ఓ రోజు బోర్డు తిప్పేశారు.మదుపర్లకు నమ్మకం కలిగించేందుకు వారికి బాండ్ల రూపంలో కొన్ని పత్రాలను కూడా సంస్థ నిర్వాహకులు అందజేశారు. అవి ఎందుకు పనికి రావని తేలిపోయింది.

బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అసలు వాళ్లెవరు ఇంత ఈజీగా ఎలా మోసం చేశారన్నదానిపై దర్యాప్తు చేస్తున్నారు.

# ఎర్త్ ఎవరికి..బెర్త్ ఎవరికి...

## ఆ నలుగురకి చెక్...

హైదరాబాద్, మే 31, తెలంగాణ కాంగ్రెస్‌లో పదవుల భర్తీ డైలీ ఎపిసోడ్ అయిపోయింది. రోజుకో ట్విస్ట్..క్లైమాక్స్‌లో ఇంటర్వెల్ రేంజ్‌లో ఏదో ఒక అడ్డంకి వచ్చి పడుతూనే ఉంది. అయితే ఈసారి అన్నింటినీ క్లియర్ చేస్తూ పార్టీ అధిష్టానం ముందుకెళ్తోందట.

జూన్ మొదటి వారంలో క్యాబినెట్ విస్తరణ చేయాలని ఫిక్స్ అయినట్లు పార్టీ వర్గాల టాక్. అందుకు అనుగుణంగా పార్టీ కమిటీలను కూడా ఒక్కొక్కటిగా భర్తీ చేస్తోంది. పార్టీ అతి కీలకమైన పీఏసీతో పాటు అడ్వైజరీ, క్రమశిక్షణ కమిటీ, డీలిమిటేషన్ కమిటీ, సంవిధాన కమిటీలను నియమిస్తూ ఏఐసీసీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో మిగతా వాటికి లైన్ క్లియర్ అయ్యిందనే చర్చ పార్టీలో జోరుగా నడుస్తోంది.కమిటీల నియామకంతో క్యాబినెట్ కూర్పుపై ఇన్ డైరెక్ట్‌గా ఇండికేషన్ ఇచ్చినట్లేననే చర్చ పార్టీలో జరుగుతోంది.

పార్టీలో అత్యున్నత నిర్ణయాత్మక కమిటీ అయిన పీఏసీలోకి నలుగురు మంత్రులు మినహా అందరికి అవకాశం కల్పించారు. పీఏసీలో క్యాబినెట్ మంత్రులందరూ ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారని మెన్షన్ చేసినా.. నేరుగా ఆ నలుగురు మంత్రుల పేర్లు లేకపోవడం చర్చకు దారితీస్తోంది.ప్రధానంగా పీఏసీలో కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు ఛాన్స్ దక్కలేదు. వీరిలో కొండా సురేఖకు క్యాబినెట్ నుంచి కచ్చితంగా ఉద్వాసన పలుకుతారనే చర్చ బలంగా నడుస్తోంది. అందుకే ఆమె ప్లేస్‌లో పీఏసీ కమిటీలోకి అదే సామాజికవర్గం మున్నూరు కాపుకు చెందిన ఆది శ్రీనివాస్‌కు కమిటీలో చోటు దక్కిందంటున్నారు. దీని ద్వారా మంత్రివర్గంలో కూడా ఆది శ్రీనివాస్‌కు పక్కా ఛాన్స్ ఉంటుందనే టాక్ నడుస్తోంది.ఇక మిగతా మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు ఎందుకు ఛాన్స్ రాలేదనే చర్చ జరుగుతోంది. పీఏసీ కమిటీలో ఛాన్స్ దక్కని మిగతా ముగ్గురు మంత్రులకు చెందిన సేమ్ సామాజిక వర్గం నుంచి ఇతర నేతలకు అవకాశం కల్పించడంలో వ్యూహం ఏమై ఉంటుందనే చర్చ జరుగుతోంది.

మంత్రి జూపల్లి సామాజికవర్గానికి చెందిన ప్రేమ్‌సాగర్ రావుకు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సామాజికవర్గానికి చెందిన సుదర్శన్‌రెడ్డికి, తుమ్మల నాగేశ్వరరావు సామాజిక వర్గానికి చెందిన జెట్టి కుసుమ్ కుమార్‌కు ఛాన్స్ దక్కింది. ఇలా వీరికి ఛాన్స్ ఇవ్వడంలో మతలబు ఏంటనేది హాట్ టాపిక్‌గా మారింది. ప్రేమ్‌సాగర్ రావు, సుదర్శన్‌రెడ్డిలు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. జెట్టి కుసుమ్ మాత్రం ఏ సభలో కూడా ప్రాతినిధ్యం లేదు. అయితే మంత్రి తుమ్మల పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా పాల్గొనరు కాబట్టి ఆ ప్లేస్‌లో సీనియర్ నేత జెట్టికి అవకాశం ఇచ్చారనే టాక్ ఉంది.పీఏసీలో మంత్రులకు చోటు కల్పించకపోవడం ఒక చర్చ అయితే.. రాజ్యాంగ బద్ధ పదవుల్లో ఉన్న వారిని పార్టీ పదవుల్లో నియమించడంపై చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న సిరిసిల్ల రాజయ్య, రైతు కమిషన్ మెంబర్‌గా ఉన్న రాములు నాయక్‌కు పీఏసీలో చోటు కల్పించడం చర్చకు దారి తీసింది. రాజ్యాంగ బద్ధ పదవుల్లో ఉన్న ఇద్దరు నేతలను పార్టీ కమిటీల్లోకి తీసుకోవడం ఏంటన్నది కాంగ్రెస్ నేతలకే అర్థం కావటం లేదట. అయితే పీఏసీ కమిటీ లిస్ట్‌లో ఎవరికి చోటు కల్పించారో.. ఎవరు ఎంపిక చేశారో కూడా పీసీసీ చీఫ్‌తో సహా ఎవరికి తెలియదట. అధిష్టానం డైరెక్టుగా లిస్ట్ ఇచ్చినట్లు గాంధీభవన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.ఇక పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టుల విషయంలో కూడా కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సంపత్ కుమార్, బలరాం నాయక్, రోహిణ్ రెడ్డి, ఫహీం ఖురేషిల పేర్లు దాదాపు ఖరారైనట్లు చర్చ జరుగుతోంది. ఈ కమిటీ విషయంలో స్పష్టత రాగానే వర్కింగ్ ప్రెసిడెంట్లతో పాటు జనరల్ సెక్రటరీ, వైస్ ప్రెసిడెంట్ల పోస్టులను భర్తీ చేస్తారట. ఒక్క పీఏసీ కమిటీ నియామకం రకరకాల చర్చలకు దారి తీస్తోంది. క్యాబినెట్ కూర్పు, వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకానికి అదొక ఇండికేషన్ అంటున్నాయి హస్తం పార్టీ వర్గాలు. క్యాబినెట్ కూర్పు జూన్ మొదటి వారంలో ఉండనున్న నేపథ్యంలో ..ఛాన్స్ దక్కే లక్కీ పర్సన్ పేర్ల విషయంలో ఒకటి, రెండు రోజుల్లో మరింత స్పష్టత రానుంది.

# ఈటెల, హరీష్ భేటీ..

## కాళేశ్వరం వ్యవహారమేనా



హైదరాబాద్, మే 31,కాళేశ్వరం కమిషన్ ఎదుట వీరంతా కూడా హాజరవుతారని వార్తలు వస్తున్న నేపథ్యంలో తెలంగాణ రాజకీయాలలో సంచలనం నెలకొంది. అయితే దీనికంటే ముందు ఇటీవల ఎర్రవల్లి లోని తన వ్యవసాయ క్షేత్రంలో హరీష్ రావుతో కెసిఆర్ భేటీ అయ్యారు. గంటలపాటు మంతనాలు జరిపారు. ఆ తర్వాత విశ్రాంత ఇంజనీర్లతో కూడా భేటీ అయ్యారు. నాడు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో చోటుచేసుకున్న పరిణామాలపై చర్చించారు. అయితే మొదట్లో కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు కేసిఆర్ హాజరుకాబోరని గులాబీ మీడియా వార్తలు ప్రచురించింది. ఆ తర్వాత కేసీఆర్ మనసు మార్చుకోవడంతో.. ఆయన విచారణకు హాజరవుతారని చెప్పింది. ఇక హరీష్ రావు, కెసిఆర్ భేటీ కావడం సంచలనం సృష్టించింది. అయితే దీనికంటే సంచలనమైన వార్తను.. సంచలనమైన విషయాలను వెల్లడించారు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.నాటి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఈటెల రాజేందర్ కు కూడా కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మొన్న షామీర్ పేట లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో హరీష్ రావు, ఈటల రాజేందర్ రహస్యంగా కలుసుకున్నారని పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.. అనంతరం వాళ్ళిద్దరూ కేసీఆర్ తో మాట్లాడారని విమర్శించారు. కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరయ్యే ముందు వారిద్దరు అనేక విషయాలు చర్చించుకున్నారని.. అత్యంత రహస్యంగా ఈ భేటీ జరిగిందని.. నాడు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణంలో అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. వారిద్దరు పైకి ప్రత్యర్థులుగా కనిపిస్తున్నారని.. కానీ లోపల మాత్రం ఒకటేనని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. “కాళేశ్వరం విషయంలో కమిషన్ కు వాస్తవాలు చెప్పి ఈటెల రాజేందర్ మోడీ మనిషి అనిపించుకుంటారా లేదా కెసిఆర్ కు అనుకూలంగా చెప్పి బిజెపి వ్యతిరేకి అనిపించుకుంటారా”అనేది ఈటెల రాజేందర్ తేల్చుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు..కాళేశ్వరం పథకం నిర్మాణంలో ఇష్టానుసారంగా వ్యవహరించారు. అక్రమాలకు పాల్పడ్డారు. దాని ఫలితమే ప్రస్తుతం ఈ పర్యవసనాలు. ఇవన్నీ కూడా ప్రజలకు కనిపిస్తున్నాయి. అందువల్లే కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరుకావాలని నోటీసులు పంపింది. తద్వారా నాటి ప్రభుత్వ పెద్దల అవినీతి ప్రజల ముందు బహిర్గతమవుతుంది.. ఇదంతా కూడా మేము కక్షతో చేస్తున్నది కాదు. ప్రజలకు వాస్తవాలు తెలియాలనే కమిషన్ విచారణకు హాజరు కావాలంటున్నది.. ఈ వ్యవహారంలో ఇప్పటికే మామా అల్లుడు తీవ్రస్థాయిలో చర్చలు సాగించారు. చివరికి కమిషన్ ఎదుట విచారణకు హాజరు కాకపోతే ఇజ్జత్ పోతుందని భావించి వస్తున్నారని” మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. మహేష్ కుమార్ సంచలన ప్రెస్ మీట్ తెలంగాణ రాజకీయాలలో ప్రకంపనలు సృష్టిస్తోంది. మరి దీనిపై గులాబీ పార్టీ ఎలాంటి కౌంటర్ ఇస్తుందో.. ఈటల రాజేందర్ వర్గీయులు ఇలాంటి సమాధానం చెప్తారో చూడాల్సి ఉంది.

# కృష్ణ గోదావరి ద్వారా 15 టిఎంసిల నీరు హైదరాబాద్ కు

**త్రాగునీటి సమస్య తీర్చడానికి కృష్ణ గోదావరి ద్వారా 15 టిఎంసిల నీరు**
**హైదరాబాద్ కు తరలింపుకు ప్రభుత్వం కృషి**
**అర్హులైన పేదలకు రెండు పడకల గదులు అందిస్తాం**
**భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు**
**300 గజాలు విస్తీర్ణం గల ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి**
**సీజనల్ వ్యాధుల ప్రజల అప్రమత్తంగా ఉండాలి**
**జిల్లాలోని 169 బస్తీ దావఖానాలల్లో అందుబాటులో మందులు**
**సన్న బియ్యం పంపిణీ తో సంతోషం వ్యక్తం చేస్తున్న పేదలు**
**నూతన రేషన్ కార్డులకు సర్వే చేపట్టాం**
**రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**




హైదరాబాద్, మే 31 హైదరాబాద్ నగరవాసుల తాగునీటి సమస్య పరిష్కారం కోసం కృష్ణ గోదావరి నుండి 15 టిఎంసిల నీరు అందించినందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం జిహెచ్ఎంసి కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి సమీక్షా సమావేశం మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. రాజీ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, సివిల్ సప్లై, వైద్య ఆరోగ్యం, ఎలక్ట్రిసిటీ, విద్య తదితర అంశాలపై చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి కేటగిరీల వారీగా రుణాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

హైదరాబాద్ జిల్లాలో 41,726 మంది నిరుద్యోగ యువతకు రుణాలు అందించాలని లక్ష్యం కాగా 1,25, 595 మంది నిరుద్యోగ యువకులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో రాజీవ్ యువశక్తి పథకానికి రూ. 6230.52 కోట్లు కేటాయించిందని అన్నారు. హైదరాబాద్ మహానగరంలో జన సాంద్రత పెరుగుతున్న నేపథ్యంలో అన్ని నియోజక వర్గాల్లో అభివృద్ధి సంక్షేమ పథకాలు అలాగే నీటి నిల్వలు, ప్రజల అవసరాల మేరకు మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

సన్న బియ్యం పథకం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉగాది పండుగ రోజున సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని హైదరాబాద్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఏప్రిల్ మాసంలో అందించలేకపోయామని మే మాసం నుండి 653 రేషన్ షాపుల ద్వారా ప్రతి నెల 14500 మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నామని అన్నారు. వర్షాకాలం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో మూడు నెలల కు గాను 42,619 మెట్రిక్ టన్నుల సన్నబియాన్ని కేటాయించడం జరిగిందని అందులోనుండి ఇప్పటివరకు 8440 మెట్రిక్ టన్నుల బియ్యన్ని రేషన్ షాపులకు అందించడం జరిగిందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. రేషన్ కార్డుల సర్వే ప్రక్రియ చేపట్టామని త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులో అందించడం జరుగుతుందని తెలిపారు.

నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3500 డబ్బులు బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేసేందుకు నిర్ణయించడం జరిగిందని అన్నారు. హైదరాబాద్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు చొప్పున అందించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ స్థలాలు తక్కువగా ఉన్నందున ఇల్లు కట్టించేందుకు కొంత ఇబ్బంది ఉన్నప్పటికీ ప్రత్యేక ప్రణాళికతో అర్హులైన పేదలకు ఇండ్ల నిర్మాణాలు చేపట్టి అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇప్పటికే కట్టిన 62500 పైగా ఉన్న రెండు పడకల గదుల ఇండ్లను ప్రభుత్వంతో చర్చించి మిగిలిపోయిన ఇళ్లను ఈనెల 15 వరకు పేదలకు పంపిణీ చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. అదేవిధంగా స్థలాలు ఉన్న పేదలకు అత్యంత ప్రాధాన్యతతో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వటం జరుగుతుందని అన్నారు.

జూన్ 12 వరకు స్కూల్ యూనిఫామ్ లతోపాటు పాఠ్యపుస్తకాలు, టెస్ట్ బుక్స్ అందించడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. వర్షాకాలం నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాను వర్షపు నీటి ద్వారా భూగర్భ జలాలు పెంచే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని ఆ దిశలో భాగంగా ప్రతి 300 గజాల ఇంటి స్థలం ఉన్నవారు ఇంకుడు గుంతలు చేపట్టే విధంగా జిహెచ్ఎంసి అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అదేవిధంగా వర్షాకాలం నేపథ్యంలో 150 మాన్సూన్ ఎమర్జెన్సీ ప్రత్యేక బృందాలను ఏర్పాటుతోపాటు నిరంతర పర్యవేక్షణ అలాగే పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. గ్రేటర్ 141 వాటర్ లాగిన్ పాయింట్స్ గుర్తించడం జరిగిందని అందులో 76 వాటర్ లాగింగ్ శాస్వత నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందనిఅన్నారు.

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా హైదరాబాద్ జిల్లా 69 బస్తీ దవఖానా లలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచడం జరిగిందని బస్తీ దవఖానాలో ఇతర వ్యాధుల చికిత్స లకై సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. హైదరాబాద్లో వర్షపు నీటి తొలగింపుకు శాశ్వత పరిష్కారం కల్పించడం జరుగుతుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ సమావేశంలో భాగంగా పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు శాసనమండలి సభ్యులు లేవనెత్తిన అనేక అంశాలపై అంశాల వారీగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరించనున్నట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వర్షాకాలం సందర్భంగా మొక్కలు నాటే వన మహోత్సవం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టనున్నట్లు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని మంత్రి పేర్కొన్నారు.

ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి , ఏ ఐ ఎం ఐ ఎం శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, హెచ్ఎండిఏ కమిషనర్ అశోక్ రెడ్డి,హైడ్రా కమిషనర్ రంగనాథ్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏ ఐ ఎం ఐ ఎం శాసన మండలి సభ్యులు మిర్జా రహంత్ బెగ్, మీర్జా రియాజ్ ఉల్ హాసన్ ఎఫ్ఫెండీ, శాసన సభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ జాఫర్ హుస్సేన్, అహ్మద్ బిన్ అబ్దుల్లా బకాల, మజీద్ హుస్సేన్ కౌసర్ మొహియుద్దీన్, మీర్ జుల్ఫిజర్ అలీ, జాఫర్ హుస్సేన్ మొహమ్మద్ ముబిన్, టి ఆర్ ఎస్ ఎమ్మెల్యే కాకేరు వెంకటేష్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దండీ దయాకర్, అమీర్ ఆలీ ఖాన్ బలమురి వెంకట్ ఎమ్మెల్యే గణేష్, బి జే పి ఎమ్మెల్యే రాజాసింగ్, సంగీత నాటక అకాడమీ చైర్మెన్ అలేఖ్య పుంజర తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో ఆగని కోడెల మృత్యుఘోష

రాజన్న సిరిసిల్ల వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ గోశాలలో కోడెల మృత్యుఘోష ఆగడంలేదు. తాజాగా శుక్రవారం రాత్రివరకు మరో ఐదు కోడెలు మృతి చెందాయి. పదుల సంఖ్యలో కోడెలు మృత్యువాత పడుతున్నా దేవాదాయ శాఖ అధికారులు సరిగా స్పందించడంలేదు. కలెక్టర్ ఆదేశాలతో పశు వైద్యాధికారులు పరిశీలన చేసారు. అనారోగ్యంతో మృతి చెందుతున్నాయని నివేదిక ఇచ్చారు. కోడెల మొక్కు ఆదాయం పై ఉన్న శ్రద్ధ కోడెల ఆలనాపాలన పై ఆలయ అధికారులకు లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. 24 గంటల వ్యవధిలో 13 కోడెల మృతి పై సర్వత్రా ఆందోళన నెలకొంది. గోశాలలో కోడెల సంరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని హిందూ సంఘాల డిమాండ్. ఆలయ ఈవో వినోద్ రెడ్డి సెలవు పై వెళ్లారు. .

## తూప్రాన్ లో విద్యార్థులకు, ప్రజలకు అందుబాటులో నవ్య శ్రీ జనరల్ స్టోర్స్, గిఫ్ట్ ఐటమ్స్, జిరాక్స్ సెంటర్ను ప్రారంభించిన ప్రొప్రైటర్ రమేష్ గౌడ్




**గజ్వేల్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి** :-మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీలో హై స్కూల్ పరిధిలోని ఎస్ వి బేకరీ పక్కన నవ్య శ్రీ జనరల్ స్టోర్స్ జిరాక్స్ సెంటర్ను ప్రారంభించడం జరిగిందని తూప్రాన్ డివిజన్ ప్రాంత ప్రజలకు అతి తక్కువ ధరలో బుక్కులు, జనరల్ స్టోర్స్ ఐటమ్స్, గిఫ్ట్ ఐటమ్స్ స్కూల్ టెస్ట్ బుక్స్ చాలా తక్కువ ధరలో విక్రయించడం జరుగుతుందని స్కూల్లో యొక్క ప్రతి ఒక్క బుక్ లు విక్రయించడం జరుగుతుందని, ప్రొప్రేటర్ రమేష్ గౌడ్ మీడియాతో తెలిపారు.

## నిరుపేదల కోసం "మహా ప్రస్థానం"





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి 31 :** జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో నిర్మించిన మహాప్రస్థానం (వైకుంఠధామం) నిరుపేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల మహాప్రస్థానం ను మంచిర్యాల,కుమ్రంభీం ఆసిఫాబాద్,ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్,వెంకటేష్ దోత్రే,రాజర్షి షా,అభిలాష అభినవ్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, శాసనమండలి సభ్యులు దండే విఠల్,మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,జి.సి.సి. చైర్మన్ కొట్నాక తిరుపతి లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ... మంచిర్యాల పట్టణంలో నిర్మించిన మహాప్రస్థానం రాష్ట్రంలోనే అత్యున్నతంగా ఉందని,ప్రజల కొరకు నిర్మించిన మహాప్రస్థానంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఎక్కడ అన్యాయం జరిగితే నేను అక్కడ ఉంటా

**వి. హనుమంతరావు మాజీ ఎంపీ, లక్ష్మణ్ యాదవ్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి...**




**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** భూ భారతి లో అసైన్డ్ భూములు స్వాధీనం చేసుకొని బడా బాబుల చేతిలో ఉన్న భూములు గుంజుకుంటాం అని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు
అది శుభపరిణామం
కీసర దాయారులో ఉన్న మాదిగల పట్టా భూమి 38ఈ సర్వేలో రాగి కృష్ణా రెడ్డి
చనిపోయిన దళితుల దొంగసంతకులు ఫోర్జరీ చేసి కోడళ్ల పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు
కీసర దాయారులో 120 మంది కుటుంబాలు రోడ్డున పడ్డారు
ఇందిరా గాంధీ ఇచ్చిన భూములు గుంజుకుంటే చూస్తూ ఊరుకోను
అక్కడ రాగి కృష్ణా రెడ్డి కూతుర్లు 36ఎకరాలు వెంచర్లుకు ఇచ్చారు హెచ్ఎండీఏ లే ఔట్ ఉంది
పేదల భూములు లే ఔట్ కి ఎలా ఇస్తారు
కీసర లో 120 మంది దళితులు రోడ్డున పడ్డారు
ఎంఆర్వో కూడా పేదల భూములని సర్టిఫై చేసింది
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రిక్వెస్ట్
మిగతా 50ఎకరాలు పేదలకు ఇవ్వండి
అన్యాయం జరిగితే నేను చూడలేను
పేదలకు ఎక్కడ అన్యాయం జరిగితే నేను అక్కడ ఉంటా
దొరల దగ్గర భూములు లాక్కుంటాం అన్నా పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేదలకు న్యాయం చేయండి
ఈ భూమి ఇప్పిస్తే భూ భారతికి ,సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు వస్తుంది
ఈటెల రాజేందర్ పేదలకోసం ఏరోజైనా మాట్లాడలేదు

## కిన్నెరసాని గిరిజన గురుకుల పాఠశాలలో శ్రమదానం

**పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్..**

భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ మండలం, కిన్నెరసానిలోని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడల పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన తెలంగాణ కాంగ్రెస్ బునియాది ఆదివాసి కార్యకర్తల సమ్మేళనం ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు.

రాష్ట్రంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో శ్రమదానం చేయాలనే సంకల్పంలో భాగంగా కిన్నెరసాని గిరిజన గురుకుల పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఇతర ప్రముఖులు పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి, శ్రమదానంలో చురుకుగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, రామచంద్రనాయక్, పాయం వెంకటేశ్వర్లు ఉన్నారు.

# ఎమ్మెల్యే నే తన లక్ష్యం అంటున్నా హరికృష్ణ

## శివ్వంపేట ఎంపీపీగా రెండుసార్లు ఉత్తమ సర్పంచ్ గా రాష్ట్రపతితో నిర్మల్ పురస్కార్ అవార్డు .



**నర్సాపూర్ నియోజకవర్గం ప్రజా బలం ప్రతినిధి** :-తెలంగాణ రాష్ట్రంలోనే చతురత కలిగిన రాజకీయ నాయకుడిగా పేరు కల్లూరి హరికృష్ణ పేరు గడించారు. మెదక్ జిల్ల శివ్వంపేట మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన కల్లూరి ముత్యాలు రాణెమ్మ దంపతులకు ద్వితీయ సంతానంగా కల్లూరి హరికృష్ణ 1979 జూన్ 1న నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానలో జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం శ్రీ బాలాజీ కాన్వెంట్ స్కూల్ శివ్వంపేట మండల కేంద్రంలో 1982 నుంచి 85 వరకు ఒకటవ తరగతి నుంచి మూడవ తరగతి వరకు చదువుకున్నారు. 1986 నుంచి 1993 వరకు తూప్రాన్ చిల్డ్రన్ స్కూల్ 4వ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుకున్నారు. 1994 నుంచి 1996 వరకు హైదరాబాద్ నగరం ఎస్సార్ నగర్ లోని త్రివేణి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. 1997 నుంచి 1999 వరకు ఎస్సార్ నగర్ లోని విశ్వ భారతి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ లో డిగ్రీ పూర్తి చేశారు. ఇదే సమయంలో తన రాజకీయ గురువు మదన్ రెడ్డి కి ప్రియా శిష్యుడుగా 1999 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి తెలుగుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నర్సాపూర్ నుంచి పోటీ చేసిన మదన్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. అదే ఎన్నికల్లో హరికృష్ణ తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి అయిన మదన్ రెడ్డికి మద్దతుగా గ్రామాలలో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అప్పటినుంచి 2003 సంవత్సరం వరకు మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా హరికృష్ణ పని చేశారు. 2006 సంవత్సరంలో హరికృష్ణ తెలుగుదేశం పార్టీ నుంచి ఎదుల్లాపూర్ సర్పంచ్ గా పోటీ చేసి గెలుపొందారు. సర్పంచ్ గా ఎన్నికైన హరికృష్ణ తన రాజకీయ ఎదుగుదలకు ఇదే సరైన సమయం గా భావించి రాజకీయ వ్యూహంతో ముందుకు సాగారు. అందులో భాగంగానే మండలంలో ఉన్న సర్పంచ్ లందరి చేత మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడిగా హరికృష్ణను ఎన్నుకున్నారు.

ఇదే సమయంలో జిల్లాలో కూడా తనదైన ముద్ర వేయడానికి హరికృష్ణ తనకు తానుగా గుర్తింపు తెచ్చుకోవడానికి జిల్లా సర్పంచుల ఫోరం కోశాధికారిగా ఎన్నికై పనిచేశారు. ఇదే సమయంలో తెలుగుదేశం పార్టీలో మండల పార్టీ ఉపాధ్యక్షుడిగా రెండు పర్యాయాలు, జిల్లా కార్యదర్శిగా ఒక పర్యాయం కొనసాగారు. అయితే రాజకీయంగా రాణించాలంటే, చిత్తశుద్ధితో ప్రజాసేవ చేయాలంటే, రాజకీయంగా కేవలం సర్పంచ్ పదవీ సరిపోదని గ్రహించి, ఒకపక్క రాష్ట్రంలో కే. చంద్రశేఖర రావు నేతృత్వంలో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ మలీ దశ ఉద్యమం ఎగసిపడుతూ ఉగ్రూతలు ఊగుతుంది. ఇదే సమయంలో హరికృష్ణ తెలంగాణ ఉద్యమం పైపు ఆకర్షితులై 2010 హత్నూర మండలం దౌల్తాబాద్ లో చౌరస్తాలో ఏర్పాటుచేసిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ వచ్చిన కేసీఆర్ సమక్షంలో, హరికృష్ణ తన వెంట వచ్చిన 12 మంది తెలుగుదేశం సర్పంచులు, ఇద్దరు ఎంపిటిసిలతో టిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇదే 2010 సంవత్సరంలో హరికృష్ణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయన టిఆర్ఎస్ లో చేరిన తర్వాత శివంపేట మండలంలో క్షేత్రస్థాయి నుంచి తన అనుచర గణాలతో కలిసి గ్రామాలలో మహిళలను, రైతులను, యువజన సంఘాలను తెలంగాణ ఉద్యమ వైపు ఆకర్షితులను చేసి మండలంలో తెలంగాణ రాష్ట్ర సమితి బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడంలో తనదైన పాత్ర పోషించారు. ఒకపక్క సర్పంచ్ గా పని చేస్తూనే, సొంత గ్రామం పై ఉన్న మక్కువతో ఎదుల్లాపూర్ గ్రామాన్ని కేవలం రెండు నెలల సమయంలో ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, ప్రధాన కోడళ్ళల్లో చెత్త రింగులను ఏర్పాటు చేయించారు. ఎక్కడ కూడా మురికి కుపాలు, చెత్తాచెదారాలు, పెంట కుప్పలు లేకుండా ఎదుల్లాపూర్ ను ఒక అధునాతన గ్రామంగా, 100 శాతం సంపూర్ణ పారిశుధ్యంగా తన గ్రామాన్ని సుందరీకరించారు. హరికృష్ణ సేవలను గుర్తించిన కేంద్ర బృందం గ్రామంలో పర్యటించి ఉత్తమ గ్రామంగా ఎదుల్లాపూర్ ను ఎంపిక చేసి, 2008 సంవత్సరంలో అప్పటి భారత రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా హరికృష్ణ నిర్మల్ గ్రామ పురస్కారం అవార్డు అందుకున్నారు. అదేవిధంగా 2009లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చేతుల మీదుగా శుభమా అవార్డు అందుకున్నారు. ఇదే సంవత్సరంలో అప్పటి మెదక్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సర్పంచ్ అవార్డును సైతం హరికృష్ణ సొంతం చేసుకున్నారు. 2011 నుంచి ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 2014 వరకు పనిచేశారు. ఇదే సంవత్సరంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో హరికృష్ణ మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామం నుంచి టిఆర్ఎస్ ఎంపిటిసి అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. అయితే ఎన్నికల్లో హరికృష్ణ వ్యతిరేకంగా రాజకీయ శక్తుల ఏకీకరణ జరిగి ఆయనను రాజకీయంగా ఎదగకుండా చేసేందుకు కుయుక్తులు పన్ని, ఎన్నికల ఓడించేందుకు తన ఇంట్లో జరిగిన ఒక ఘటనను ప్రాదేశిక నియోజకవర్గం లోని ఓటర్లకు గుర్తు చేస్తూ ప్రత్యర్థులందరూ ఎదుల్లాపూర్, తిమ్మాపూర్, చిన్నగొట్టిముక్ల గ్రామాలలో విషప్రచారం గావించిన మూడు గ్రామాల ప్రజలందరూ హరికృష్ణ వైపు నిలబడి హరికృష్ణ బంపర్ మెజార్టీతో ఎంపీటీసీగా గెలిపించారు. ఈ దెబ్బతో హరికృష్ణ ద్విముఖ వ్యూహం ముందు ప్రత్యర్థులందరూ చిత్తు అయిపోయారు. ఇదే సమయంలో హరికృష్ణ అంకుటీత దీక్ష, రాజకీయ సంకల్పంతో ఎంపీపీ కావాలనే దృఢ నిర్ణయానికి వచ్చి టిఆర్ఎస్ తరఫున గెలుపొందిన ఎంపిటిసి లందరూ, ఒక్కరు మినహా మిగతా ఎంపీటీసీ లు అందరూ హరికృష్ణ వైపు అనుకూలంగా నిలబడి టిఆర్ఎస్ పార్టీలోనే గట్టి పోటీ ఎదురైనప్పటికీ, టీఆర్ఎస్ హైకమాండ్ పార్సిల్ ఉత్తర్వులను కూడా హరికృష్ణ దిక్కరించి, 8 మంది ఎంపిటిసిల మద్దతుతో తొలిసారిగా ఎంపీపీగా ఎన్నికయ్యారు. అయితే హరికృష్ణ ఎంపీపీగా ఎన్నికైనప్పటి నుంచి నిర్విరామంగా, జిల్లాస్థాయి అధికారులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, మరొపక్కా రాజకీయ ప్రత్యర్థులతో నెగ్గుకు వస్తూ, మండలంలో అనేక రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలుపరుస్తూ, శివంపేట మండలాన్ని జిల్లాలోనే ఉత్తమ మండలంగా తీర్చిదిద్దారు.

ఇదే సమయంలో మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో, తాసిల్దార్, ఇలా అందరినీ ఇప్పటికప్పుడు సమన్వయం చేస్తూ, మండలంలో ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మింపజేశారు. గ్రామాలలో ఉన్న ఇనుప స్తంభాలాను తొలగించి, సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయించారు. పాంబండలో దారికి అడ్డంగా ఉన్న బండను బ్లాస్ట్ చేయించి గ్రామానికి దారిని నిర్మించారు. కొన్ని గ్రామాలకు అంతర్గత సీసీ, బీటీ రోడ్లు, అలాగే లింకు మెటల్ రోడ్లు సైతం అభివృద్ధి చేశారు. మరోపక్క రాజకీయంగా అప్పటి మంత్రి హరీష్ రావు ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటూ, హుజురాబాద్, కొడంగల్, నారాయణఖేడ్, మునుగోడు, స్టేషన్ ఘన్ పూర్ అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో, అలాగే జిహెచ్ఎంసి, సిద్దిపేట మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జిగా పనిచేస్తూ, త్రిముఖ రాజకీయ వ్యూహంతో టిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం రేయింబవండ్లు కష్టపడి చేస్తూ, వారిని గెలిపించడంలో కీలకంగా పనిచేశారు. 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో మండల కేంద్రమైన శివంపేట నుంచి ఎంపీటీసీగా పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొంది రెండవ పర్యాయం ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సమయంలో మండలాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా తీర్చిదిది, రాష్ట్రంలోనే ఉత్తమ ఎంపీపీగా, మంత్రి హరీష్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సభ్యుడిగా జిల్లా పరిషత్ లో సైతం పని చేశారు. 2021 సంవత్సరంలో ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అయితే టిఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి సోదరుడైన హవేలీ ఘన్ పూర్ ఎంపీపీ నారాయణరెడ్డి పేరును సూచిస్తూ, సీల్డ్ కవర్ లో ఉత్తర్వులు పంపింది. ఇక్కడ కూడా హరికృష్ణ తన రాజకీయ చతురత ప్రదర్శించారు జిల్లాలో ఉన్న ఎంపీపీలందరూ హరికృష్ణ నే, మా నాయకుడని, జిల్లా లోని ఎంపీపీ లందరూ ముక్తకంఠంతో ఎంపీపీల ఫోరం మెదక్ జిల్లా అధ్యక్షునిగా హరికృష్ణను ఎన్నుకున్నారు. 2023 సంవత్సరం ఫిబ్రవరి మాసంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షణలో జరిగిన జాతీయ సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుంచి హాజరై ఇక్కడి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను జాతీయ సదస్సులో సవివరంగా, వివరణలు ఇస్తూ, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మన్ననలు పొందారు. 2023 డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా హరికృష్ణ పోటీ చేసేందుకు, టికెట్ కోసం విశ్వ ప్రయత్నం చేశారు. కొన్ని కారణాలవల్ల హరికృష్ణకు పార్టీ టికెట్ రాకున్నా, ఆ ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం హరికృష్ణ చిత్తశుద్ధితో పనిచేసీ తన ప్రతిభను కనబరిచారు.




అయితే భవిష్యత్తులో తాను ఎమ్మెల్యేను అవుతానని అందుకు ప్రాణాళిక రచించుకొని హరికృష్ణ ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గ పునర్విభజనలో తూప్రాన్ గనుక నియోజవర్గ కేంద్రంగా ఏర్పడితే తూప్రాన్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు హరికృష్ణ ఇప్పటికే పావులు కదుపుతున్నారు. అందులో భాగంగానే ఆయన శివంపేట, వెల్దుర్తి, మాసాయిపేట, చేగుంట, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో ఇప్పటినుంచే విస్తృతంగా పర్యటిస్తూ, అక్కడ ఏ కార్యక్రమం జరిగిన అందులో భాగస్వామి అవుతున్నారు.

ఆయా మండలాల రాజకీయ నాయకులు, కార్యకర్తలతో మమేకం అవుతూ అందర్నీ కలుపుకొని ముందుకు సాగిపోతున్నారు

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ

## జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 31 :** 2025-26 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం క్రింద 1,5 తరగతులలో ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని 1వ తరగతికి (నాన్ రెసిడెన్షియల్-91 సీట్లు), 5వ తరగతికి (రెసిడెన్షియల్-92) సీట్లు కేటాయించడం జరిగిందని, షెడ్యూల్డ్ కులములకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు జూన్ 3వ తేదీ నుండి 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోపుగా దరఖాస్తు చేసుకోవాలని,దరఖాస్తులు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో లభిస్తాయని తెలిపారు. కుటుంబంలో ఒకరికి మాత్రమ ఈ పథకం వరిస్తుందని,తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1 లక్షా 50 వేల రూపాయలు,పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థులు జనన ధృవీకరణ పత్రం (1వ తరగతి అభ్యర్థులు జూన్ 1,2019 నుండి మే 31, 2020 మధ్య జన్మించి ఉండాలి),మీ-సేవ ద్వారా జారీ చేయబడిన కుల, ఆదాయ,నివాస ధృవీకరణ పత్రాలు,3 పాస్పోర్ట్ సైజ్ ఫొటోలు,పాఠశాల నుండి గత సంవత్సరం మార్కుల జాబితా నకలు ప్రతులు (5వ తరగతి అభ్యర్థులకు), అన్ని నకలు ప్రతులపై గెజిటెడ్ అధికారిచే ధృవీకరణ సంతకం చేయించాలని తెలిపారు. అభ్యర్థులు గడువులోగా దరఖాస్తులను జిల్లా షెడ్యూల్డ్ కులము అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందించాలని,ఆసక్తి,అర్హత గల విద్యార్థినీ,విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై మంత్రుల సబ్ కమిటీకి నివేదిక ఇచ్చిన త్రీమేన్ కమిటీ

## త్వరలో ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రుల సబ్ కమిటీ భేటీ



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కార కోసం రాష్ట్ర ప్రభుత్వం సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్ తదితర ఉన్నతాధికారులతో త్రీ మెన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఉద్యోగ సంఘాలతో భేటీ అయిన త్రీ మెన్ కమిటీ వారి సమస్యలకు సంబంధించిన విజ్ఞాపన పత్రాలు స్వీకరించింది. తదుపరి త్రీమెన్ కమిటీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన ఏర్పడిన సబ్ కమిటీకి శనివారం సాయంత్రం ప్రజాభవన్లో నివేదిక సమర్పించింది. సబ్ కమిటీలో సభ్యులైన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు సమావేశానికి హాజరయ్యారు. అధికారుల నుంచి నివేదిక స్వీకరించిన సబ్ కమిటీ ఆ నివేదికను పూర్తిగా అధ్యయన చేసి అతి త్వరలో ఉద్యోగ సంఘాలతో సమావేశం కావాలని నిర్ణయించింది.

## జర్నలిస్ట్ మునీర్ కు కార్మికుల ఘన నివాళి




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మే 31** :వార్తే ప్రజలు ప్రజలే నా జీవితం అని భావించిన నిబద్ధత గల నిజమైన సీనియర్ జర్నలిస్టు తెలంగాణ ఉద్యమ నేత ఎండి మునీర్ అని ఆయా కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే 5 గని పై శనివారం కార్మిక సంఘాలు కార్మికుల ఆధ్వర్యంలో మునీర్ సంతాప కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ బొగ్గు పేల్లకు గొంతుక ఉంటే ముందు పిలిచే పేరు మునీర్ అని కొనియాడారు. సింగరేణిలో బొగ్గు గని కార్మికునిగా వారి కష్టాలు కన్నీళ్లు సమస్యలు పరిష్కరించేందుకు యాజమాన్యం నిరంకుశ విధానాలపై పోరాటాలు సైతం చేసిన గొప్ప కార్మిక నాయకుడు కూడా అతడే అని తెలిపారు. సింగరేణిలో కార్మిక సంఘాల లోపాలను సైతం ఎండగట్టి వారు కార్మికులకు ఎలా పని చేయాలో సైతం సూచించిన మార్గదర్శకులు అన్నారు. 1980 ఎమర్జెన్సీ కాలంలో మందమర్రిలో దొరల భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు నడిపిన ఉద్యమ నాయకుడు అన్నారు. ఆ కాలంలో ప్రజలు స్వేచ్ఛ వాయువులు పీల్చుకున్నారంటే కేవలం మునీర్ పోరాటాల వల్లనే సాధ్యమైందని అన్నారు. పకృతి విరుద్ధంగా బొగ్గు బావుల లో పనిచేస్తూ ప్రాణాలను పనంగా పెట్టి నల్ల బంగారాన్ని వెలికి తీస్తున్న చీకటి సూర్యుల కన్నీటి కష్టాలను కడతెరిచేందుకు బండ కింద బ్రతుకులు అనే శీర్షిక పేరిట సంవత్సర కాలం పాటు ఆంధ్రజ్యోతిలో పత్రికలో కథనాలు రాసిన జర్నలిస్ట్ మునీర్ అని కొనియాడారు. కేకే అయిదు గనిలో కార్మికునిగా క్లర్కుగా రెండున్నర దశాబ్దాలు పనిచేశారని చెప్పారు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్రజలలో మమేకమై ప్రజలే వార్తలుగా వార్తలే ప్రజలుగా జీవించిన ధన్యజీవి అని చెప్పారు. ఎన్నోసార్లు మునీరును దొరలు హత్య చేయించాలని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని ప్రజలే కాపాడుకున్న చరిత్ర అతని ది అని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల పాటు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నటువంటి పరిణామాల గురించి అనేక వ్యాసాలు ప్రజలను చైతన్యం చేసిన నిజమైన జర్నలిస్టు అని తెలిపారు. ప్రాణాంతక వ్యాధి ఒకవైపు ప్రాణాలు తోడేస్తున్న పాలకవర్గ విధానాలను ప్రశ్నిస్తూ ప్రజల సమస్యలపై తన కలానికి బలంగా అని చెప్పిన ప్రజల గొంతుక కూడా అతడే అని అన్నారు. లక్షలాది ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న గొప్ప మేధావి నల్ల బంగారు నేలలో వికసించిన విప్లవాది అని చెప్పారు. స్వరాష్ట్ర సాధన కోసం సింగరేణి చీకటి సూర్యులు 35 రోజులు చేసిన సకల జనుల సమ్మె సింగరేణి జేఏసీ చైర్మన్గా ఆయన చేసిన పోరాటం పూర్తి అన్నారు. అంతేకాకుండా సింగరేణి కార్మిక ఉద్యమాల తో పాటు ప్రజా పోరాటాలు సామాజిక చైతన్య ఉద్యమాలలో ఆయన చెరగని ముద్ర వేశారని చెప్పారు. సింగరేణి సమస్త ఉన్నంతకాలం ప్రతి కార్మికుడు ఆయన పేరు స్మరించుకుంటూ నే ఉంటారని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన లక్ష్యంగా అందరూ ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి మునీర్ మిత్రుడు జి.చందర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా యూనియన్ ల నాయకులు భీమనాధుని సుదర్శన్. ఓ రాజశేఖర్, కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, ఆర్ నరేందర్, భీమర సదయ్య, ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# వాకింగ్ ట్రాక్ పనులను ప్రారంభించిన ప్రణవ్..

- హుజురాబాద్ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం.
- ఏళ్ళుగా పరిష్కారం కానీ పనులకు మోక్షం.
- సంతోషం వ్యక్తం చేసిన వాకర్స్.



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మే 31** హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని పదవి ఉన్నా లేకపోయినా రాజకీయాల కంటే హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికే విలువ ఇస్తానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శనివారం రోజున హుజురాబాద్ పట్టణంలోని హై స్కూల్ మైదానంలో వాకింగ్ చేసే వాకర్స్ కి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు పది లక్షల విలువ చేసే వాకింగ్ ట్రాక్ గేట్ పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏళ్ళుగా ఎదురుచూస్తున్న పనులకు మోక్షం లభిస్తుందని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మరోసారి రుజువు అయిందని గుర్తు చేశారు.ముఖ్యమంత్రి,జిల్లాకు సంబంధించిన మంత్రుల సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని,10నెలల క్రితం ఇక్కడికి వచ్చినప్పుడు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు ప్రారంభించామని, రాజకీయాలకు అతీతంగా హుజురాబాద్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



అభివృద్ధి పథకాలే మాకు శ్రీరామ రక్ష.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు లాంటి ప్రభుత్వ పథకాలే మాకు రక్షగా ఉంటాయని ప్రణవ్ అన్నారు.చిల్లర ఆరోపణలు చేసే ముందు నియోజక వర్గంలో ఒక్క ఇల్లు అయినా పేదలకు ఇచ్చారా అని ప్రశ్నించారు.ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ప్రభుత్వం ప్రవేశ పెట్టే పథకాలు ప్రజలకు అందేలాగ నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వాకింగ్ అసోసియేషన్ అధ్యక్షులు,మాజీ అధ్యక్షులు,వాకర్స్,వ్యవసాయ మార్కెట్ చైర్మెన్,హనుమాన్ దేవాలయ చైర్మెన్,కాంగ్రెస్ పార్టీ మండల,పట్టణ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు,పార్టీ సీనియర్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ అధ్యక్షులు, మైనారిటీ, సేవాదళ్ సెల్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వర్ణామృత ప్రాశన ఔషధ పంపిణీ కార్యక్రమానికి విశేష స్పందన



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మే 31** జమ్మికుంట పట్టణంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి వారి మంగళ శాసనాలతో సమాజసేవలో భాగంగా వికాస తరంగిణి జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాశన కార్యక్రమం నిర్వహించి, మొదటి విడత ఔషధం 6 నెలల వయసు నుండి 15 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న 260 పిల్లలకు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజున ఉదయం 7-00 గంటలకు నుండి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం జమ్మికుంట లో స్వర్ణామృత ప్రాశన ఔషధం ను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఔషధం ద్వారా పిల్లలకు రోగనిరోధక శక్తిని, జీర్ణక్రియను, మేధస్సును, జ్ఞాపక శక్తిని, మాటలు సరిగా రావడానికి తోడ్పడుతుంది, కోపాన్ని తగ్గిస్తుంది, కావున జమ్మికుంట చుట్టు ప్రక్కల ప్రాంతాలలో ఉన్న చిన్న పిల్లల తల్లితండ్రులకు ఈ సదవకాశాన్ని వినియోగించగలరని జమ్మికుంట వికాస తరంగిణి శాఖ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు వికాస తరంగిణి జిల్లా అధ్యక్షులు గౌతంరావు, ఆలయ చైర్మన్ ముక్క జితేందర్ గుప్తా,డింగరి హరికృష్ణమాచార్యులు, పుల్లూరి ప్రభాకరరావు, బచ్చు వీరలింగం, ముక్క శివకుమార్, రిటైర్డ్ సి. హెచ్.ఓ. రెడ్డి శంకర్ రెడ్డి, డాక్టర్ సురేష్ బాబు, అంతం రాజిరెడ్డి, పుల్లూరు శ్రీనివాస్, వెంకన్న, రవీందర్, ముస్కే వీరరాజు, తదితరులు పాల్గొన్నారు.



# కుబీర్ మార్కెట్ కార్యదర్శి గా జే రాజేశ్వర్



**నిర్మల్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే31** నిర్మల్ జిల్లా కుబీర్ మండల . కుబీర్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయ కార్యదర్శి గా జే రాజేశ్వర్ శనివారం నాడు బాధ్యతలు తీసుకోవడం జరిగింది. కుబీర్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా పని చేసిన కోడి గంగన్న పదవి విరమణ పొందడంతో ఆయన స్థానంలో భైంసా మార్కెట్ కార్యాలయంలో అకౌంటెంట్ గా పని చేస్తున్న జే రాజేశ్వర్ కు కుభీర్ మార్కెట్ కార్యదర్శి గా అదనపు బాధ్యతలు తీసుకున్నారు. జె రాజేశ్వర్ మాట్లాడుతూ మార్కెట్ కార్యాలయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యాలయ సిబ్బంది పూల గుజ్జులు అందజేశారు

## లారీ, ఆటో ట్రాలీ ఢీ ఒకరు మృతి

హైదరాబాద్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగినరోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. 13 మందికి గాయాలు అయ్యాయి. గోపనపల్లి ఎన్టీఆర్ నగర్ నుండి వట్టినాగులపల్లి కి 14 మంది కూలీలతో ట్రాలీ ఆటో వెళ్తుంది.. ఎదురుగా ఆర్ఎంసి లారీ వేగంగా,నిర్లక్ష్యంగా వచ్చి కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటోను ఢీకొంది. దాంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాలీలో వెళుతున్న 14 మందికి తీవ్ర గాయాలు కావడంతో ,చికిత్స నిమిత్తం హాస్పిటల్ కు తరలించారు. అందులో చికిత్స పొందుతూ దిల్ కుష్ అనే వ్యక్తి మృతి చెందాడు.

# కన్నూరి బుచ్చమ్మ చూపు సజీవం నేత్రదానంతో ఇద్దరికి చూపు



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మే 31**కన్నూరి బుచ్చమ్మ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతు 27.5.2025 రోజున మృతి చెందారు. ఇంతటి బాధాకర సమయంలో సైతం చూపులేని కుటుంబాల్లో వెలుగు నింపాలనే ఆలోచనతో వారి కుటుంబ సభ్యులు ముందుకు రావడం గొప్ప విషయం. కన్నూరి బుచ్చమ్మ కుటుంబ సభ్యులు నేత్రదానంపై అవగాహనతో ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ సహకారంతో నేత్ర సేకరణ చేసి హైదరాబాద్ ఐ బ్యాంక్ పంపడం జరిగింది.ఇద్దరు అంధులకు నేత్రాలను ఇచ్చి చూపును ప్రసాదించింది భర్త కన్నూరి మదనయ్య, కుమారులు మొగిలి, కోటేశ్వర్, సదానందం, కుమార్తె స్వరూపు మరియు బంధు మిత్రులను స్థానిక ప్రజలు, ఐ ఇన్స్టిట్యూట్ వారు అభినందించారు.

# జర్నలిస్టుల సమస్యలపై పోరాడేదే టీడబ్ల్యూజేఎఫ్,

## జూన్ 10న జిల్లా మహాసభలు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్రా ప్రధాన కార్యదర్శి బస్వపున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ,




వనపర్తి ప్రజాబలం ప్రతినిధి:(మే 31) జర్నలిస్టుల సమస్యలపై పోరాడేది టీడబ్ల్యూజేఎఫ్ సంఘం ఒకటేనని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బస్వపున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రధాన సమస్యలైన వైద్యం,అక్రిడేషన్ కార్డులు,ఇండ్లు తదితర సమస్యలపై సంఘం తీవ్ర స్థాయిలో కృషి చేస్తుందని వారు అన్నారు.ముఖ్యంగా జర్నలిస్టులు అందరు కూడా అక్రిడేషన్ కార్డుల కంటే సంస్థ ఇచ్చిన ఐడి కార్డుల ప్రధానమని,ఈ విషయాన్ని ప్రతి జర్నలిస్టు గమనించాలని వారు అన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిస్టుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని,అలాగే చిన్న పత్రికల పరిస్థితి మరీ దారుణంగా ఉందని వారన్నారు. ఈ పరిస్థితుల్లో జర్నలిస్టులంతా కలిసికట్టుగా ఉండి సమస్యల సాధన కోసం పాటుపడాలని వారన్నారు.అలాగే జిల్లా సంఘ సభ్యులందరూ కూడా ఐక్యమత్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు అన్నారు. ముఖ్యంగా జూన్ 10న జిల్లా మహాసభలు నిర్వహించనున్న సందర్భంగా ప్రతి జర్నలిస్టు కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేసి మహాసభలకు సమాయత్తం కావాలని వారు పిలుపునిచ్చారు. సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షులు సురేందర్ గౌడ్ అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వి.అశోక్ కుమార్, పరిపూర్ణం.నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు రామచంద్రయ్య,జిల్లా కార్యదర్శి పెద్దగారి స్వామి శ్రీనివాస్ గౌడ్ రాము. వెంకట్ వెంకట్ మరియు జిల్లాలోని టీడబ్ల్యూజేఎఫ్ సంఘ సభ్యులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాసభల నిర్వహణకు జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో పాటు శ్రీనివాస్ గౌడ్ రాము తో ఐదు మంది కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది ఈ కమిటీ ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు



# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో 100 రోజుల కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి..

## మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్..




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి మే 31**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నుండి 100 రోజుల వరకు ఏర్పాటు చేసిన ప్రతి కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, సంఘ సభ్యులు విధిగా కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ పతాక ఆవిష్కరణ మొదలుకొని సెప్టెంబర్ 9వ తేదీ వరకు కార్యక్రమాలు ఉన్నాయన్నారు. ప్రతి కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు మెప్మా సిబ్బంది, సంఘ సభ్యులు పలు కార్యక్రమాలలో హాజరు కావాలని ఆయన తెలిపారు. వార్డులలో డ్రైన్, నాళాలు గుర్తించాలని, చెత్త సేకరణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. చెత్త సేకరణ కార్యక్రమలపై వార్డులలో ప్రజలకు మరొక్కసారి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు మరింత చేరువ కావడానికి సోషల్ మీడియాలతో ప్రచారం చేయాలని, చెత్త సేకరణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావడానికి, పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులతో పాటు సంఘ సభ్యులు ర్యాలీలో ప్రతి సంఘం నుండి పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఏఈ నరేష్, వికాస్, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, వాణి, టిపిబిఒ దీపిక, శానిటరీ ఇనస్పెక్టర్ మహేష్, సదానందం, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ శ్రీకాంత్, మెప్మా సి.ఎల్.అర్పిలు జ్యోతి, మంజుల, సిబ్బంది రాజేందర్, కుమార్, ఉస్మాన్ పాషా, సంతోష్, లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ గడపాలి.

### జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఐపీఎస్

### శాలువా, పూలమాలతో సత్కరించిన జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి .



**మెదక్ ప్రజాబలం ప్రతినిధి :**-సుదీర్ఘకాలం పోలీసు వ్యవస్థకు సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఆర్ ఎసై. యశ్వంత్ రావు గారిని జిల్లా పోలీసు కార్యాలయానికి ఆహ్వానించి పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించిన్నారు. మొదటగా యశ్వంత్ రావు గారిని జిల్లా ఎస్పీ గారు పూలమాల శాలువా తో సత్కరించి బహుమతి ప్రధానం చేసి అభినందించారు. ఎలాంటి రీమార్కులు లేకుండా సర్వీసును పూర్తి చేసి పదవీ విరమణ పొందడం అభినందనీయమని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ,మరియు అదనపు ఎస్పి మహేందర్ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థకు చేసిన సేవలు మరువలేనివని, పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సంతోషంగా జీవించాలని తెలియజేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1983వ సంవత్సరంలో యస్వంత్ రావు పోలీసు కానిస్టేబుల్ గా జిల్లా పోలీసు వ్యవస్థలోకి అడుగుపెట్టి 42 సంవత్సరాల పాటు పోలీసు వ్యవస్థకు సేవలు అందించి ఈరోజు ఆర్ఎస్సై గా పదవి విరమణ పొందడం జరుగుతుంది. శాంతి భద్రతల పరిరక్షణలో తన వంతు పాత్రను పోషించడం జరిగింది. ముఖ్యంగా తన సర్వీసు మొత్తాన్ని ఎలాంటి రిమార్కులు లేకుండా పూర్తి చేసినందుకుగాను ప్రభుత్వం గుర్తించి సేవ, ఉత్తమ సేవా పథకాలతో గౌరవించింది. ఆర్ ఎస్సై శ్రీ. యస్వంత్ రావు గారిని చివరగా జిల్లా ఎస్పీ గారు మరియు సిబ్బంది కరతాల ధ్వనులతో అభినందనలు తెలియజేసి వీడ్కోలు పలకడం జరిగింది.



ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీ ఎస్ మహేందర్ మరియు ఏ ఆర్ డీఎస్పీ. శ్రీ. రంగా నాయక్ , మరియు యస్బి ఇన్స్పెక్టర్ శ్రీ సందీప్ రెడ్డి , మరియు రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీ.శైలందర్ మరియు ఏ. ఓ. శ్రీమతి మణి , మరియు శ్రీ.వాళ్య నాయక్ గారు, మరియు కుటుంబ సభ్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మణికొండ మున్సిపాల్టీపై నిరసన తెలిపిన సుమనళిని



**రాజేంద్రనగర్ ప్రజా బలం ప్రతినిధి 31 మే 2025**మణికొండ పైపులైన్ రోడ్డు నుండి అంజలి గార్డెన్ మీదుగా ల్యాంకో హిల్స్ కు వెళ్ళే రోడ్డు గత కొన్ని నెలల క్రితం టీం 4 అపార్ట్మెంట్ వారి నిర్వాకం వలన స్వలాభం కొరకు వారు డ్రైనేజ్ లైన్ వేయడం అది కాస్తా కుంగడం మునిసిపల్ అధికారులు కుంగిన రోడ్డుకు తు తూ మంత్రంగా మరమ్మత్తులు చేయడం పరిపాటిగా వస్తున్న ఆనవాయితీగా మారినది. ఇందు మూలాన రహదారి వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నను, ఇదే కారణముగా వాహనాలు ఢీకొట్టు కోవడం వలనను, పై పెచ్చు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా కలవని, జరిగిన సంఘటనల విషయమై పలు మార్లు పత్రికలలో వార్తలు రావడం జరిగినవని స్థానిక ప్రజలు వాపోయారు, ఇంత జరిగినను మునిసిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ బీటలు వారిన రోడ్డుకు కాంట్రాక్టరులను పెంచి పెద్దచేయడానికా అన్న చందన నాలుగైదు పర్యాయాలు చిన్నపాటి మరమ్మత్తులు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నరనీ, ఈ విషయమై ఎన్నోమార్లు పిర్యాదు చేసినను ప్రయోజనం శూన్యమని ఇందు మూలంగా ప్రజల నడ్డి విరుగక, ప్రాణాలకు ముప్పు జరుగక ముందే పర్యవసానంగా, శాశ్వత పరిష్కార మార్గంగా బందో బస్తుగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తు శుక్రవారం రోజున రోడ్డు పై కూర్చుని వినూత్న తరహాలో నిరసన కార్యక్రమం చేపట్టిన మణికొండ మహిళా మణి సుమ నళినికి స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున కొనియాడుతూ తమ సంపూర్ణ మద్దతును తెలుపడం జరిగినది.

# సిఐ బాధ్యతల స్వీకరణ



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 30 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ గా డి రమణమూర్తి స్థానిక సర్కిల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించారు.ఇంతకాలం ఇక్కడ సీఐ గా విధులు చేపట్టిన అల్లం నరేందర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో సిఐ గా పూర్తిబాధ్యతలు స్వీకరించారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ గారిని లక్షెట్టిపేట ఎస్సై సురేష్,జన్నారం ఎస్సై రాజవర్ధన్,దండేపల్లి ఎస్సై తహసోద్దీన్ తో పాటు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం,మొక్కలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నూతన సిఐ రమణమూర్తి గారు మాట్లాడుతూ...శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని,గంజాయి, మత్తు పదార్థాలకు యువత అలవాటు పడకూడదని,ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రత నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు.

# తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడిన ఉద్యమ నేత.

### పట్టు బట్టి జట్టు కట్టి జనం కోసం పాటు పడే గొప్ప వ్యక్తి హరికృష్ణ.

### జనం మెచ్చిన జనహృదయనేత కల్లూరి హరికృష్ణకు ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు.

### సీనియర్ యువజన నాయకులు పైనమ్ సందీప్.




**నర్సాపూర్ నియోజకవర్గం, శివ్వంపేట, మే, 31 ప్రజాబలం ప్రతినిధి :**-తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తెగించి కొట్లాడిన ఉద్యమ నాయకులు పట్టు బట్టి జట్టు కట్టి జనం కోసం పాటు పడే గొప్ప వ్యక్తి హరికృష్ణ కు జన్మదిన శుభాకాంక్షలు అంటూ వేనోళ్ళ పొగిడిన జనం నోట్లో నాలుకలా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులు ఉమ్మడి మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మెదక్ జిల్లా ఎంపీపీలపోరం అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ జన్మదిన సందర్భంగా ముందస్తుగా వారి అభిమానులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మెదక్ జిల్లా ప్రజలు ప్రజా ప్రతినిధులు చరవాణి ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నారు. బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా శివంపేట్ మండల అధ్యక్షులు,మెదక్ జిల్లా యూత్ నాయకులు పైనమ్ సందీప్ మాట్లాడుతూ మెదక్ జిల్లా ఎంపీపీల పోరం అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ సర్పంచ్ స్థాయి నుండి ఎన్నో పదవులు పోంది జనం మెచ్చిన జననాయకుడని రాష్ట్రస్థాయిలోనే మంచి గుర్తింపు పేరు ప్రఖ్యాతలు గాంచిన వ్యక్తి అని తెలిపారు. మెదక్ జిల్లాలోనే ప్రజల మనిషిగా పేరు ప్రఖ్యాతులు సముపార్జించాడని అందరి వాడులా అన్నా అంటే నేనున్నా అంటూ పిలిస్తే పలికే నాయకుడు హరికృష్ణ అని చెప్పొచ్చు.. అనంతరం చరవాణి ద్వారా మెదక్ జిల్లా ఎంపీపీల పోరం అధ్యక్షులు కల్లూరు హరికృష్ణ మాట్లాడుతూ ఇంత ఆధర అభిమానం చూపిస్తున్న ప్రజా ప్రతినిధులకు మెదక్ జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

# మణికొండలో మూత్రవిసర్జనకు ఇబ్బందాయే.



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 31 మే 2025**గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట భారత రాష్ట్ర సమితి - మణికొండ మునిసిపాలిటీ నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు శనివారం రోజున పైప్ లైన్ రోడ్డు సుందర్ గార్డెన్ పరిసర ప్రాంతాలలోని ప్రజలతో మమేకమై స్థానిక సమస్యల సేకరణలో చురుకుగా పాల్గొన్న సందర్భముగా స్థానికుల నుండి స్పందన బాగుందని తెలుపుతూ వారు ఎదుర్కుంటున్న ప్రధాన సమస్యలు: గడచిన ఐదు సంవత్సరాలలో గణనీయంగా జనాభా పెరిగిన మణికొండ పురపాలక సంఘ పరిధిలో జనవసరాలకు అనుగుణంగా తగినన్ని మరుగుదొడ్లు నిర్మించని కారణంగా మణికొండలో ప్రధాన రహదారి పైప్ లైన్ రోడ్డులో తిరిగే ప్రజలు సుందర్ గార్డెన్ ప్రక్కనున్న షిర్డీ సాయి నగర్ రోడ్డు నంబర్ 1 వీధిని మూత్ర విసర్జన కొరకు వాడుతున్నారు. ఈ వీధికి మూత్ర విసర్జన వీధి అని బోర్డు పెడితే బాగుంటుందని స్థానికులు వ్యంగగా తెలియజేశారు. ఇష్టానుసారంగా పెంచిన ఇంటి పన్ను విషయంలో నోటీసులు జారీ చేయనందుకు మరియు తమకు పెంచిన ఇంటి పన్నుపై కనీసం చట్టపరంగా విజ్ఞప్తి చేసుకునే అవకాశం ఇవ్వనందుకు స్థానికులు పురపాలక సంఘాన్ని తూర్పార బడుతున్నారు. రహదారి భద్రత విషయంలో సరైన సాంకేతికత పద్ధతులు పాటించకుండా తమ ఇష్టానుసారము స్పీడ్ బ్రేకర్లు నిర్మించడం వల్ల ద్విచక్ర వాహనదారులు మరియు గర్భిణి స్త్రీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆరోపించారు. ఇట్టి కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సీతారం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేందర్నాథ్ రెడ్డి, గోరుకంటి విఠల్, ఏర్పుల శ్రీకాంత్, సంగం శ్రీకాంత్, సుమనళిని, హరి, చెరుకూరి బాలాజీ, భాను చందర్, ఆరిఫ్ మహమ్మద్, యాలాల కిరణ్, షేక్ ఆరిఫ్, రాజేంద్ర ప్రసాద్, బుద్ధోలు బాబు, శ్రీనివాస్ చారి, తిరుపతి తది తరులు పాల్గొన్నారు.

# వేములవాడలో బాధ్యతలు చేపట్టిన నూతన సబ్ రిజిస్టర్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో గతంలో పనిచేసిన సబ్ రిజిస్టర్ రాజిరెడ్డి వేములవాడ నుండి మంచిర్యాల జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో కరీంనగర్ సబ్ రిజిస్టార్ గా పనిచేసిన భాస్కర్ ను వేములవాడ సబ్ రిజిస్టర్ ఆఫీసర్ గా ప్రభుత్వం నియమించడంతో ఆయన శుక్రవారం రోజున వేములవాడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ఆయనకు శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్టర్ భాస్కర్ మాట్లాడుతూ వేములవాడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేసే సిబ్బందితో కలిసి సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వచ్చే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ముగిస్తామని అని తెలిపారు.

# జోగిపేట నూతన తాసిల్దారుగా తెన్ మొలి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (మే 31 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, ఆందోల్ మండల కేంద్రంలోని, జోగిపేట, నూతన తహసిల్దారుగా, తెన్ మొలి, పదవి బాధ్యతలు స్వీకరించారు, రెండు నెలల క్రితం జోగిపేట తహసిల్దారుగా, పదవి బాధ్యతలు తీసుకున్న, ఉమాశంకర్, ఎస్సీ కార్పొరేషన్ కు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో, డి ఈ ఓ గా విధులు నిర్వహిస్తున్న, తెన్ మొలి, జోగిపేట తహసీల్దారుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.....

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన 36 మందిలో 14 మందికి జరిమానా, 22 మందికి జైలు శిక్షలు, జరిమానాలు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా తప్పదు, తస్మత్ జాగ్రత్త.

## వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 14 రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 36 మంది మందుబాబులు పట్టుబడగా వారిని వేములవాడ పోలీసులు శుక్రవారం రోజున కోర్టులో ప్రవేశపెట్టగా 14 మంది మందుబాబులకు జరిమానా 22 మందికి జైలు శిక్షలు మరియు జరిమానాలు 1).14 మందికి ఒక్కొక్కరికి 2000 రూపాయల జరిమానా,2). 11 మందికి 03 రోజులు జైలు శిక్ష,2000 జరిమానా,3).05 గురికి రెండు రోజుల జైలు శిక్ష,2000 వేల జరిమానా,4). నలుగురికి నాలుగు రోజుల జైలు శిక్ష,2000 జరిమానా,5) ఒక వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష,2000 జరిమానా,6). ఒక వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష,2000 జరిమానా మొత్తంగా(72,000/- రూపాయల) జరిమానా విధిస్తూ వేములవాడ జె ఎఫ్ సి ఎం మెజిస్ట్రేట్ ప్రవీణ్ తీర్పు వెల్లడించినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.



వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన మందుబాబులకు పట్టణ ఇన్స్పెక్టర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్ఐ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు.

ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతిరోజు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి వారి తల్లిదండ్రులు, లేదా కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుంది అన్నరు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుపడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశాలకు పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతాయని, ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ హెచ్చరించారు.

# హుండీ ఆదాయం పై ఉన్న శ్రద్ధ కోడెల సంరక్షణ మీద లేదు, విశ్వహిందూ పరిషత్ నాయకులు గడప కిషోర్.

## పూర్తిస్థాయి పశు వైద్యాధికారిని రాజన్న గోశాలలో నియమించాలి.
## గోశాలలో మరణించిన గోవుల పై విచారణ జరిపించాలి.
## గోశాల అధికారులు, సిబ్బందిపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి. విశ్వహిందూ పరిషత్ డిమాండ్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో కోడె మొక్కులు ఎంతో ప్రసిద్ధి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శివాలయాలలో ఎక్కడలేని ఆచారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో కోడెమొక్కుల ఆచారం కలదు. రాజన్న ఆలయానికి సంబంధించిన గోశాలలో సుమారు 1500 కోడెలు రాజన్న భక్తులు మొక్కుల రూపములో సమర్పించినవి ఉన్నాయి. రాజన్న ఆలయానికి కోడె మొక్కుల ద్వారా సంవత్సరానికి సుమారుగా 20 కోట్ల రూపాయల పైన ఆదాయం వస్తున్న, రాజన్న గోశాలలో మూగజీవాలకు పెట్టే ఖర్చు కేవలం సంవత్సరానికి సుమారు రెండు కోట్ల రూపాయలు మాత్రమే, అటువంటి కోడెల పై ఆలయ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నెల నెల వేలకు వేల రూపాయలు జీతాలు తీసుకుంటూ, మూగ జీవాల మరణానికి కారణం అవుతున్నారు. రాజన్న ఆలయ అధికారులకు హుండీ లెక్కింపు మీద ఉన్న శ్రద్ధ, రాజన్న గోశాలలోని కోడెల సంరక్షణపై లేదు, భక్తులు శివుని పై ఉన్న భక్తితో ఉచితంగా సమర్పించిన పశు వుల మేత అయిన వరి గడ్డి కట్టలు మొన్న కురిసిన వర్షానికి తడిసిపోయాయి. గోశాల మొత్తం బురదతో పేరుకుపోయింది. దీనితో నిత్యము కోడెలు మృతి చెందుతున్నాయి. గురువారం రోజున రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి గోశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి గోవుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపిన మరుసటిరోజే ఒకేసారి 8 గోవులు మరణించడం రాజన్న భక్తులకు తీవ్ర మనోవేదనను కలిగించింది. ఆలయ అధికారులు యుద్ధ ప్రాతిపదికపై గోశాల మరమ్మతులు చేసి కోడెలను సంరక్షించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు గడప కిషోర్రావు డిమాండ్ చేశారు.

రాజన్న గోశాలలో కేవలం 400 గోవులకు మాత్రమే సరిపోయే స్థలం ఉండడం, అందులో ప్రస్తుతం1500 గోవులను ఉంచడంతో భారీ వర్షాలకు నేల మొత్తం బురదమయమై, గోవులు పడుకోవడానికి వీలు లేకుండా రోజుల తరబడి నిలబడి ఉండడం వల్ల, గోవులు సరియైన సమయంలో ఆహారం లభించక, గోవులు ఒకదానికొకటి కొట్లాడుకొని శుక్రవారం వేకువజామున 8 గోవులు చనిపోవడం, చనిపోయిన గోవులను గోశాల సిబ్బంది చడి చప్పుడు కాకుండా గోశాల ట్రాక్టర్లో తరలించి వేములవాడ పట్టణానికి ఆనుకొని ఉన్న మూలవాగులో జెసిబి తో భారీ గుంతను తవ్వి పూడ్చిపెట్టారు. విషయం తెలుసుకున్న రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ వెంటనే స్పందించి అందుబాటులో ఉన్న పశు వైద్యాధికారులను వేములవాడ లోని రాజన్న గోషాలకు పంపి అనారోగ్యంతో ఉన్న గోవులకు చికిత్సలు చేయించారు. రాజన్న గోశాలలో గోవులు మరణించడం సర్వసాధారణమైపోయింది అని రాజన్న భక్తులు, వేములవాడ పట్టణ వాసులు తమ ఆవేదనను తెలుపుతున్నారు. ఇప్పటికైనా రాజన్న ఆలయ అధికారులు గోశాలలోని గోవులను కాపాడాలని రాజన్న భక్తులు కోరుతున్నారు.

# గల్ఫ్ కార్మికులకు అండగా రేవంత్ రెడ్డి సర్కార్. ఖాతార్ లోని లేబర్ క్యాంపలను సందర్శించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** గల్ఫ్ కార్మికులకు రేవంత్ రెడ్డి సర్కార్ అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ గల్ఫ్ సమితి ఖాతార్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో పాల్గొనేందుక ఖాతార్ వెళ్లిన ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ కు ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ విప్ శుక్రవారం రోజున ఖాతార్ లోని లేబర్ క్యాంపులను సందర్శించి లేబర్ ల బాధలు, కష్టాలు తెలుసుకొని వారికి ఆత్మస్థైర్యాన్ని, మనో నిబ్బరాన్ని నింపారు.

ప్రజా ప్రభుత్వంలో గల్ఫ్ కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ ఆధ్వర్యంలో చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వివరించారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం గల్ఫ్ లో మరణించిన కార్మిక కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా, ప్రవాసి ప్రజావాణి, గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకుల లో ప్రాధాన్యత, గల్ఫ్ సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన గల్ఫ్ అడ్వైజరీ కమిటీ గురించి వివరిస్తూ వారు ఇచ్చిన సూచనలను విని ఇంకా చేయాల్సిన విషయాలను రేవంత్ రెడ్డి తో మాట్లాడి గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ కమిటీ ఇప్పుడు పెట్టబోయే సమావేశంలో చర్చించి దాన్ని ప్రభుత్వ హయాంలో అమలు చేసే విధంగా చూస్తానని అని చెప్పారు.

గల్ఫ్ లో పనిచేసే ఇల్లు లేని పేద వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్, గల్ఫ్ వర్క్ వర్కర్స్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, గుగ్గిళ్ళ రవి గౌడ్, టిపిసిసి ఖాతార్ కన్వీనర్ నిజాముద్దీన్ ఖాజా, తెలంగాణ గల్ఫ్ సమితి ఖాతార్ ఫౌండర్ మెంబర్లు శంకర్ గౌడ్, ఎల్లన్న తల్లపల్లి, వెంకటేష్, ఎల్లన్న మండపల్లి, గడ్డి రాజు, చింతకుంట మహేందర్, సౌదీ నుండి తేలు నరేష్, భూమేష్, నగేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సమేతంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు జస్టిస్ శ్రీ అలిశెట్టి లక్ష్మీ నారాయణ.



శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనార్థం వేములవాడకు విచ్చేసిన తెలంగాణ హైకోర్టు జస్టిస్ అలిశెట్టి లక్ష్మీ నారాయణ గారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అటు తదుపరి న్యాయమూర్తి గారు శ్రీ లక్ష్మీ గణపతి దర్శనం, స్వామివారి దర్శనం మరియు అమ్మవార్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం ఆలయ అధికారులు అద్దాల మండపంలో ఆశీర్వచన ఏర్పాట్లు చేయగా, ఆలయ అర్చకులు మరియు వేద పండితులు అలిశెట్టి లక్ష్మీ నారాయణ గారికి వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జస్టిస్ గారికి శేషవస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.



# రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏసీబీ దాడులు.

## 15000 లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఎల్లారెడ్డిపేట సర్వేయర్ నాగరాజు.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట,( ప్రజాబలం ),** శనివారం రోజున సిరిసిల్ల అర్బన్ మండలం చంద్రంపేటలో ఏసీబీ అధికారులు దాడి చేసి ఎల్లారెడ్డిపేట తాసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సర్వేయర్ మల్లోజి నాగరాజు 15000/- రూపాయలు లంచం తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన జక్కాపురం మల్లేష్ అనే వ్యక్తి స్థలం సర్వే( భూమి కొలిచినందుకు ) చేసినందుకు లక్ష రూపాయలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసి చివరకు 80 వేల రూపాయలకు డీల్ కుదుర్చుకున్న సర్వేయర్.

గతంలో సర్వేయర్ నాగరాజుకు 21 వేల రూపాయలు ఇవ్వడం జరిగింది. శనివారం రోజున రెండో విడతగా 15 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

సర్వేయర్ నాగరాజును ఎల్లారెడ్డిపేట తాసిల్దార్ కార్యాలయం కు తరలించి, విచారిస్తున్న ఏసీబీ అధికారులు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ జెడ్పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ దంపతులు



**ఇల్లందు ప్రతినిధి మే 31 (ప్రజాబలం)**ఇల్లందు నియోజకవర్గం కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన గొడుగు రమేష్- చంద్రకళ ల కుమారుడు సాయికుమార్, సుచిత ( భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తర్వాత గ్రామానికి చెందిన నెల్లిపాక రాజు- పార్వతి, బేబీ ల కుమార్తె )ల వివాహం స్థానిక కళ్యాణ మండపంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ - అన్నపూర్ణ దంపతులు వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి నిండు నూరేళ్లు చల్లగా సుఖమయ దాంపత్యంతో కలిసిమెలిసి ఉండాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. వివాహ కార్యక్రమంలో కొంతమంది కాంగ్రెస్ పార్టీ అభిమానులు రాజీవ్ యువ వికాసం పథకం గురించి మాట్లాడగా దేశంలో ఎక్కడా లేనివిధంగా నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాస పథకం ను కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చి ఉపాధి కల్పించడం చాలా గొప్ప చారిత్రాత్మక నిర్ణయమని మల్లి బాబు యాదవ్ హర్షం ప్రకటించారు. మొదటి విడత లో 50 వేల రూపాయలు లక్ష రూపాయలు లోపు వరకు అవుతాయని, అంతకుమించి దరఖాస్తు చేసిన వారికి విడతల వారీగా మంజూరు చేయడం జరుగుతుందని, ఈ పథకం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో లేనప్పటికీరేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందని మల్లిబాబు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో బానోత్ నరసింహ నాయక్,మేకల మల్లికార్జునరావు, శీలం పుల్లయ్య, పాటిబండ్ల ప్రసాదు , రాయల నాగ శంకర్, పందుల రామ్మూర్తి, గంట శ్రీను, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు

## నేడు( ఆదివారం) వేములవాడ గోశాలలోని 300 లేగల పంపిణీ.

### అర్హులైన రైతులకు మాత్రమే అవకాశం.

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** అర్హులైన రైతులకు ఆదివారం వేములవాడ తిప్పాపూర్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలోని 300 లేగలను ఆదివారం సాయంత్రం మూడు గంటల నుండి పంపిణీ చేయనున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ శనివారం ఒక పట్టణలో తెలిపారు.

పట్టాదార్ పాసు బుక్కు కలిగిన అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న చిన్న కోడెలను ( లేగలను) పంపిణీ చేయనున్నామని స్పష్టం చేశారు. అర్హులైన రైతులు సంబంధిత పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు తదితర పత్రాలతో గోశాలకు రైతులు రావాలని, లేగలను పొందిన రైతులు వాటి సంరక్షణ సక్రమంగా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## అనుమతులు లేని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.

### ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేములవాడ మండల విద్యాధికారి కి వినతి పత్రం అందజేత.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** శనివారం రోజున వేములవాడ పట్టణంలో అనుమతులు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై తగు చర్యలు తీసుకొని మూసివేయాలని, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేములవాడ మండల విద్యాధికారి బన్నాజీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు పుట్టుకొస్తున్నయని విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలో అడ్మిషన్స్ చేస్తున్నారని అన్నారు. వెంటనే వేములవాడ మండల విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలలను నడిపిస్తూ, అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలపై తగు చర్యలు తీసుకొని అట్టి పాఠశాలలను మూసివేయాలన్నారు. అదేవిధంగా కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా, పాఠశాలలు ప్రారంభం కాకముందే అడ్మిషన్స్ చేస్తున్నారని, తోక పేర్లు పెట్టుకుని విద్యార్థులను మోసం చేస్తున్నారని, పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారని విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలలను వెంటనే తనిఖీ చేసి మూసివేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. లేనియెడల అనుమతి లేని పాఠశాలల ముందు ధర్నాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సంజన, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సాయి భరత్, శివ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్లు పంపిణి చేపిన రాష్ట్ర శాలివాహన (కుమ్మరి) సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్

విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు ఆదేశాలు మేరకు మే 31వ తేదీ తెల్లవారుజామున ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రెండవ డివిజన్ గుణదల కుమ్మరి బజార్ నందు లబ్ధిదారులకు స్వయంగా ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్లు పంపిణీ కార్యక్రమాని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ శాలివాహన (కుమ్మరి) సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ మీడియాతో మాట్లాడారు. ప్రజల వద్దకే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేయడం శుభపరిణామమని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా పెన్షన్లు పెంపుదల చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఒక ఆర్థిక భరోసా గా ఉంటుందన్నారు. తూర్పు ఎమ్మెల్యే గెద్దె రామ్మోహన్రావు కూడా ప్రతినిత్యం పేద వాళ్ళ ఆర్థికంగా ఎదగాలని లక్ష్యంతో నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా నూతనంగా శాలివాహన (కుమ్మరి) సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైనందుకు స్థానికంగా ఉన్న కుమ్మరి కాలనీ పెద్దలు, పేరేపి ఈశ్వర్ ని పుష్పగుచ్చాలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## కోడెల సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.

### అకాల వర్షాలు, అనారోగ్య కారణాలతో ఎనిమిది కోడెల మృతి.

### గోవుల మృతి పై అసత్య ప్రచారాలు చేయవద్దు.

### ఐదుగురు పశువైద్యాధికారులతో నిత్యం గోవులకు వైద్య చికిత్సలు.

### త్వరలో కోడెల పంపిణీకి ఏర్పాట్లు.

### రాజన్న గోశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాల లోని కోడెల సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆదేశించారు. తిప్పాపూర్ లోని రాజన్న గోశాలను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోవులకు అందిస్తున్న మేత, ఇతర పదార్థాల నాణ్యత, గోశాల పరిసరాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ అకాల వర్షాలు, గోవులకు అనారోగ్య కారణాలతో 8 కోడెలు మృతి చెందాయి అని తెలిపారు. మిగతా ఏ కోడెలు మృతి చెందలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అనవసరపు అసత్య ప్రచారాలు చేయవద్దని కలెక్టర్ సూచించారు. పశు వైద్యాధికారులు అంజిరెడ్డి, రాహుల్, అభిలాష్, సాహితీ, దీప్తి ఆధ్వర్యంలో కోడెలకు నిరంతరం వైద్యం అందిస్తున్నారని తెలిపారు.

కోడెల సంరక్షణను మరింత బాధ్యతాయుతంగా చూసుకోవాలని గోశాల సిబ్బందికి సూచించారు. నిత్యం గోవులకు అందించే దాణ, మేత విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. నిత్యం గోవులకు పచ్చి గడ్డి పెట్టాలని, గోశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. త్వరలో గోశాలలోని కోడెల పంపిణీకి తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.



## అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం..!

### వరి కొనుగోళ్లలో జాప్యం రోడ్డెకిన రైతన్నలు

### కాలయాపనతో ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

### ఆగ్రహంతో రైతుల ధర్నా

### పోలీసుల జోక్యంతో శాంతించిన అన్నదాతలు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి( మే 31 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, వరి కొనుగోలు లో జాప్యం వల్ల ఆగ్రహించిన రైతన్నలు, రోడ్డెక్కి నిరసన తెలిపారు, రైతుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అధికారులను ఆదేశించినప్పటికీ, ఫలితం లేకుండా పోయింది, ఆందోల్, నియోజకవర్గం లోని ఆయా మండలాల గ్రామాలలో, వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ, ధాన్యం కొనుగోలు విషయంలో, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, రైతులకు తిప్పలు తప్పడం లేదు, ఒకపక్క వర్షాలు పడడం, అధికారులు కాలయాపన చేయడంతో, రైతులు ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు, ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్న అధికారులపై రైతులు కన్నెర్ర చేశారు, తమ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదంటూ, 161వ జాతీయ రహదారిపై బైఠాయించారు, వడ్లను కొనుగోలు చేయడంలో ఏదో ఒక సాకు చూపి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ, అధికారుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు, ఈ సంఘటన అందోల్, నియోజకవర్గం అల్లాదుర్గం, మండలం గడి పెద్దాపూర్, 161 వ జాతీయ రహదారి పై గురువారం జరిగింది, ప్రభుత్వం గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, నేరుగా రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా ఉండేందుకు, చర్యలు చేపట్టింది, కానీ గడి పెద్దాపూర్, వద్ద ఐకెపి, ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో, రైతుల ధాన్యాన్ని తూకం వేసి నెల రోజులు గడుస్తున్నా, రైస్ మిల్లులకు తరలించడంలో, అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని, రైతన్నలు మండిపడ్డారు, ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే, లారీల కొరత ఉండడంవల్ల కొంత ఆలస్యం అవుతుందని, చెప్తున్నట్లు రైతులు తెలిపారు, ఒకవైపు వర్షాలతో రైతన్నలు అతలాకుతలమవుతుంటే, మరోవైపు అధికారులు తేమశాతం పేరిట, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, జిల్లా అధికారులు, వరి ధాన్యం రైస్ మిల్లులకు తరలించేందుకు, అదనంగా లారీలను అందుబాటులోకి తెచ్చామని చెబుతున్నప్పటికీ, మరి మండల స్థాయి అధికారులు, లారీల కొరత ఉందని తెలపడం ఏమిటో అని వారు ప్రశ్నిస్తున్నారు, విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు అక్కడికి చేరుకొని, రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసి , సంబంధిత అధికారులతో మాట్లాడి, లారీల కొరత లేకుండా, ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.....

## పని చేయని టోల్ ప్లాజా స్కానర్ భారీగా ట్రాఫిక్ జాం

నల్గొండ హైదరాబాద్ నుంచి విజయవాడ జాతీయ రహదారి పై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. పంతంగి టోల్ వద్ద టోల్ ప్లాజా స్కానర్ లు సాంకేతికంగా మొరాయించడంతో భారీ గా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనదారుల ఆగ్రహం పెరిగిపోవడంతో టోల్ సిబ్బంది వసూలు చేయకుండా వాహనాలను వదిలిపెడుతున్నారు.విజయవాడ వైపు వెళ్లే వాహనాల ప్రవాహం పెరగడంతో టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సమయంలో టోల్ వసూలు వ్యవస్థ సాంకేతికంగా మొరాయించడంతో స్కానింగ్ సమస్యలు, గేట్లు సరిగా పనిచేయకపోవడంతో వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోయాయి. వాహనదారులు ఆగ్రహంతో టోల్ సిబ్బందిని నిలదీసారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సాఫ్ట్వేర్ ప్రాబ్లెం కారణంగా ఫాస్ట్ ట్యాగ్ పని చేయకపోవడం, టోల్ సర్వర్ స్పందించకపోవడంతో హనాల రద్దీ పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో జామును తగ్గించేందుకు సిబ్బంది టోల్ వసూలు లేకుండానే వాహనాలను వదిలిపెడుతున్నారు తరచూ ఇలాగే సమస్యలు తలెత్తుతుండడం పట్ల వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తూ టోల్ నిర్వహణపై ప్రశ్నలు వేస్తున్నారు. ప్రముఖ హైవేపై ఇలాంటి అవ్యవస్థలు ప్రయాణికుల ఊపిరి పట్టేస్తున్నాయి.అధికారులు, టోల్ నిర్వాహకులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com